అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 07-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక

కార్పొరేట్, హిందూత్వ
ప్రతిఘటనకు కోటగా కేరళ
సమానత్వం, న్యాయం, లౌకికవాదం పరిరక్షణ పోరాటంలో దేశానికే ఆశాకిరణం : కేరళ 24వ రాష్ట్ర మహాసభ ప్రారంభోత్సవంలో ప్రకాశ్‌కరత్

వివరాలు 3లో..

సంపుటి : 11 సంచిక : 65
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50

లగచర్ల, హకీంపేట్ భూసేకరణపై హైకోర్టు స్టే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్ / కొడంగల్
వికారాబాద్ జిల్లాలోని లగచర్ల, హకీంపేట్‌లో బహుళ ప్రయోజన పారిశ్రామికవాడ ఏర్పాటు కోసం ప్రభుత్వం వెలువరించిన నోటిఫికేషన్ల అమలును తాత్కాలికంగా నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అత్యవసర భూసేకరణ నోటిఫికేషన్లలో అత్యవసరం ఏమిటో స్పష్టం చేయనందున స్టే ఆదేశాలను జారీ చేస్తున్నట్టు వివరించింది. ప్రభుత్వ వాదనలు...13లో

మధ్యప్రదేశ్‌లో ఖాకీ జులుం
గోవధ కేసులో నిందితులకు బహిరంగ దండన, పరేడ్
ఆవు మా తల్లి, పోలీసులు మా తండ్రి అని బలవంతపు నినాదాలు

వివరాలు 13లో..

బందీలను విడుదల చేయకపోతే
మీ అంతు చూస్తాం
గాజాపై ట్రంప్ తాజా బెదిరింపులు
శాశ్వత శాంతితోనే మిగిలిన బందీల విడుదల
బెదిరింపులను కొట్టిపారేసిన హమాస్

వివరాలు 13లో..

తెలంగాణ రైజింగ్ కాదు..ఫాలింగ్
జీఎస్టీ కలెక్షన్ దిగజారటానికి సీఎం అనాలోచిత చర్యలే కారణం : మాజీమంత్రి హరీశ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నది తెలంగాణ రైజింగ్ కాదనీ, ఫాలింగ్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది కరోనా సమయాన్ని తలపిస్తూ జీఎస్టీ కలెక్షన్ ఒక శాతం మాత్రమే నమోదు కావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి మరో నిదర్శనమని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తికి అద్దం పడుతుందని చెప్పారు. గత ఆరేండ్లలో జీఎస్టీ కలెక్షన్ వృద్ధి రేటు (2021 కరోనా సంవత్సరం మినహా) ఎప్పుడూ 6 శాతం కంటే ఎక్కువే నమోదైందని...13లో

ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన ముసాయిదా బిల్లులకు
క్యాబినెట్ ఆమోదం
డీలిమిటేషన్ అంశంపై అఖిలపక్ష సమావేశం

- 10,950 విలేజ్ లెవల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీకి ఓకే
- ఎఫ్‌సీడీఏ, యాదగిరి గుట్ట బోర్డులకు ఆమోదం
- మహిళా సంఘాల సభ్యత్వానికి వయో పరిమితి పెంపు
- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు
- ఆరు గంటల పాటు సుధీర్ఘంగా మంత్రివర్గ సమావేశం
- క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు పొంగులేటి, పొన్నం



11 జిల్లాలు 104 మండలాలు, 1355 గ్రామాలతో హెచ్‌ఎండీఏ విస్తరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన ముసాయిదా బిల్లులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నియోజకవర్గాల పునర్విభజనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశాన్ని నిర్ణయించి, అందులో వచ్చే అభిప్రాయాలను కేంద్రానికి నివేదించాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన క్యాబినెట్ ఆరు గంటలపాటు సుదీర్ఘంగా కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రివర్గంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ మీడియాకు వివరాలను వెల్లడించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణపై కీలక నిర్ణయం తీసుకున్నామని పొంగులేటి ఈ సందర్భంగా తెలిపారు. దానిపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన కొన్ని గంటల్లోనే అసెంబ్లీలో ప్రవేశపెడతామంటూ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్‌తోపాటు మంత్రి మండలి సబ్ కమిటీ ఇచ్చిన మధ్యంతర నివేదికపై 72 సూచనలు వచ్చాయన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణపై చట్టం తేవాలని క్యాబినెట్‌లో నిర్ణయించామన్నారు. తెలంగాణను మూడు కోర్ ఏరియాలుగా విభజించామనీ, ఓర్‌ఆర్‌ఆర్ నుంచి 2 కిలో మీటర్ల వరకు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వివరించారు. కొత్తగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)ని ఏర్పాటు చేయాలని క్యాబినెట్ తీర్మానించిందని తెలిపారు. అందుకు అవసరమైన 90 పోస్టులను భర్తీ చేసేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)ను 11 జిల్లాలు, 104 మండలాలు, 1,355 గ్రామాలకు విస్తరించాలని క్యాబినెట్‌లో నిర్ణయించినట్టు పొంగులేటి ఈ సందర్భంగా తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే సంకల్పంతో 'మహిళా శక్తి 2025' పాలసీకి ఆమోదం తెలిపామని చెప్పారు. 'సెర్ప్, మెప్మా విభాగాలను ఒకే గొడుగు కిందకు తేవాలని నిర్ణయించాం. డ్వాక్రా గ్రూపు సభ్యుల రిటైర్మెంట్ వయస్సును 60 నుంచి 65 ఏండ్లకు పొడగించాం. సభ్యుల కనిష్ట వయస్సును 18 ఏండ్ల నుంచి 15 ఏండ్లకు కుదించాం. యాదగిరి గుట్ట అభివృద్ధి కోసం టీటీడీ తరహాలో 'యాదగిరి లక్ష్మీనర్సింహ స్వామి బోర్డు' ఏర్పాటుకు ఆమోదం తెలిపాం. ఇందుకోసం 1987 దేవాదాయ చట్టాన్ని సవరించాం. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి కోసం 'తెలంగాణ టూరిజం పాలసీ 2025-30'ని ఆమోదించాం. రాష్ట్రవ్యాప్తంగా 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. రాబోయే 5 ఏండ్లల్లో రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 3 లక్షల మందికి ఉపాధి కల్పించటమే లక్ష్యంగా విధివిధానాలను రూపొందించాం. హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. గతంలో ప్రతి గ్రామానికి...2లో

ట్రంప్‌నకు తలొగ్గిన భారత్!
టెస్లాపై సుంకాల ఎత్తివేత యోచన
అమెరికన్ కంపెనీకి భారత్ రెడ్ కార్పెట్
కీలక వాణిజ్య చర్చలు ప్రారంభం
ఆర్థిక రాజధానిలో తొలి షోరూం ఏర్పాటు


ముంబయి : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ షరతులకు భారత్ తలొగ్గుతున్నట్టు స్పష్టమైన సంకేతాలు వస్తున్నాయి. ట్రంప్ అత్యంత సన్నిహితుడు ఎలన్ మస్క్ విద్యుత్ వాహనాల కంపెనీ టెస్లాకు అనుకూలంగా భారత్ తన విధానాలను మార్చుకుంటుందని సమాచారం. అమెరికా నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలను పూర్తిగా తొలగించేలా ఆ దేశంతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి. అదే జరిగితే ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడయిన ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లాకు మోడీ సర్కార్ రెడ్ కార్పెట్‌ను సిద్ధం చేసినట్టు అవుతుంది. ఎప్పటి నుంచో మస్క్ తన టెస్లా వ్యాపారాలను భారత్‌లో ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇటీవలే ప్రధాని మోడీ అమెరికా పర్యటనలో ట్రంప్, ఎలన్ మస్క్‌తో భేటీ అయ్యారు. ఆ సమావేశంలోనే మస్క్ డిమాండ్‌లకు కేంద్రం తలొగ్గి ఉంటుందని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

అమెరికా కార్ల దిగుమతిపై సుంకాల ఎత్తివేత అంశంపై త్వరలో భారత్, అమెరికా అధికారుల మధ్య వాణిజ్య ఒప్పందంపై కీలక చర్చలు జరగనున్నాయని జాతీయ మీడియాల్లో రిపోర్టులు వస్తోన్నాయి. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై టారిఫ్‌లు వేస్తామని ట్రంప్ ప్రకటించాక.. మోడీ సర్కార్ రాయబారానికి దిగినట్టు...13లో

ముంబయిలో షోరూం కోసం ఒప్పందం
టెస్లా కంపెనీ భారత్‌లో తన తొలి షోరూంను ముంబయిలో ఏర్పాటు చేయనుంది. ఇందుకు వీలుగా బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని అద్దెకు తీసుకుంది. ఇందుకు ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె చెల్లించనున్నారు. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేండ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. రూ.2.11 కోట్ల డిపాజిట్‌తో...13లో



జగిత్యాలలో ఆశా వర్కర్‌పై లైంగికదాడి
న్యాయం కోసం ఆశా వర్కర్ల యూనియన్, సీఐటీయూ ఆందోళన
కలెక్టరేట్ ముట్టడి, రాస్తారోకోతో దిగొచ్చిన అధికారులు
రక్షణ కల్పించేందుకు హామీ

నవతెలంగాణ - జగిత్యాల
జగిత్యాల జిల్లాలో లైంగికదాడికి గురైన ఆశా వర్కర్‌కు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ ఆఫీస్‌ను ముట్టడించారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అధికారులు స్పందించకపోవడంతో కలెక్టర్ ఆఫీసు నుంచి ప్రజావాణి చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. నాలుగు వైపులా రోడ్డు దిగ్బంధనం చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆందోళనలో పాల్గొన్న ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ.. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, ఆశా కార్యకర్తలకు భద్రత కల్పించాలని డిమాండ్...5లో

కేరళ నుంచి క్యాడవర్ డాగ్స్
కార్మికుల జాడ కోసం కొనసాగుతున్న సహాయక చర్యలు

- టన్నెల్‌లోకి సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- సొరంగంలో నుంచి దుర్గంధం
- మట్టి పనులకు ఆటంకం
- ప్రమాద ప్రదేశానికి రోబోలను పంపే యత్నం
- సాంకేతిక నిపుణులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల కృషి అభినందనీయం
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్




నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి
ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో కార్మికుల ఆచూకీ కోసం కేరళ నుంచి క్యాడవర్ డాగ్స్‌ను రప్పిస్తున్నారు. ప్రమాదం జరిగి 13 రోజులైనా కార్మికుల జాడ తెలియడం లేదు. రెస్క్యూ టీంలు ప్రాణాలకు తెగించి పని చేస్తున్నాయి. కార్మికుల కోసం చేయని ప్రయత్నాలంటూ లేవు. సిబ్బందికి రోజుకో సమస్య ఎదురవుతోంది. లోపల శానిటేషన్ సమస్య తలెత్తుతోంది. ఊట నీరు, మట్టి పేరుకు పోయి ప్రమాద స్థలం కాంక్రీట్‌గా మారింది. దీంతో మట్టిని వెలికి తీయడం కష్టంగా మారింది. టీబీఎం మిషన్ దగ్గర సొరంగం కూలుతుందనే భయాందోళన నెలకొంది. అందుకే ప్రభుత్వం రోబో టెక్నాలజీతో కార్మికులను రక్షించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఎన్వీ రోబో టెక్నాలజీ బృందాలను సొరంగంలోకి పంపి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ఏ పనికి ఎటువంటి రోబో వాడాలో నిశితంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే రోబోలు రంగంలోకి దిగుతాయి. ఐటీ నిపుణుల బృందంతో టన్నెల్‌లోకి వెళ్లిన సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అక్కడి పరిస్థితులను పరిశీలించి కార్మికులను వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నాయి. పరిస్థితులను ఎప్పటికప్పుడూ గమనిస్తూ సహాయక బృందాలకు దిశానిర్దేశం చేస్తున్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ పర్యవేక్షణలో నిర్విరామంగా...6లో

ప్రాధాన్యతలు పట్టని భారతీయ మీడియా
గిర్, వంటారాలో మోడీ పర్యటనలకు ప్రాచుర్యం

భారతీయ టీవీ ఛానల్స్ జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. వాస్తవానికి అవి ఆయా అంశాల నుండి మన దృష్టిని మరలించేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అమెరికా, ఉక్రెయిన్ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య శ్వేతసౌధంలో వాడి, వేడి సమావేశం జరిగి రెండు రోజులు కూడా కాకముందే భారతీయ టీవీ ఛానల్స్‌కు దాని కంటే అత్యంత ప్రాధాన్యత కలిగిన ఓ వార్త దొరికింది. అదే క్రికెటర్ రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై కాంగ్రెస్ నేత ఒకరు చేసిన వ్యాఖ్య. 29 సంవత్సరాల తర్వాత స్టాక్ మార్కెట్లు దారుణంగా కుప్పకూలి రూ.94 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైతే మన టీవీ ఛానల్స్ మాత్రం గిర్ జాతీయ పార్కులో ప్రధాని నరేంద్ర మోడీ జంతువులతో సరదాగా గడిపిన దృశ్యాలను పదే పదే ప్రసారం చేశాయి. మన టీవీ ఛానల్స్ పోకడలు ఎలా ఉంటున్నాయో చెప్పడానికి ఈ రెండు ఉదాహరణలు సరిపోతాయి.

- కాంగ్రెస్ మహిళా నేత వ్యాఖ్యలపై రచ్చ
- పరుష పదజాలంతో దూషణలు



న్యూఢిల్లీ : చైనా, కెనడా, మెక్సికో దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించారు. కానీ ఇది మన టీవీ ఛానల్స్‌కు పెద్దగా పట్టినట్లు లేదు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న వన్యప్రాణుల పునరావాస కేంద్రం వంటారాలో నరేంద్ర మోడీ జంతువుల పిల్లలకు ఆహారాన్ని అందిస్తున్న దృశ్యాలను అవి ప్రసారం చేశాయి. ఆ కేంద్రం వ్యాపారవేత్త ముకేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ మానస పుత్రిక. వంటారాలో మోడీ సేద తీరుతున్న దృశ్యాలు అనేక హిందీ, ఆంగ్ల ఛానల్స్‌లో వీక్షించి వీక్షకులు పరమానందభరితులయ్యారు. టీవీ ఛానల్స్ మాత్రమే కాదు...ది టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ టైమ్స్ వంటి ప్రముఖ పత్రికలు సైతం గిర్, వంటారాలో ప్రధాని పర్యటనలకు సంబంధించిన వార్తలను ప్రముఖంగా ప్రచురించాయి. మొదటి పేజీలోనూ, లోపలి పేజీల్లోనూ ఫొటోలు ఇచ్చాయి. బ్రిటీష్ రచయిత టీఎస్ ఎలాయిట్ చెప్పిన మాటలను మన ఛానల్స్, పత్రికలు బాగా...13లో

వన్యప్రాణులకు భద్రత కరువు
రెండేండ్లలో 286 సింహాలు, 456 చిరుతలు మృతి : గుజరాత్ రాష్ట్ర అటవీ మంత్రి ములుభాయ్ బెరా వెల్లడి

గాంధీనగర్ : గుజరాత్‌లో వన్యప్రాణులకు రక్షణ కరువైంది. గత రెండేండ్లలో 286 సింహాలు, 456 చిరుతలు చనిపోయాయి. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర అటవీ మంత్రి ములుభాయ్ బెరా చెప్పినట్టు పీటీఐ ఉటంకించింది. 58 మరణాలు వాహనాలు ఢీకొట్టడం లేదా బహిరంగ బావులలో మునిగిపోవడం వంటి అసహజ కారణాల వల్ల సంభవించాయని ములుభాయ్ బెరా ఆ రాష్ట్ర అసెంబ్లీకి వివరించారు. 2023లో 121 సింహాలు, 2024లో 165 సింహాలు చనిపోయాయన్నారు. జూన్ 2020లో నిర్వహించిన సింహాల గణన ప్రకారం ప్రధానంగా గుజరాత్‌లోని గిర్ వన్యప్రాణుల అభయారణ్యంలో 674 ఆసియాటిక్ సింహాలున్నాయి. ఇక 2023, 2024 ఏడాదులలో రాష్ట్రంలో 140 పిల్లలతో సహా 450 కి పైగా చిరుతలు చనిపోయాయని అటవీ మంత్రి తెలిపారు. వీటిలో 2023లో 225, 2024లో 231 మరణించాయి. 153 చిరుతపులుల మరణాలు అసహజ కారణాల వల్ల సంభవించాయని వివరించారు. అభయారణ్యాల గుండా వెళ్ళే రోడ్లపై ప్రభుత్వం స్పీడ్...13లో



మహిళలు అన్ని రంగాల్లోనూ
రాణించాలి
వారి పాత్ర 50 శాతముంటేనే అభివృద్ధి సాధ్యం
కోలిండియాలో జ్యోతి ఉమెన్ లీడర్ షిప్ కార్యక్రమం ద్వారా మహిళలకు ట్రైనింగ్ : కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి
మైనింగ్ రంగంలో మహిళలను ప్రోత్సహించాలి : స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. మహిళల పాత్ర అన్ని రంగాల్లోనూ 50శాతం దాటితేనే అభివృద్ధి సాధ్యమని అభిప్రాయ పడ్డారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని...5లో

అమెరికా-కెనడాల మధ్య వాణిజ్య యుద్ధమే

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో




టోరంటో: భారీ స్థాయిలో ట్రంప్ సర్కార్ విధిస్తున్న సుంకాలపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ట్రంప్‌తో చర్చలు నిర్మాణాత్మకంగా జరిగినప్పటికీ.. కెనడా-అమెరికాలు భవిష్యత్తులో వాణిజ్య యుద్ధంలో ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాన్నట్లు చెప్పారు. సుంకాల అమలును నెలరోజుల పాటు వాయిదా వేస్తామని అమెరికా సంకేతాలు ఇవ్వడం స్వాగతించదగిన విషయమన్నారు. అయినప్పటికీ.. ప్రతీకార సుంకాలు విధించే ప్రణాళికలో ఎటువంటి మార్పు లేదన్నారు."టారిఫ్‌లపై ఇరు దేశాలు చర్చలు జరిపాయి. కార్మికులతోపాటు నిర్దిష్ట రంగాలపై వీటి ప్రభావం పడకుండా ఉండేందుకు సంప్రదింపులు కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో కెనడా వస్తువులపై అమెరికా సుంకాలు ఎత్తివేసే వరకు ప్రతీకార సుంకాలపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని కెనడా ప్రధాని ట్రూడో స్పష్టం చేశారు.కెనడా, మెక్సికోతోపాటు చైనాపై డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించడం ఆయా దేశాలతో వాణిజ్య యుద్ధానికి కారణమైంది. దీంతో ఆయా దేశాలు ప్రతీకార సుంకాలు విధించే పనిలో పడ్డాయి. ఈ క్రమంలో ట్రూడో ప్రతీకార సుంకాలపై అమెరికా అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలో కొనసాగడానికి సుంకాల వివాదాన్ని ట్రూడో వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. కెనడా ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్న విషయాన్ని తెలుసుకోవాలని తాను ప్రయత్నించినప్పటికీ.. అక్కడ నుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు.

హైదరాబాద్‌లో నాలుగు కొత్త నివాస ప్రాజెక్టులు

- కాసాగ్రాండ్ వెల్లడి

నవ తెలంగాణ - హైదరాబాద్



ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లలో ఒక్కటైన కాసాగ్రాండ్ తన కార్య కలాపాలను విస్తరిస్తున్నట్టు వెల్లడించింది. బుధవారం హైదరాబాద్‌లో ఆ సంస్థ వ్యవస్థాపకుడు, ఎండీ అరుణ్ ఎంఎన్ మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కొత్తగా నాలుగు నివాస ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. మంఖల్, అత్తాపూర్, గౌడవెల్లి, కొంపల్లి వంటి కీలక ప్రదేశాలలో 27.4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నివాస కమ్యూనిటీలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇందుకోసం రూ.250 కోట్ల పెట్టుబడుల వ్యయం చేయనున్నామని చెప్పారు. గృహ కొనుగోలు దారుల అవసరాలను తీర్చేలా అంతర్జాతీయ సౌకర్యాలతో డిజైన్ చేశామన్నారు. కొంపల్లిలో 6.8 ఎకరాల విస్తీర్ణంలో రూపొందు తున్న 'కాసాగ్రాండ్ ఈవాన్'లో 579 నివాసా లను అందుబాటులోకి తేనున్నా మన్నారు.

గృహాల ధరలు రూ. 1.4 కోట్ల నుంచి ప్రారంభ మవుతా యన్నారు.మంఖల్‌లో 'కాసాగ్రాండ్ విండ్సర్ కోర్ట్' విల్లా కమ్యూనిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలో మరో నాలుగు ప్రాజెక్టులను చేపట్టే యోచనలో ఉన్నామని ఆ సంస్థ హైదరాబాద్ జోనల్ హెడ్ సాయి ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఒక నివాస ప్రాజెక్టును పూర్తి చేశామని.. తాజాగా నాలుగు ప్రకటిం చామ ని.. మరో నాలుగు రావడం ద్వారా ఇక్కడ మొత్తంగా తొమ్మిది ప్రాజెక్టులకు చేరనున్నాయన్నారు.

శ్రీనందిని ఫార్మాపై డీసీఏ దాడులు

- టెటానస్ వ్యాక్సిన్, ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు సీజ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ సుల్తాన్‌బజార్‌లోని ఔషధాల హెూల్‌సేల్ పంపిణీదారు శ్రీనందిని ఫార్మాపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేసిన తనిఖీల్లో గది ఉష్ణోగ్రతలో టెటానస్ వ్యాక్సిన్, ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను నిల్వ ఉంచినట్టు గుర్తించి సీజ్ చేశారు. సున్నితమైన ఈ ఔషధాలను తప్పని సరిగా రెండు సెంటిగ్రేడ్ల నుంచి 8 సెంటిగ్రేడ్ల మధ్య రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచాలని అధికారులు తెలిపారు. అప్పుడే వాటి ఔషధ గుణం (ఎఫిషియెన్సీ) ఉంటుందని చెప్పారు. గది ఉష్ణోగ్రతలో వాటిని నిల్వ ఉంచుతారో వాటికి ఉండాల్సిన పొటెన్సీ తగ్గిపోతుం దన్నారు. ఇలాంటివి ఉపయోగిస్తే రోగుల ఆరోగ్యంపై దుష్ప్రభావం పడొచ్చని హెచ్చరించారు. వీటి విలువ రూ.10 వేల వరకుంటుంది. శ్రీనందిని ఫార్మా ప్రొప్రయిటర్ మిత్తింటి శ్రీనివాస్ దాడుల సమయంలో అక్కడే ఉన్నారు. తదుపరి విచారణ కొనసాగుతుందని చట్టప్రకారం నిందితులపై చర్యలుంటాయని అధికారులు వెల్లడించారు.

జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి త్వరలో కొత్త విధానం

మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమం కోసం కొత్త విధానాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమం, వైద్యం, అభివృద్ధి, వేతనాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో చర్చించి ఒక కొత్త విధానాన్ని తీసుకురావడానికి కృషి చేస్తానని ఆమె చెప్పారు. "ది జర్నలిస్టు కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్" ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని సొసైటీలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. సొసైటీలోని సీనియర్ మహిళా జర్నలిస్టులను ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే ఒక ఉద్యమ ఉత్సాహమన్నారు. వార్తల సేకరణలో మహిళా జర్నలిస్టులు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. కుంభకోణాలను బయటికి తీయడానికి కూడా వెనుకాడని ధైర్యవంతులు ఉన్న మీడియా రంగంలో పని చేస్తున్న మహిళలకు సైతం లైంగిక వేధింపులు, వేతనాల్లో అసమానతలు, వివక్ష తప్పడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రపంచానికి తెలియజేయడంలో మీడియా పాత్ర కీలకం అని చెప్పారు. అనంతరం సొసైటీ సభ్యులు, మహిళా జర్నలిస్టులు కలసి సీతక్కను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెస్ అకాడమీ చైర్మెన్ దేవులపల్లి అమర్, సొసైటీ కార్యదర్శి రవీంద్ర బాబు, ఉపాధ్యక్షుడు లక్ష్మి నారాయణ, సంయుక్త కార్యదర్శి డా. చల్లా భాగ్యలక్ష్మి, కోశాధికారి బి.మహేశ్వర్ గౌడ్, ఎంసీ మెంబర్ కమలాకరాచార్యతో పాటు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన ముసాయిదా బిల్లులకు క్యాబినెట్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ఒక వీఆర్ఏ, ఒకటి రెండు గ్రామాలకు కలిపి వీఆర్‌వోలు ఉండేవారు. వారి స్థానంలో రాష్ట్రంలోని 10,950 గ్రామాలకు విలేజ్ లెవెల్ ఆఫీసర్స్ పోస్టులను క్యాబినెట్‌లో ఆమోదించాం. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన రెవెన్యూ డివిజన్లు, మండలాలకు 361 పోస్టులను భర్తీ చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. గందమల్ల రిజర్వాయర్ కెపాసిటీని 4.28 టీఎంసీల నుంచి 1.41 టీఎంసీకి తగ్గించాలని నిర్ణయించాం. 2025 పారా ఒలంపిక్ కాంస్య విజేత దీప్తి దివాంజికి ఉద్యోగం కల్పించాలని నిర్ణయించాం. రెసిడెన్షియల్ స్కూళ్లలో కొత్తగా 330 పోస్టులను భర్తీ చేయాలని తీర్మానించాం...' అని పొంగులేటి వివరించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్ విభజించేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విభజనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ ప్రజల మనోభావాలను కేంద్రానికి తెలపాలని నిర్ణయించామని అన్నారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... తొలి విడత కుల గణన సర్వేలో పాల్గొనని వారి కోసం రెండోసారి అవకాశమిచ్చామని గుర్తు చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రెండు వేర్వేరు తీర్మానాలను అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదిస్తామని తెలిపారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 97.61శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటన విడుదల చేశారు. రెండోరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షను నిర్వహించామని తెలిపారు. 4,52,028 మంది దరఖాస్తు చేయగా, 4,40,513 (97.61 శాతం) మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,823 (2.39 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. జగిత్యాలలో మూడు, నిజామాబాద్‌లో ఒకటి చొప్పున నలుగురు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు సంగారెడ్డి, మెదక్, జగిత్యాల, భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో పర్యటించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయనీ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తలేదని స్పష్టం చేశారు.

సమస్యల సుడిగుండంలో ఏకలవ్య పాఠశాలలు

నత్తనడకన కేంద్రీకృత ప్రక్రియ

• అటకెక్కుతున్న ప్రతిపాదనలు • కొరవడిన జాతీయ సొసైటీ పర్యవేక్షణ

న్యూఢిల్లీ : ఏకలవ్య పాఠశాలల నిర్వహణను కేంద్రీకృతం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాల్లో ఆశించిన పురోగతి కన్పించడం లేదు. 2020లో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) పథకాన్ని సవరించింది.

ఫిబ్రవరి నాటికి 728 ఏకలవ్య పాఠశాలల్ని మంజూరు చేసింది. అయితే వీటిలో 477 పాఠశాలలు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈఎంఆర్ఎస్‌లు గిరిజన పిల్లల కోసం ఉద్దేశించినవి. వీటిని జవహర్ నవోదయ విద్యాలయాల స్థాయికి తీసి కెళ్లాలని, ఆ ప్రమాణాలు పాటించాలని ప్రభుత్వం యోచించింది. ఇందు కోసం ఏకలవ్య పాఠశాలల వ్యవహారాలను కేంద్రీకృతం చేయాలని నిర్ణయిం చింది. అయితే ఈ విషయంలో ఆశించిన పురోగతి కానరావడం లేదు.



అధికారాలు లేని జాతీయ సొసైటీ

ఏకలవ్య పాఠశాలల్లో ఆరు వేల మంది సిబ్బందిని నియమించేందుకు, పాఠశాలల నిర్వహణ కోసం ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు, జవహర్ నవోదయ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ఈ విద్యార్థులకు కూడా ఖర్చులు భరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఇవన్నీ ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ఏకలవ్య పాఠశాలలను కేంద్రీకృతం చేయాలన్న లక్ష్యంతో గిరిజన విద్యార్థుల జాతీయ విద్యా సొసైటీ (ఎన్ఈఎస్‌టీఎస్)ని ఏర్పాటు చేశారు. అయితే దీనికి రాష్ట్ర సొసైటీలపై ఎలాంటి అధికారాలు కల్పించలేదు. రాష్ట్ర సొసైటీలు ఏకలవ్య పాఠశాలల రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటాయి.వాస్తవానికి ఈ సొసైటీల్లో జరిగిన ఆర్థిక అవకతవకలను ఎన్ఈఎస్‌టీఎస్ వెలికితీసింది.

'హిందీ' తప్పనిసరితో ఇబ్బందులు

ఏకలవ్య పాఠశాలల్ని కేంద్రీకృతం చేస్తున్నామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 బడ్జెట్ ప్రసంగంలో తొలిసారిగా ప్రకటించారు. రాబోయే మూడు సంవత్సరాలలో 38 వేల మంది సిబ్బందిని నియమిస్తామని ఆమె చెప్పారు.

తొలి రౌండ్ నియామకాలు గత సంవత్సరం పూర్తయ్యాయి. 10 వేల మంది సిబ్బందిని తీసుకున్నారు. అయితే ఈ ప్రక్రియలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని, హిందీలో ప్రావీణ్యం తప్పనిసరి చేయడంతో ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు అంటున్నారు. హిందీ రాష్ట్రాల నుండి నియమితులైన అనేక మంది ఉపాధ్యాయులకు దక్షిణాది రాష్ట్రాల్లో పోస్టింగులు ఇచ్చారు. ఫలితంగా ఆహారం, సంస్కృతి వంటి విషయాలలో వారు సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో తమను బదిలీ చేయాలంటూ వారి నుండి అభ్యర్థలను వెల్లువెత్తుతున్నాయి.

సిబ్బంది కొరత


2020లో ఈఎంఆర్ఎస్ పథకాన్ని సవరించినప్పటి నుండి కేంద్రం అత్యుత్సాహంతో కొత్త పాఠశాలలకు అనుమతులు మంజూరు చేసింది. ఫిబ్రవరి 28వ తేదీ వరకూ 728 ఏకలవ్య పాఠశాలలకు అనుమతులు మంజూరయ్యాయి. అయితే వీటిలో 477 మాత్రమే పనిచేస్తున్నాయి. ఒక్కో పాఠశాలలో 28 మంది శాశ్వత, ఆరుగురు తాత్కాలిక సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో కూడా ఎక్కువ మంది రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే. వారినే కన్సల్టెంట్లుగా నియమించుకొని నెట్టుకొస్తున్నారు. జవహర్ నవోదయ విద్యాలయాల విషయానికి వస్తే 661 పాఠశాలలకు అనుమతి మంజూరైంది. వీటిని నవోదయ విద్యాలయ సమితి నిర్వహిస్తోంది. దానికి ఓ కేంద్ర కార్యాలయం, ఎనిమిది ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో 491 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

వీటికి మోక్షమెప్పుడు ?

నియామకాలకు నిర్దేశించుకున్న గడువులో ఓ సంవత్సరం మాత్రమే మిగిలి ఉంది. రెండో విడతగా ఆరు వేల మంది సిబ్బందిని నియమించుకోవాలన్న ప్రతిపాదన గత మూడు నెలలుగా గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వద్ద పెండింగులో ఉంది. దీంతో కేంద్రీకృత ప్రక్రియపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి ఓ అధికారి అంగీకరించారు. ఒక్కో విద్యార్థిపై 2020లో రూ.1.09 లక్షలు ఖర్చు చేయగా దానిని జేఎన్‌వీలతో సమానంగా రూ.1.70 లక్షలకు పెంచాలన్న ప్రతిపాదన వ్యయ శాఖ ఆమోదం కోసం ఎదురు చూస్తోంది. ఇక ఎన్ఈఎస్‌టీఎస్‌కు రాష్ట్ర సొసైటీపై ఎలాంటి తనిఖీలు, పర్యవేక్షణ అధికారాలు లేకుండా పోయింది. రాష్ట్ర సొసైటీల నిర్వహణలో ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయని ఎన్ఈఎస్‌టీఎస్ తన అంతర్గత సర్క్యులర్లలో తెలిపింది. పాఠశాలలు యూనిఫారాలు, పుస్తకాలు వంటివి కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ పని చేయడం లేదని, అయితే అందుకోసం డబ్బును తల్లిదండ్రుల ఖాతాలకు బదిలీ చేస్తున్నాయని గుర్తించింది. రాష్ట్ర సొసైటీలు ప్రాంతీయ కార్యాలయాలుగా పనిచేయాల్సి ఉంటుందంటూ గత డిసెంబరులో ఓ సర్క్యులర్‌ను జారీ చేశారు. ఎన్ఈఎస్‌టీఎస్ అధికారాలను ధిక్కరించవద్దని కొత్తగా నియమితులైన సిబ్బందికి అందులో హెచ్చరికలు చేశారు. మరోవైపు ఎన్ఈఎస్‌టీఎస్‌లో పోస్టుల భర్తీ ఓ పెద్ద పనిగా మారింది. అందులో పదోన్నతులకు అవకాశమే లేదు. వేతనాలు కూడా చాలా తక్కువగా ఉంటాయి.

లైంగికదాడి నిందితునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జగిత్యాల జిల్లా రాయికల్‌లో దళిత మహిళైన ఆశావర్కర్ విధులను పూర్తిచేసుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా ఓ వ్యక్తి ఆమెను బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఈ ఘటన జరిగి వారం రోజులవుతున్నా పోలీసులు నిందితున్ని ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని విమర్శించారు. ఆ నిందితునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గురువారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్లక్ష్యం, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇవి పునరావృతం కాకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. మహిళల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో బాధితురాలికి సరైన వైద్యం అందించలేదని తెలిపారు. పోలీస్ యంత్రాంగం నిందితునికి అండగా ఉండి, బాధితురాలికి అన్యాయం చేసే వైఖరిని అవలంబిస్తోన్నట్టు కనపడుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితున్ని కఠినంగా శిక్షించాలని కోరారు. బాధితురాలికి సరైన వైద్యం అందించాలనీ, ఇంటి స్థలమిచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం, ఇతర ఆర్థిక సహాయ సహకారాలను ప్రభుత్వం అందించాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

ఆశావర్కర్‌పై లైంగికదాడి నిందితున్ని శిక్షించాలి

• ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

• పోలీసులు నిర్లక్ష్యం వీడాలి : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆశా వర్కర్‌పై లైంగిక దాడి జరిగి వారం గడిచినా పోలీసులు పట్టించు కోకుండా నిర్లక్ష్యం వహించడం దారుణ మని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు విమర్శించారు. నింది తున్ని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగిత్యాల జిల్లా రాయికల్‌లో శివరాత్రి రోజు డ్యూటీ పూర్తిచేసుకొని ఇంటికి తిరిగి వెళ్తున్న దళిత ఆశావర్కర్‌ను ఓ వ్యక్తి బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడని తెలిపారు.

ఘటన జరిగి వారం అవుతున్నా నేటికీ ఆ నిందితుడిని పోలీసులు అరెస్టు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత ఆశా వర్కర్‌కు మెరుగైన వైద్యం చేయించాలని కోరారు. ఆ నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి పరిహారం, ఇంటిస్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. పోలీస్ యంత్రాంగం నిందితునికి అండగా ఉండి, బాధితురాలికి అన్యాయం చేసే వైఖరి అవలంబిస్తోన్నట్టు కనిపిస్తోందని విమర్శించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఈ ఘటనను పౌర సమాజం తీవ్రంగా ఖండించాలనీ, రాష్ట్రంలో మరో ఘటన జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పున:పరిశీలనపై ఏప్రిల్‌లో నిర్ణయం

ఈడీ అధికారాల పరిరక్షణ తీర్పుపై సుప్రీం వెల్లడి


న్యూఢిల్లీ : మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద అరెస్టు చేయడానికి, ఆస్తులు జప్తు చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారాలను పరిరక్షిస్తూ 2022లో తాము ఇచ్చిన తీర్పును పున:పరిశీలించాల్సిన అవసరం వుందా లేదా అనే అంశంపై ఏప్రిల్‌లో నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు వెల్లడించింది. త్రిసభ్య ధర్మాసనం దీనిపై విచారణ జరపాల్సి వుందని, పొరపాటున ద్విసభ్య ధర్మాసనానికి నివేదించారని గురువారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా,



బెంచ్ అభిప్రాయంతో ఏకీభవించారు. ఏప్రిల్ చివరలో గానీ మే మొదటి వారంలోగానీ దీనిపై విచారణకు ఆదేశించా ల్సిందిగా కోరారు. పిటిషనర్ తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ త్రిసభ్య ధర్మాసనంతో అత్యవసరంగా ఈ అంశంపై విచారణ జరపాల్సి వుందన్నారు. త్రిసభ్య ధర్మాసనం ముందే ఈ అంశాన్ని పెట్టాల్సిందిగా తాను అడ్మినిస్ట్రేటివ్ విభాగాన్ని ఆదేశించానని, కానీ ద్విసభ్య ధర్మాసనం ముందుకు ఎలా వచ్చిందో తెలియడం లేదని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. 2022 జులై 27నాటి తీర్పును పున:పరిశీలించాలని కోరుతూ దాఖలైన అనేక పిటిషన్లను సుప్రీం విచారిస్తోంది.

నా అప్పగింతపై స్టే విధించండి

అమెరికా సుప్రీంకోర్టులో తహవ్వూర్ రాణా పిటిషన్



న్యూఢిల్లీ : తనను భారత్‌కు అప్పగించడంపై అత్యవసర స్టే విధించాలని కోరుతూ 26/11 దాడి కేసులో నిందితుడు తహవ్వూర్ రాణా అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భారత్‌లో తనను విచారిస్తే వివిధ కారణాలతో తాను ఎక్కువ కాలం జీవించలేనని పిటిషన్‌లో రాణా తెలిపారు. 'ఒక వేళ స్టేను అమలు చేయకపోతే, ఇక ఎక్కడా సమీక్ష చేయడానికి ఉండదు. అమెరికా కోర్టులు తమ అధికార పరిధిని కోల్పోతాయి. పిటిషనర్ త్వరగా చనిపోతాడు' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. తాను పాకిస్థాన్‌కు చెందిన ముస్లింను కాబటి, భారత్‌లో విచారణ సమయంలో హింసకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోడీ ప్రభుత్వ హయంలో మైనార్టీలపై ము ఖ్యంగా ముస్లింలపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయనే హ్యూమన్ రైట్స్ వాచ్ 2023 వరల్డ్ రిపోర్టును పిటిషన్‌లో ఉదాహరణగా చూపారు. అలాగే క్షీణిస్తున్న తన ఆరోగ్యాన్ని కూడా పిటిషన్‌లో రాణా ప్రస్తావించారు. 2008 ముంబయి ఉగ్రవాద దాడుల కేసులో నిందితుడైన రాణాను భారత్‌కు అప్పగించడానికి అమెరికా ప్రభుత్వం ఇటీవల అంగీకరించిన సంగతి తెలిసిందే.

పెసా బలోపేతానికి రూ.33 కోట్లు విడుదల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏజెన్సీ ఏరియాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న పంచాయతీల(షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు)చట్టం- 1996 (పెసా)ను రాష్ట్రంలో మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తున్నది. దీని కోసం రూ.33 కోట్లను విడుదల చేసింది. తెలంగాణలోని పలు ప్రాంతాలు ఐదో షెడ్యూల్డ్ పరిధిలో ఉన్న పలు ప్రాంతాలు పెసా చట్ట పరిధిలో ఉన్నాయి. రాష్ట్రంలో నాలుగు ఐటీడీఏల పీఓల పరిధిలో నలుగురు కో-ఆర్డినేటర్లు పనిచేస్తున్నారు. వారి కింద 600 మంది మొబిలైజర్లు పని చేస్తున్నారు. వీరంతా ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే, కొంత కాలం ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా యాక్టు సరిగా అమలు కావడం లేదనే విమర్శలొస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే ఆదివాసీ ప్రాంతాల్లోని గిరిజనులను, ఆదివాసీలను మరింత చైతన్యపరిచేందుకు, పెసా చట్టాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అందులో భాగంగానే పెసా కార్యకలాపాల కోసం, సిబ్బంది జీతభత్యాల కోసం రూ.33 కోట్లను రాష్ట్ర సర్కారు విడుదల చేసింది. ఈ నిధుల ద్వారా గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించడం, ఏజెన్సీల్లోని పంచాయతీలకుండే ప్రత్యేకాధికారాలను సద్వినియోగ పరుచుకునేలా ఆదివాసీ, గిరిజనులను చైతన్యపర్చడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం వంటి పనులు జరుగనున్నాయి.

ప్రవీణ్ కుటుంబానికి కేటీఆర్ ఓదార్పు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



అమెరికాలో దుండగల చేతిలో హత్యకు గురైన ప్రవీణ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓదార్చారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు అమెరికా వెళ్ళిన షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం గంప రాఘవులు కుమారుడు గంప ప్రవీణ్‌ను దుండగులు హతమార్చడం పట్ల ఆయన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రవీణ్ కుటుంబ సభ్యులకు కేటీఆర్ తన సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ స్థానిక నేత రవీందర్ యాదవ్ ఫోన్ ద్వారా స్పందించి బాధితుని కుటుంబంతో ఫోన్లో మాట్లాడారు. జరిగిన దారుణం చాలా బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. ధైర్యంగా ఉండాలనీ, గంప ప్రవీణ్ మతదేహాన్ని వీలైనంత తొందరగా భారతదేశానికి రప్పించేందుకు భారత రాయబార కార్యాలయంతో మాట్లాడతానని చెప్పారు.

కార్పొరేట్, హిందూత్వ ప్రతిఘటనకు కోటగా కేరళ

సమానత్వం, న్యాయం, లౌకికవాదం పరిరక్షణ పోరాటంలో దేశానికే ఆశాకిరణం : కేరళ 24వ రాష్ట్ర మహాసభ ప్రారంభోత్సవంలో ప్రకాశ్‌కరత్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



దేశంలో ఫాసిస్ట్ పోకడలను, నయా ఉదారవాద విధానాలను నిరోధించేందుకు పోరాటాలను నిర్మించాలని సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ పిలుపునిచ్చారు. కేరళలోని కొల్లంలో గురువారం సీపీఐ(ఎం) కేరళ 24వ రాష్ట్ర మహాసభ ప్రారంభమైంది. కొడియేరి బాలకృష్ణన్ నగర్‌లో జరుగుతున్న ఈ మహాసభలో 500 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు ఎ.కె బాలన్ ఎర్ర జెండాను ఎగురవేశారు. మతోన్మాద, పెట్టుబడిదారీ దోపిడీ, సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో మూడు రోజుల పాటు ఈ మహాసభ జరగనుంది. పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, బృందాకరత్, సుభాషిణి అలీ, బీ.వీ రాఘవులు, అశోక్ ధావలే, ఎం.ఎ బేబీ, ఎ. విజయ రాఘవన్, రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో ప్రకాశ్‌కరత్ మాట్లాడుతూ కేరళను కార్పొరేట్, హిందూత్వ బంధానికి వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటనకు కోటగా అభివర్ణించారు. సమానత్వం, న్యాయం, లౌకికవాదం కోసం పోరాటంలో కేరళ దేశానికే ఆశాకిరణంగా ఉందన్నారు. నయా ఉదారవాద పెట్టుబడిదారీ దోపిడీ శక్తులను నేరుగా సవాలు చేసే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాకు సీపీఐ(ఎం) అచంచలమైన నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. కార్మిక వర్గాన్ని విభజించి, నిరంకుశ పాలనతో పెరుగుతున్న హిందూత్వ, మతతత్వ ప్రవాహాన్ని నిరోధించడానికి, లౌకిక విలువలను నిలబెట్టడానికి వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం సామాజిక విభజనలను తీవ్రతరం చేస్తోందని, ప్రజలను పోలరైజ్ చేసేందుకు మతపరమైన ద్వేషాన్ని తీవ్రతరం చేస్తోందని ధ్వజమెత్తారు. దేశం నయా ఫాసిజంలోకి దిగజార కుండా నిరోధించడానికి విస్తృత, ఐక్య కూటమి ఏర్పాటుకు పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పార్టీ స్వతంత్ర వైఖరిని పునరుద్ఘాటించారు.

పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

రాబోయే ఎన్నికల సవాళ్లకు సీపీఐ(ఎం) వ్యూహాన్ని రచించడం కూడా ఈ మహాసభ లక్ష్యంలో ఒకటని అన్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి పెట్టాలని అన్నారు. సీపీఐ(ఎం) ఈ ఎన్నికల యుద్ధాలకు సిద్ధమవుతున్నందున, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, సోషలిజం, సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

మోడీ విధానం దేశాన్ని ఒంటరిని చేసింది



దేశం ఇప్పటివరకు అనుసరించిన విదేశాంగ విధానానికి భిన్నంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అమెరికన్ అనుకూల విదేశాంగ విధానం దక్షిణాసియా ప్రాంతంలో మన దేశం ఒంటరితనానికి దారితీసిందని ప్రకాశ్‌కరత్ అన్నారు. పాలస్తీనా సమస్యపై మోడీ ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వడమే కాకుండా, వారికి ఆయుధాలు అందించే వైఖరిని కూడా తీసుకున్నారన్నారు.

మహిళలు, పిల్లలు సహా దాదాపు లక్ష మంది ప్రజలు మరణించిన పాలస్తీనాకు వ్యతిరేకంగా అమెరికాను సంతృప్తి పరచడానికే ఈ వైఖరి తీసుకున్నారని తెలిపారు. ఇజ్రాయిల్ అనుకూల, చైనా వ్యతిరేక 'క్వాడ్' శిఖరాగ్ర సమావేశాన్ని దేశంలో నిర్వహించి, ట్రంప్‌ను ఆహ్వానించడమే మోడీ అమెరికా పర్యటన ముఖ్య ఉద్దేశమని మండిపడ్డారు.

క్వాడ్ అనేది అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారతదేశం కూటమి అని, ఈ విధానాలు మోడీ ప్రభుత్వ దేశవ్యతిరేక ముఖాన్ని చూపిస్తున్నాయని విమర్శించారు. సమాఖ్య వాదాన్ని, రాజ్యాంగాన్నే బలహీనపరిచే వైఖరిని అమలు చేస్తోందని దుయ్యబట్టారు. అదానీ, అంబానీలతో సహా ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటీకరించే విధానాలు ప్రమాదకరమైన రీతిలో అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వామపక్షాల బలాన్ని పెంచడంతో ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేయాలని కరత్ అన్నారు.

"నవ కేరళకు కొత్త మార్గాలు" డాక్యుమెంట్


ముఖ్యమంత్రి పినరయి విజయన్ "నవ కేరళకు కొత్త మార్గాలు"పై దృష్టి సారించిన వివరణాత్మక అభివృద్ధి డాక్యుమెంట్‌ను ప్రవేశపెట్టారు. కార్పొరేట్ లాభాల కంటే ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చే స్థిరమైన, సమానమైన వృద్ధికి పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ రాష్ట్రంలోని పార్టీ విజయాలు, సవాళ్లపై ఒక నివేదికను ప్రవేశపెట్టారు. కార్మికవర్గం, అణగారిన వర్గాల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలో సీపీఐ(ఎం) పాత్రను స్పష్టం చేశారు. ఈ మహాసభ మార్చి 9న రెడ్ వాలంటీర్ మార్చ్, ప్రజా ర్యాలీతో ముగుస్తుంది.

ప్రపంచాన్ని వాణిజ్య యుద్ధంలోకి నెట్టేసిన ట్రంప్ విధానాలు

ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి అనేక ప్రయత్నాలు చేస్తున్నారని ప్రకాశ్‌కరత్ అన్నారు. అమెరికా, దాని మిత్రదేశాలు చైనా వృద్ధికి వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. 20శాతం వాణిజ్య ఆంక్షలు విధించడం ఇందులో భాగమేనని గుర్తు చేశారు. కానీ అమెరికా సంపద, సాంకేతికత, సైనికంతో సహా ఏ రంగంలోనూ చైనాతో పోటీ పడలేదని, ట్రంప్ విధానాలు ప్రపంచాన్ని వాణిజ్య యుద్ధంలోకి నెట్టివేస్తాయని విమర్శించారు. ఆధిపత్యాన్ని తిరిగి పొందే ప్రయత్నంలో ట్రంప్ అత్యంత అమానవీయ వైఖరి గత ఆరు వారాలలో బయటపడిందన్నారు. గ్రీన్‌ల్యాండ్, కెనడా, పనామా కాలువలు అమెరికాలో భాగమని, గాజాను స్వాధీనం చేసుకుని అక్కడ ఒక రిసార్ట్‌ను నిర్మిస్తామని ప్రకటించడం ఇతర దేశాల స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారంపై దాడికి పూనుకున్నాయని అన్నారు. అమెరికా, దాని మిత్రదేశాల తీవ్ర మితవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా వామపక్ష శక్తుల కదలిక కనిపిస్తోందని తెలిపారు. లాటిన్ అమెరికన్ దేశాలలో వామపక్ష పార్టీలు ప్రజా తిరుగుబాట్లతో అధికారంలోకి వచ్చాయని అన్నారు. మార్క్సిస్ట్ భావజాలం ఆధారంగా పనిచేసే జనతా విముక్తి పెరుమన పార్టీ శ్రీలంకలో అధికారంలోకి రావడం పురోగామి సూచికని అన్నారు.

సంపాదకీయం

ఆత్మగౌరవమా.. లొంగుబాటా?



పీఠమెక్కి రెండు నెలలు కూడా గడవక ముందే కొరడా రాజుగా మారిన డోనాల్డ్ ట్రంప్ తనకు లొంగరు అనుకున్నవారి మీద ఎడాపెడా కొరడా ఝళిపిస్తున్నాడు. సుంకాలు, ప్రతి సుంకాలు,ఆంక్షలు విధిస్తూ బస్తీమే సవాల్ అంటున్నాడు. తలవంచేట్లు చేసేందుకు బెదిరింపులా, బేరమాడేందుకు వేస్తున్న పాచికలా చివరకు ఏం జరుగుతుంది, ఎలా ముగుస్తుందన్నది ఎవరూ చెప్పలేరు. ప్రతి దేశానికి బలం- బలహీనతలున్నాయి, దానికి అమెరికా మినహాయింపు కాదు గనుక ట్రంపు కూడా తగ్గినా ఆశ్చర్యం లేదు. ప్రతి దేశమూ సర్వసత్తాకమే, ప్రతివారూ తమదైన పద్ధతిలో ఆర్థిక వ్యవస్థలను నడిపిస్తున్నారు. తమ దేశాన్ని మరోసారి అగ్రస్థానంలో నిలుపునంటూ ట్రంప్ ప్రపంచం మీద వీరంగం వేస్తే కుదరదు. రవి అస్తమించని సామ్రాజ్యాధి పతులం అనుకున్న బ్రిటన్ ఏమైంది, ప్రపంచాన్ని చాపలా చుట్టి చంకలో పెట్టుకో వాలనుకున్న హిట్లర్‌కు ఏగతి పట్టిందీ ఎరుకే.

> ఉన్న కార్యక్రమాలన్నీ ఆకస్మికంగా రద్దు చేసుకొని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వెళ్లి అక్కడి వాణిజ్యమంత్రితో సంప్రదింపులు జరిపినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా మరుక్షణమే ట్రంప్ ప్రకటన చేశాడు. తాను ప్రపంచమంతా తిరిగి పోయిన భారత ప్రతిష్టను తిరిగి తెచ్చానని చెప్పిన ప్రధాని నరేంద్రమోడీ నోటి నుంచి ట్రంప్ సుంకాల ప్రకటన మీద గడిచినా ఎలాంటి స్పందన లేదు. ఆత్మగౌరవమా, లొంగుబాటా? ఏమను కోవాలి?

ఒక పోరులో గెలుస్తామా లేదా అన్నది తర్వాత అంశం, ఎదుటివారు దురాక్రమణకు పాల్పడితే ప్రతిఘటించాలా, చేతులు నలుపుకోవాలా అన్నదే సమస్య. వివాదాలు తలెత్తితే ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఓ), ఐరాస, ప్రపంచ కోర్టులు ఉన్నాయి. ఎలాంటి సంప్రదింపులు, అభిప్రాయాల మార్పిడి లేకుండానే తన బుర్రలో తెల్లవారుజామున పుట్టిన బుద్ధిని బయటపెట్టుకున్నట్లుగా డోనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా సుంకాలు ప్రకటించి చర్చలకు సిద్ధమంటున్నాడు. ఆత్మగౌరవం గల ఏ దేశమూ ఈ దందాను అంగీకరించదు. అందుకే 'మా ఇల్లు మీకెంత దూరమో..మీ ఇల్లూ మాకూ అంతేదూరం' అంటూ వెంటనే స్పందించాల్సిందే. రా! ఎలాంటి యుద్ధం కావాలని కోరుకుంటావో దానికి మేమూ సిద్ధమంటూ తాజాగా చైనా భేరీ మోగించింది. గతంలో ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం, ఇతర మరికొన్ని సమస్యల కారణంగా అక్కడ గతంలో మాదిరి వృద్ధిరేటు లేని మాట నిజం కావచ్చుగాని అది ఏ ఇతర ధనికదేశంతో పోల్చుకున్నా ఎంతో మెరుగైనదే. అది ఎదుర్కొంటున్న సమస్యలను అవకాశంగా తీసుకొని అణగదొక్కుదామని చూస్తే కుదిరేది కాదని తేలిపోయింది. ట్రంపూ అతగాడితో ఊరేగుతున్నవారు, ఉబలాటపడుతున్న వారికీ అర్ధమౌ తోందా అంటే లేదనే చెప్పాలి. ఒకవేళ అవగత మైతే పరిణామాలు వేరుగా ఉండేవి. బీజింగ్‌లో జరుగుతున్న పీపుల్స్ కాంగ్రెస్ ఐదుశాతం వృద్ధి రేటు లక్ష్యంగా నిర్ణయించి దానికి అవసరమైన చర్యల గురించి చర్చిస్తున్నది.

దశాబ్దాల తరబడి అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న కెనడాను ఆక్రమించి యాభైఒకటవ రాష్ట్రంగా చేసుకోవాలన్న సంకల్పాన్ని ట్రంప్ పదే పదే ప్రకటిస్తున్నాడు. మరోసారి దాన్ని అవమానకరంగా వెల్లడించాడు. ప్రతి సుంకాలు విధిస్తే మరింతగా పెంచుతామంటూ పెట్టిన సామాజిక మాధ్యమ పోస్టులో కెనడా ప్రధానిని ఉద్దేశించి ఈ విషయాన్ని " కెనడా గవర్నర్ జస్టిన్ ట్రుడేవ్‌కు " వివరించండని కూడా దానిలో సలహా ఇచ్చాడు. అంటే కెనడా తమ రాష్ట్రమని పునరు ద్ఘాటించటమే. టిప్‌టాప్‌గా ఉన్నప్పటికీ అతగాడి చర్యలు పిచ్చివాడి పనిగా ఉందంటూ ఒక పత్రిక చేసిన వ్యాఖ్యను ట్రంప్ గురించి ట్రుడేవ్ ఉటంకించాడు, తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా ప్రతిసుంకాలను ప్రకటించాడు. అత్యంత సన్నిహితం, భాగస్వామిగా ఉన్న కెనడా మీద వాణిజ్య యుద్ధం ప్రకటించి అదే సమయంలో హంతక నియంత పుతిన్‌ను సంతుష్టీకరించేందుకు పూనుకోవటం మతి ఉండి చేస్తున్న పనులేనా అన్నట్లుగా విరుచుకుపడ్డాడు. అఫ్ కోర్సు ఇదే పెద్ద మనిషి తర్వాత జావగారి పోయినా చేసేదేమీ లేదు, అది వేరే విషయం. చివరికి కెనడాలో అత్యధిక జనాభా గల ఒంటారియో రాష్ట్ర ప్రధాని డగ్ ఫోర్డ్ కూడా ట్రంప్‌ను దుయ్యబట్టాడు. 'మేమిచ్చే విద్యుత్, ఇంధనం మీద ఆధారపడుతూ మమ్మల్ని బాధిస్తారా, మేం తలుచు కుంటే న్యూయార్క్ నగరంలో పదిహేను లక్షల మందికి విద్యుత్ నిలిచిపోతుంది జాగ్రత్త' అన్నాడు. ఇక్కడ సమస్య ఏమిటంటే ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకున్న కెనడియన్లే అలా స్పందిస్తే మన సంగతేమిటి? ఉన్న కార్యక్రమాలన్నీ ఆకస్మికంగా రద్దు చేసుకొని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వెళ్లి అక్కడి వాణిజ్యమంత్రితో సంప్రదింపులు జరిపినప్పటికీ వాటిని పరిగణనలోకి తీసుకోకుండా మరుక్షణమే ట్రంప్ ప్రకటన చేశాడు. తాను ప్రపంచమంతా తిరిగి పోయిన భారత ప్రతిష్టను తిరిగి తెచ్చానని చెప్పిన ప్రధాని నరేంద్రమోడీ నోటి నుంచి ట్రంప్ సుంకాల ప్రకటన మీద గడిచినా ఎలాంటి స్పందన లేదు. ఆత్మగౌరవమా, లొంగుబాటా? ఏమనుకోవాలి? ఫిబ్రవరి రెండవ వారంలో మోడీ అమెరికా పర్యటన జరపటానికి ముందే నమస్కార బాణం వేసినట్లుగా కొన్నింటి మీద పన్నులు తగ్గించి ట్రంప్‌ను ప్రసన్నం చేసుకొనేందుకు చూశారు. వ్రతం చెడ్డా ఫలం దక్కలేదనుకోవాలా ? నూటనలభై కోట్ల మంది జనానికి ఏదో ఒకటి చెప్పాలా వద్దా!

ఎందులో తక్కువని తోచేయాలి
దేనిలో రాణించలేదని మరచిపోవాలి
అమ్మగా సృష్టికి లాలపోసి పెంచావు
మహాశక్తిగా లోకాన్ని పరిపాలించావు
కరుణామూర్తిగా ప్రేమను పంచావు
సహనానికి మారుపేరై నిలబడ్డావు

గుణంలో మేటితనానికి ఆజ్యమైనావు
సుగుణంలో తరతరాలకు వెలుగైనావు
అంతరిక్షాన్ని సైతం అధిరోహించావు
కళారత్నమై కూచిపూడి నాట్యమైనావు
స్వరవాణిలో సరస్వతి పలుకైనావు
అలిగా తోడుగా నీడలా అడుగులేసావు
పురిటి నొప్పుల్ని పునీతంలా భరించావు

అబల కాదు..సబల



కూతురిలా మమకారమై పూసావు
కోడలిగా నట్టింటిని పావనం చేసావు
పైలెట్‌లా మారి ఆకాశాన్ని చుట్టేసావు
యుద్ధభూమిలో శత్రువుల్ని జయించావు
సేవలో మానవత్వాన్ని బతికించావు
రాజ్యాధికార అధిపతివై రాణివైనావు
వీరమాతగా కీర్తికి కిరీటం తొడిగినావు


కవుల చేతి కలంలో వర్ణనై వికసించావు
క్రీడల్లో ఖండాలను దాటెళ్లిపోయావు
కర్షక లోకంలో మహిళా రైతువైనావు
సాంకేతిక రంగాల్లో స్ఫూర్తివై నిలబడ్డావు
చేనేతల అల్లికల్లో వేకువ పొద్దయి పొడిచావు
పట్టు వస్త్రాల్లో పల్లెపట్టువైనావు
వాహనాలను బతుకు దారిలో నడిపావు

పరాశక్తిగా లోకాన్నే ఏలినావు
తిరుగులేని ప్రతిభకు మూలమైనావు
ఎదురులేని మనిషిగా ఎదిగిపోయావు
భూమి ఆకాశాలకు వారధివైనావు
త్రిలోకాలకు త్రికరణశుద్ధిగా మెలిగావు
నువ్వు అబలవి కాదు సబలవి
అన్నింటిలో మేటితనానికి ప్రతీకవి

(మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

- నరెద్దుల రాజారెడ్డి,
9666016636

శాస్త్రవేత్త, కళాకారుడు- డాక్టర్ రాజా రామన్న



డాక్టర్ దేవరాజు మహారాజు

మన భారతీయ శాస్త్రవేత్తల్లో కొన్ని సుగుణాలు తప్పకుండా ఉంటాయి. అవి దేశభక్తి, సంస్కృతీ సంప్రదాయాల పట్ల గౌరవం, సంగీత సాహిత్యాల పట్ల ప్రేమ, సగటు మనిషి జీవన ప్రమాణాలు పెంచాలన్న తపన మొదలైనవి. డాక్టర్ రాజా రామన్న వంటి కొంతమంది శాస్త్రవేత్తల్లో ఇవి మరీ ఎక్కువగా ఉన్నాయి. ఈయనకు భౌతిక శాస్త్రవేత్తగానే కాదు, పియానో వాయిద్యకారుడిగా మంచి పేరుంది. ఈయనకు భారతీయ కళలంటే ఎంతో ఇష్టం ఉండడంతో పాటు, భారతీయ తత్త్వశాస్త్రంపై లోతైన అవగాహనా ఉంది. రాజా రామన్న 1925 జనవరి 28న సాంప్రదాయక మైసూర్ అయ్యంగార్ కుటుంబం - తమకూరు జిల్లా, కర్నాటకలో పుట్టాడు.

తల్లి: రుక్మిణి, తండ్రి: బి.రామన్న. ఈయన బాల్యం, కౌమారం అంతా పుట్టిన ఊర్లోనే గడిచింది. ఉన్నత విద్య బెంగళూరులో జరిగింది. సంగీతంపై ఉన్న అభిమానంతో సంగీత కళాశాలలో చేరాలనుకున్న రాజా రామన్న, సర్ సి.వి. రామన్ పరిచయ ప్రభావం వల్ల వైజ్ఞానిక రంగంలోకి ప్రవేశించాడు. తండ్రి న్యాయశాఖలో ఉద్యోగి. కానీ, ఆయన తల్లి సోదరి రాజమ్మ ఉపాధ్యాయురాలిగా ఉండేది. అలా ఆ పిన్ని ప్రభావం బాల్యదశలో రాజారామన్నపై పడింది. ఆరేండ్ల వయసులోనే పియానో నేర్చుకోవడం ప్రారంభించాడు. పన్నెండో ఏట మైసూర్ మహారాజు ఎదుట పియానో వాయించి ప్రశంసలందుకున్నాడు. మరోవైపు మైసూర్ డాల్వాయ్ స్కూలు, గుడ్ షెపర్డ్ కాన్వెంట్లలో ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుని, బెంగళూరుకు వెళ్లి అకడి కాటన్ బాయ్స్ స్కూల్లో పాఠశాల విద్య కొనసాగించాడు. తర్వాత మద్రాసు చేరుకుని, అక్కడి క్రిస్టియన్ కాలేజిలోనూ, తర్వాత మద్రాసు యూనివర్సిటీలోనూ చదివి పట్ట భద్రుడయ్యాడు. తర్వాత బొంబాయి యూనివర్సిటీ నుండి మాస్టర్స్ డిగ్రీ సాధించాడు. ఒక మామూలు ఉద్యోగి అయిన

> భూగర్భంలో అణుపరీక్ష చేయడమన్నది అంతకుముందు లేదు. కాలువలు తవ్వడానికి, లేదా వంతెనలు కట్టడానికి సరిపోయినంత స్థలం సమ కూర్చుకోవడానికి, అణు వ్యర్థ పదార్థాలను భూగర్భంలో నిలువ చేసుకోవడానికి సామాన్యంగా డైనమైట్ ఉపయోగించేవారు. కానీ, డైన మైట్‌కు ప్రత్యామ్నాయంగా అణుశక్తిని వాడి అపాయ రహితమైన మంచి ఫలితాలను సాధించగలిగాడు - డాక్టర్ రామన్న, అదీగాక, దీర్ఘ కాలిక ఉపయోగాలను దృష్టిలో ఉంచుకుని లెక్కలు వేస్తే, డైనమైట్ కంటే అణుశక్తిని ఉపయోగించడమే చౌక అని తేలింది. అందువల్ల మానవాళి శాంతియుత ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకుని, అణుశక్తిని ఇతోధికంగా ఉపయోగించాల్సిన అవసరాన్ని డాక్టర్ రాజా రామన్న ఎత్తి చూపాడు.

తండ్రి తన కొడుకు ఉన్నతవిద్య కోసం ఎంతగా తపించాడో ఎంత ఖర్చుపెట్టాడో ఊహించు కోవాల్సిందే. సహజంగా చురుకైన విద్యార్థి కావడం వల్ల రాజా రామన్న 1949లో టాటా (గ్రూపు-స్కాలర్ షిప్‌పై లండన్ వెళ్లి, అక్కడి కింగ్స్ కాలేజ నుండి న్యూక్లియర్ ఫిజిక్స్‌లో డాక్టరేట్ తీసుకున్నాడు.

'పి.హెచ్.డి తీసుకుని రాజా రామన్న స్వదేశం తిరిగివచ్చేసరికి - ఇక్కడ దేశానికి స్వాతంత్ర్యం లభించిన తొలిరోజులు - అప్పుడప్పుడే భారతదేశంలోని సంస్థలన్నీ బ్రిటీషు విధానాలను వదిలి, దేశ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, తమను తాము పునరుద్ధరించు కుంటున్న సమయం. డాక్టర్ హోమీ జహంగీర్ బాబా నేతృత్వంలో దేశం, అణు పరిశోధనా రంగంలో అడుగు పెట్టిన తరుణం! హోమి బాబా ఆధ్వర్యంలో పనిచేయడానికి 1952లో డా. రాజా రామన్న టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో చేరాడు. బొంబాయి, ట్రాంబేలోని ఆ సంస్థ పేరు తర్వాత కాలంలో బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) గా మారింది. 1957లో అణుభౌతిక శాస్త్రంలో శాస్త్రవేత్తలకు శిక్షణ ఇచ్చేందుకు రాజారామన్న బార్క్‌లో శిక్షణా తరగతులు నిర్వహించాడు. 1960లలో అణ్వాయుధాలను తయారు చేయడం, వాటిని అభివృద్ధి చేయడంలో - సాంకేతిక పరిశోధన చేపట్టాడు. అప్పుడే మనదేశంలో అణుబాంబుకు రూపకల్పన జరిగింది. 1966లో ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు- అణుపరికరాల తయారీకి సంబంధించిన ప్రాజెక్ట్ కొనసాగింది. ఆ ప్రాజెక్ట్‌లో పనిచేసే 75మంది శాస్త్రవేత్తల బృందానికి డా.రాజా రామన్న నాయకత్వం వహించాడు. 1968-69లో బార్క్‌లో పూర్ణిమ అనే పేరుతో ప్లుటోనియం ఇంధనంతో ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ స్థాపించబడింది. 1974 మే నెలలో అతి రహస్యంగా అణు పరీక్షను నిర్వహించారు. ఆ పరీక్షకు 'స్మైలింగ్ బుద్ధ' - అని పేరు పెట్టారు. దీన్ని పీస్‌ఫుల్ న్యూక్లియర్ ఎక్స్‌పోజివ్ (పిఎన్ఈ) అని పిలిచారు.

పద్మ విభూషణ్ స్వీకరించిన డాక్టర్ రాజా రామన్న, 1977-79 మధ్య ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్‌కు అధ్యక్ష్యుడయ్యాడు. 1978లో అప్పటి భారత ప్రధాని మొరార్జీ దేశాయ్, డా.రామన్నను బార్క్ నుండి తీసుకొచ్చి, రక్షణ మంత్రిత్వ శాఖకు సలహాదారుగా నియ మించారు. రక్షణ పరిశోధన కార్యదర్శిగా డీఆర్‌డీఓ, డైరెక్టర్ జనరల్‌గా కూడా నియమించారు. అప్పుడే ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. ఈయన నేపథ్యం తెలుసుకుని ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్. అణుబాంబుల తయారీలో డా.రామన్న సహాయం అర్థించాడు. పరిస్థితి విషమించేట్టుగా ఉందనుకుని, దేశ భక్తుడయిన డా.రాజా రామన్న చెప్పాపెట్టకుండా ఇండియా విమానం పట్టుకుని హుటాహుటిన తిరిగొచ్చాడు. నిబద్ధత గల దేశ భక్తుల చర్యలు అలా ఉంటాయి. వారు వేటికీ లొంగరు.

హోమి జె.బాబా అకాల మరణం తర్వాత, ఆయన నిర్దేశించిన మార్గంలోనే రాజా రామన్న పరిశోధనలు కొనసాగించి, అణుశక్తి పరిశోధనల్లో దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టాడు. ఒక దశాబ్దకాలం పాటు డైరెక్టర్‌గా ఉండి, పోఖ్రాన్ అణుపరీక్షల్ని తొలిసారి నిర్వహించాడు. 1974 మే 18న రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఎడారిలో మన దేశం అణు పరీక్షల్ని కొనసాగించింది. దీనికి ముఖ్య కారకులు మన రాజరామన్నానే! అయితే ఆయన బృందంలోని ఇతర శాస్త్రవేత్తలు కూడా ఎంతో చిత్తశుద్ధితో పనిచేయడం వల్ల ఆ ప్రయత్నం విజయవంతమైంది. రాజా రామన్న విజయం ఇదొక్కటే కాదు. అంతకు ముందు కూడా ఆయన ఇలాంటి బాధ్యతల్ని దిగ్విజయంగా పూర్తి చేయగలిగాడు. దేశంలో తొలి అణురియాక్టర్లను నెలకొల్పిన ఘనత కూడా ఆయనదే! అప్సర, సిరస్, పూర్ణిమ వంటి అణురియాక్టర్లు కూడా డాక్టర్ రాజారామన్న రూపకల్పనలే! భూగర్భంలో అణుపరీక్ష



2025 - డా.రాజా రామన్న శతజయంతి సంవత్సరం

చేయడమన్నది అంతకుముందు లేదు. కాలువలు తవ్వడానికి, లేదా వంతెనలు కట్టడానికి సరిపోయినంత స్థలం సమ కూర్చుకోవడానికి, అణు వ్యర్థ పదార్థాలను భూగర్భంలో నిలువ చేసుకోవడానికి సామాన్యంగా డైనమైట్ ఉపయోగించేవారు. కానీ, డైన మైట్‌కు ప్రత్యామ్నాయంగా అణుశక్తిని వాడి అపాయ రహితమైన మంచి ఫలితాలను సాధించగలిగాడు - డాక్టర్ రామన్న. అదీగాక, దీర్ఘ కాలిక ఉపయోగాలను దృష్టిలో ఉంచుకుని లెక్కలు వేస్తే, డైనమైట్ కంటే అణుశక్తిని ఉపయోగించడమే చౌక అని తేలింది. అందువల్ల మాన వాళి శాంతియుత ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకుని, అణుశక్తిని ఇతోధికంగా ఉపయోగించాల్సిన అవసరాన్ని డాక్టర్ రాజా రామన్న ఎత్తి చూపాడు.

ఇవిగాక,ఆయన న్యూక్లియర్ ఫిషన్ రంగంలో కూడా కృషిచేశాడు. బరువైన కేంద్రకాలను విభజించి, శక్తివంతమైన న్యూక్లియర్ రేడియేషన్‌ను ఉత్పత్తి చేయవచ్చని ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.ఆ సిద్ధాంతం అణు పరిశోధనారంగానికి, తద్వారా దేశ ప్రగతికి ఎంతో ఉపయోగపడింది. 1980లో శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా తిరిగి రావడంతో అణుకార్యక్రమం ఊపందుకుంది. ఆమె డా.రామన్నను మళ్లీ బార్క్‌కు డైరెక్టర్‌గా నియమించారు. పైగా అణుపరీక్షల కోసం ఆయనకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. 1983లో అణుశక్తి శాఖకు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూనే- ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఎఈఏ)లో దక్షిణ ఆసియా, మధ్యప్రాచీ కూటమికి ప్రాతినిధ్యం వహించారు.1990లో వి.పి.సింగ్ ప్రభుత్వంలో డా.రామన్న కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అయితే ఆ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగలేదు. 1997-2003 మధ్యకాలంలో పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యుడిగా కొనసాగాడు డా.రామన్న. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్‌లతో పాటు శాంతిస్వరూప్ భట్నాగర్ బహుమతి, మేఘనాథ్ సాహా మెడల్, ఆర్‌డి బిర్లా మెమోరియల్ అవార్డు, అశుతోష్ ముఖర్జీ గోల్డ్‌మెడల్ వంటి పలు పురస్కారాలు 1963- 1996 మధ్యకాలంలో స్వీకరించడమే కాకుండా, దేశంలోని పలు విశ్వవిద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లు తీసుకున్నాడు.


డాక్టర్ రాజారామన్న తన ఇరవై ఏడోయేట 1952లో మాలతిని వివాహం చేసు కున్నాడు. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలిగారు. తల మునకలయ్యే ఉద్యోగ బాధ్యతల్ని నిర్వహిస్తూనే, పరిశోధనలు కొనసాగించడం - అందులో మళ్లీ సమయాన్ని సంగీతానికి కేటాయించి పియానో వాయిద్యకారుడిగా పేరు గడించడం మామూలు విషయం కాదుగదా? వీటన్నిటి వెనక ఆయనకు ఆయన భార్యా పిల్లల సహాయ సహకారాలు ఉండడం చెప్పుకోదగ్గ విషయం! అత్యున్నత ప్రభుత్వ బాధ్యతలు నిర్వహించినా, అత్యున్నత ప్రభుత్వ పురస్కారాలు స్వీకరించినా డా. రాజా రామన్న దేనికీ పొంగిపోలేదు. వినమ్రంగా అణుకువగా నడుచు కుంటూ అందరికీ అందుబాటులో ఉండేవాడు. ఈ శాస్త్రవేత్త జీవితం నేటి యువతరానికి ఆదర్శం కావాలి! ప్రపంచ దేశాల్లో అణ్వస్త్రాలకు పోటీ పెరుగు తున్నప్పుడు- మన రక్షణ అవసరాలకు, దేశ భద్రతకూ అణ్వస్త్రాలు రూపొందించుకోవడం ఏ మాత్రం తప్పుకాదని నాటి ప్రధ నులైన శ్రీమతి ఇందిరాగాంధీ, ఆ తర్వాత రాజీవ్‌గాంధీలను ఒప్పించగలిగాడు. అణుసామర్థ్యం పెంచుకోవడం లోనే దేశం శక్తివంతమౌతుందని ఆయన గాఢంగా విశ్వసించాడు.

శాస్త్రవేత్త అయి ఉండి కూడా కళాకారుడిగా మెప్పుపొందడం ఆయన ప్రత్యేకత. వైజ్ఞానిక పరిశీలన అయినా, కళా ప్రక్రియల్లో ప్రవేశమైనా అంతర్గతంగా మనిషిలో ఉన్న సృజనాత్మక శక్తికి విభిన్న రూపాలే! బాహ్యరూపాల్లో కళలు, విజ్ఞాన శాస్త్రాలు విడివిడిగా వేటికవి సంబంధం లేనట్లుగా అనిపించినా- అంతస్సూత్రంగా సృజనాత్మకత వాటిని కలుపు తూ ఉంటుంది. ఒక ఉన్నతమైన స్థాయిలో వాటి గురించి ఆలోచిస్తే- కళశాస్త్రమవుతుంది. శాస్త్రం- కళాత్మకంగా బయట పడుతుంది. అందుకు చాలామంది కవులు, చిత్రకారులు, సంగీతకారులు, శిల్పులు, వైజ్ఞానికులు కృషిచేశారు.

వైజ్ఞానిక స్పృహగల కవులున్నట్లే, కళాత్మక దృష్టిగల వైజ్ఞానికులూ ఉన్నారు. డాక్టర్ రాజా రామన్న అలాంటి వారికి ఒక మంచి ఉదాహరణ! మరో ముఖ్య విషయమేమంటే, ఇది డా.రాజా రామన్న శత జయంతి. (28 జనవరి 1925- 28 జనవరి 2025), మంచి మనిషిగా, అత్యున్నత స్థాయికి ఎదిగిన వైజ్ఞానికుడిగా, పియానో వాయిద్యకారుడిగా - ఎవరికి తోచిన విధంగా వారు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త: త్రిపురనేని రామస్వామి
జాతీయ పురస్కార తొలి గ్రహీత

బాధ్యతలను గుర్తుచేస్తున్న మహిళా దినోత్సవం




జి.తిరుపతయ్య
9951300016

అంతర్జాతీయ మహిళా దినోత్సవం లేదా ప్రపంచ కార్మికుల పండుగ "మే డే" వంటి ప్రధాన తేదీలు నూతన సంవత్సరం లాంటి సరదాగా చిందులేసే సందర్భాలు కావు. ఈరోజు మనం అనుభవిస్తున్న మెరుగైన జీవన ప్రమాణాలకు ఎందరెందరు, ఏయే సందర్భాల్లో, ఎన్నెన్ని త్యాగాలు చేశారో గుర్తుచేసుకునే సందర్భమిది. ఇప్పుడు కూడా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, ఆర్థిక సమానత్వానికి నోచుకోని అభాగ్యుల కోసం మన వంతు కృషిగా ఏమి చేయగలమన్న ఆలోచనలకు పదును పెట్టే అవకాశాలుగా భావించాలి. చారిత్రక సందర్భాలను సామాజిక చైతన్య పూర్వక దిశలో కాకుండా సంబరాలుగా జరుపుకునే విషసంస్కృతి నేడు చాప కింద నీరులా ఆవహిస్తున్నది. స్త్రీలకు ఓటు హక్కు లేని, ఆస్తి హక్కు లేని, కనీసం ఒంటి నిండా గుడ్డలు కూడా కట్టుకునే అర్హత లేని, అందరు తినగా మిగిలినది మాత్రమే తినాలన్న నిబంధన నుండి అన్ని రంగాల్లో శాసించే స్థాయికి మహిళలు చేరుకుంటున్నారు. ఇది దానంతట అది జరిగినది కాదు.ఎందరో త్యాగాల వల్ల, మరెందరో బలిదానాల వల్ల మాత్రమే సాధించబడిందని మరిచిపోరాదు.

మహిళా దినోత్సవం రోజున ఒకరికొకరు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలుపుకుని, యాజమాన్యాలు ఇచ్చే చిన్నపాటి బహుమతులు తీసుకోని, సరదాగా కాసేపు ఆటాపాటలు అడ్డుకుని కావాల్సిన విందును ఆరగించి, ఆనక ఇంటికి వెళ్లిపోవడం లాంటివి మహదానందాన్ని ఇస్తున్నట్లు అనిపించవచ్చు. ఇలాంటివి చేయకూడదని కాదు. వేరే ఏ సందర్భంలోనైనా ఇలాంటి కార్యక్రమాలు చేయవచ్చు. అయితే చారిత్రక సందర్భాల ఇతివృత్తాన్ని పెడచెవిన పెడితే ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవడానికి అవకాశాలు ఎంత మాత్రం ఉండవు అని గుర్తుంచుకోవాలి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పోరాటాలకు ప్రతీకగా కాకుండా సంబరాల సందర్భంగా నేటి యాజమాన్యాలు కూడా ఒక పుష్పగుచ్ఛాన్ని తన దగ్గర పనిచేస్తున్న మహిళకు ఇచ్చి సంతృప్తి పరుస్తున్నాయి. యాజమాన్యాల నుండి ఇలాంటి ప్రతిస్పందన కూడా పోరాటాలు సాగినంత కాలం మాత్రమే ఉంటుందని మనం మర్చిపోకూడదు.

లక్షలకొలది జీతభత్యాలు పొందుతూ, పెద్దపెద్ద కార్లలో ప్రయాణిస్తూ, కార్పొరేట్ కంపెనీల్లో మంచి మంచిహోదాల్లో ఉన్నవారంతా అంతర్జా తీయ మహిళా దినోత్సవాన్ని ఒక వాట్సాప్ గ్రీటింగ్‌కు పరిమితం చేసేశారు. లేదా క్లబ్బుల్లో, స్టార్ హోటళ్లల్లో సరదా సామూ హిక విందులకు కుదించివేశారు. ఇలాంటి పోకడల పర్యవసానంగా కాబోలు పట్టుమని పాతికేళ్లు కూడా ఒక వెలుగు వెలగని సాఫ్ట్‌వేర్ రంగం ఒక్కసారిగా లక్షల్లో జీతాల నుండి వేలల్లో జీతాలకు పడిపోయింది. ఆయా కంపెనీలో జరుగుతున్న శ్రమ దోపిడీ (ఎక్స్‌ప్లాయిటేషన్) పైన గళం విప్పి ఉంటే ఇప్పుడు ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదు. జీత భత్యాలు, వసతులు బాగా పెరిగిపోయిన ప్రభుత్వ రంగాల్లో, ప్రభుత్వ డిపార్ట్ మెంటుల్లో కూడా ఈవిధమైన పోకడలు పెరిగితే చాలా ప్రమాదం. మహిళా దినోత్సవం సందర్భంగా మీటింగ్ ఎందుకు, ఆ మీటింగ్‌లో ప్రసంగాలెందుకు, ప్రశాంతంగా పసందైన విందు వినోదాలతో రిలాక్స్ అయితే సరిపోదా! అనే భావజాలం పెరిగితే అది మొదటికే మోసం. మహిళా దినోత్సవాలో లేక మరేదైనా సందర్భాలో జరుపుకునేటప్పుడు సెలబ్రిటీలైనా సినీతారలను, క్రీడాకారులను, ప్రవక్తలను లేదా కమెడియన్లను లేదా ఒక మ్యూజిక్ బ్యాండ్ వాళ్లను పిలిచి జరుపుకోవచ్చుగా అని సలహాలు ఇవ్వవచ్చు. కానీ ఆరోగ్యంగా ఉన్నప్పుడు వ్యాయా మం చేస్తే అనారోగ్యం దానికి చేరదని అన్నట్టుగానే, అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పుడే కనీసం సందర్భోచిత పోరాటాలను మరువకుండా నిర్వహించినప్పుడే భవిష్యత్ ప్రమాదాలను తప్పించుకోగలం.



> ఒక మనిషి ఆర్థిక సామాజిక సమానత్వం తాను జన్మించే ప్రదేశాన్ని బట్టి ఉంటుందట. ఒకే సమయంలో అమెరికాలో, ఇండియాలో పుట్టిన బిడ్డలకి చూస్తే అమెరికా పౌరుడికి ఎనభై శాతం సంపద ఎక్కువ! అనగా మన పిల్లలకు మనము సమకూర్చుకోవాల్సినవి విద్యా,ఉద్యోగ,ఆస్తులు మాత్రమే కాదు, అవన్నీ పుష్కలంగా అందుబాటులో ఉంచగల సమాజం. అలాంటి సమాజం ఏర్పడడానికి జరిగిన కృషిలో మన పాత్ర ఎంత? ఇంకా మిగిలి ఉన్నది ఎంత! ఇట్లాంటి అవగాహనను పెడచెవిన పెట్టడమంటే మన పిల్లలకి భవిష్యత్తు ప్రమాదాన్ని మనమే కల్పిస్తున్నట్లు. అట్లాగని అందరూ ఉద్యమకారుల్లా తిరగబడాల్సిన అవసరం లేదు. కానీ ప్రతి సమూహానికి, లభించిన అవకాశాల్లో ప్రతిస్పందించే అలవాటు చేసుకోవాలి.

పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వడమంటే విద్యాబుద్ధులు నేర్పించి, ఉద్యోగస్తులుగా స్థిరపరిచి, కావాల్సినన్ని స్థిరాస్తులు సమకూర్చడమే అని అనుకుంటాం. కానీ అది చాలావరకు పాక్షికం. ఒక మనిషి ఆర్థిక సామాజిక సమానత్వం తాను జన్మించే ప్రదేశాన్ని బట్టి ఉంటుందట. ఒకే సమయంలో అమెరికాలో, ఇండియాలో పుట్టిన బిడ్డలకి చూస్తే అమెరికా పౌరుడికి ఎనభై శాతం సంపద ఎక్కువ! అనగా మన పిల్లలకు మనము సమకూర్చుకోవాల్సినవి విద్యా,ఉద్యోగ,ఆస్తులు మాత్రమే కాదు, అవన్నీ పుష్కలంగా అందుబాటులో ఉంచగల సమాజం. అలాంటి సమాజం ఏర్పడడానికి జరిగిన కృషిలో మన పాత్ర ఎంత? ఇంకా మిగిలి ఉన్నది ఎంత! ఇట్లాంటి అవగాహనను పెడచెవిన పెట్టడమంటే మన పిల్లలకి భవిష్యత్తు ప్రమాదాన్ని మనమే కల్పిస్తున్నట్లు. అట్లాగని అందరూ ఉద్యమకారుల్లా తిరగబడాల్సిన అవసరం లేదు. కానీ ప్రతి సమూహానికి, లభించిన అవకాశాల్లో ప్రతిస్పందించే అలవాటు చేసుకోవాలి.

ఆర్థికంగా బాగా స్థిరపడి బాధ్యతలన్నీ తీరిన తర్వాత సామాజిక సమస్యలను చర్చించడానికి కొందరు సుముఖంగా లేరు. అన్యాయాల గురించి పీడితుల గురించి, స్త్రీలపై, దళితులపై జరుగుతున్న లైంగికదాడులను ఎవరైనా ఎత్తిచూపితే, ఇలాంటి విషయాల్లో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎవరైనా ఎండగడితే.. ఇవన్నీ మనకు అవసరమా అనే విసుర్లు వేస్తున్న పరిస్థితులు కూడా ఉన్నవి. నినాదాలివ్వడమో, ప్లకార్డులు ప్రదర్శించడమో, ధర్నాల్లో పాల్గొనటమో లేదా ప్రత్యక్ష పోరాటాల్లో భాగం పంచుకోవడం వంటివన్నీ ఆర్థికంగా స్థిరపడిన కొందరికి నామోషీగా అనిపిస్తున్నవి. ఇది చాలా ప్రమాదకరమైన ఆలోచన. మనం చాలా కష్టపడి చదివాం, అందుచేత మంచి ఉద్యోగం సంపాదించాం, తద్వారా మంచి జీతాన్ని పొందుతున్నాం, మనకెందుకు పోరాటాలు, మనల్ని ఎవరూ ఏమీ చేయలేరు అనే భావన కూడా కొందరిలో కనిపిస్తుంటుంది. పట్టపగలైనా సరే పోలీసోడు తలుపు కట్టి అసంబంధ ప్రశ్నలడిగినప్పుడో, లేదా అకారణంగా ఆఫీసులో నిందలు మోపడమో లేదా నిందితులను చేయడమో జరిగినప్పుడు మనకున్న స్వేచ్ఛ స్వాతంత్ర్యాల సంగతి అర్థమవుతుంది! అప్పుడు గదా సంఘము, సమాజము..అన్ని గుర్తుకొస్తాయి! ఇలాంటి సందర్భాల్లో యాజమాన్యం గుర్తుకు రాదు. తిరగబడి పోరాటాలు చేసే నాయకులు వారి సంఘాలు గుర్తుకొస్తాయి.

చాలా మెరుగైన సమాజంలో ఉన్నాం, స్త్రీలకు అన్ని రకాల హక్కులున్నవి అని భావించేవాళ్లు గుర్తు పెట్టుకోవాల్సింది ఏమిమంటే డెబ్బయి ఐదేండ్ల స్వతంత్ర భారతంలో మహిళల అక్షరాస్యత ఇంకా 75 శాతానికి కూడా చేరలేదు. 35శాతం గర్భిణులు రక్తహీనతతో సతమత మవుతున్నారు. ఐదేళ్లలోపు చిన్నారుల్లో 40శాతం కుంటుబడి ఎదుగుతున్నారు. గృహహింస చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా గృహ హింస బారిన పడుతున్న వారి సంఖ్య ఏమీ తగ్గలేదు. ప్రభుత్వ రంగాలు ప్రభుత్వ డిపార్ట్మెంట్‌లో తప్ప ఎక్కడ కూడా స్త్రీలకు పురుషులతో సరి సమానమైన వేతనాలందడం లేదు. పెన్షన్ పొందుతున్న వృద్ధుల్లో 30శాతం మంది పురుషులు నిర్లక్ష్యానికి గురౌతుంటే 70శాతం మంది మహిళ పెన్షన్‌దారులు తిండికి నోచుకోలేనంత నిర్లక్ష్యానికి గురవుతున్నారట. ఇలాంటి ఘోరాతిఘోరమైన దౌర్జన్యాలను ప్రశ్నించడానికి మనకు సమయం లేకపోయినా అలాంటి సంఘాలకు చేయూతనివ్వడం నేటి అవసరమని మరిచిపోతే ఎలా? అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 సందర్భంగా ప్రతిఘటించటం, పోరాటాలు చేయటం ఎవరో "అలాగా జనాలు" (నిరుపేదలు) చేసేవి కావు. భవిష్యత్తులో మన సొంత పిల్లలే అలాంటి అలాగా జనంగా మారకూడదనే విచక్షణతో జరుపుకోవాలన్న చైతన్యం మనల్ని విడిచిపోరాదు.

(రేపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

బాధిత ఆశావర్కర్‌కు రూ.50లక్షల పరిహారం చెల్లించాలి

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని

కఠినంగా శిక్షించాలి

నేడు, రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలు

9న కార్మిక, ప్రజా సంఘాలతో "రౌండ్ టేబుల్" : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జగిత్యాల జిల్లాలో ఆశావర్కర్‌పై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తా వద్ద గల సీఐటీయూ సిటీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. బాధితురాలికి న్యాయం చేయాలనీ, నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలనీ, మహిళలకు పని ప్రదేశంలో రక్షణ కల్పించాలనే డిమాండ్లతో కూడిన ప్లకార్డులు పట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఘటనకు పాల్పడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిందితుడిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నట్టు అనుమానాలు కలుగుతున్నాయని విమర్శించారు. జగిత్యాల కలెక్టర్, స్థానిక డీఎస్పీ వ్యవహరిస్తోన్న తీరు అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సర్కార్ తక్షణమే స్పందించకుంటే కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటనలో దేశవ్యాప్తంగా పెల్లుబికిన ఆందోళన రాష్ట్రంలో పునరావృతమవుతుందని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్వీ రమ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో మహిళలపై వేధింపులు, లైంగికదాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న లేబర్ కోడ్‌లతో పని గంటలు పెరగడమే కాకుండా రాత్రి షిఫ్ట్‌ల్లోనూ మహిళలు పని చేయాల్సి వస్తోందని అన్నారు. ఆ సమయాలను ఆసరా చేసుకొని దుర్మార్గులు శ్రామిక మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, ఎం. పద్మశ్రీ, ఎం. వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, ఎం. శ్రావణ్ కుమార్, మీనా, జె. కుమారస్వామి, కిరణ్మయి, యాదమ్మ, జి. కవిత, ఎ. సునీత తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు రాష్ట్ర వ్యాప్త ఆందోళన

ఆశా వర్కర్‌పై జరిగిన లైంగికదాడి ఘటనకు నిరసనగా శుక్ర, శని వారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు ఆ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. 9న హైదరాబాద్‌లో కార్మిక, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది. ఈ కార్యక్రమా ల్లో ఉద్యోగ, కార్మికులందరూ భాగస్వాములు కావాలని సీఐటీయూ పిలుపునిచ్చింది.

విద్యుత్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- రూ.70 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏడీఈ



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

రూ.70వేలు లంచం తీసుకుంటూ విద్యుత్ ఏడీఈ ఏసీబీకి చిక్కిన ఘటన గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ విద్యుత్ కార్యాలయంలో చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చందర్ వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణంలో అక్రిట్ ఫార్మా షూటికల్ కంపెనీలో ఫ్రీ ఎనర్జీ సోలార్ సిస్టం కాంట్రాక్టర్ వద్ద విద్యుత్ ఏడీఈ గాజుల శ్యాంప్రసాద్ రూ.70,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌లో శ్యాంప్రసాద్ ఇంటి వద్ద ఇన్‌స్పెక్టర్లు రఘునందన్, వెంకటేష్ సోదా చేశారు. అతన్ని అరెస్టు చేసి నాంపల్లిలోని ఏసీబీ కోర్టుకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు రామారావు, వెంకట్‌రావు పాల్గొన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064, వాట్సాప్ నెంబర్ 9440446106, ఫేస్ బుక్, ట్విట్టర్ ద్వారా సమాచారం అందిస్తే అవినీతి అధికారులను అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని డీఎస్పీ తెలిపారు.

సామాజిక సేవ ముసుగులో మోసాలు

డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తామంటూ వసూళ్లు

- సచివాలయం, జీహెచ్ఎంసీ, కలెక్టరేట్లకు అమాయకులను తీసుకెళ్లి గాలం
- నలుగురు నిందితుల అరెస్ట్



నవతెలంగాణ-సిటీబ్యూరో/ధూల్‌పేట్

డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ అలాట్‌మెంట్ లెటర్స్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాల(నకిలీ) రబ్బర్ స్టాంప్‌లు, ల్యాప్‌టాప్, కలర్ ప్రింటర్, రూ.లక్షతో పాటు సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను ఛత్రినాక, సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు అదనపు డీసీపీ అందె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్రినాకకు చెందిన ఎం.జ్యోతి, పి.సునీల్ సింగ్ సోషల్ వర్కర్స్‌గా పనిచేస్తున్నారు. స్థానికులకు ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇప్పించేవారు. అయితే అందులో ఆశించినంత మేర ఆదాయం రాకపోవడంతో డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇప్పిస్తామని చెప్పి లక్షల్లో వసూళ్లు చేయొచ్చని పథకం వేశారు. సంతోష్‌నగర్‌లో కిరాణ దుకాణం యజమాని జి.రమేష్, ఛత్రినాకకు చెందిన ఎల్.నితిన్ కుమార్‌తో కలిసి ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో అమాయకులను టార్గెట్ చేశారు. వారికి డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇప్పిస్తామని నమ్మించారు. దరఖాస్తుదారులు ఒక్కొక్కరి నుంచి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేశారు. నమ్మకం కలిగించే విధంగా వారిని మినిస్టర్ క్వార్టర్స్, సచివాలయానికి తీసుకెళ్లే వారు. వారిని బయట కూర్చోబెట్టి మంత్రులు, అధికారులతో పరిచయాలున్నట్టు చెప్పేవారు. జీహెచ్ఎంసీ, ఎమ్మార్వో కార్యాలయంతో పాటు కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలకు తీసుకెళ్లేవారు. అది చూసిన దరఖాస్తుదారులు వారిని పూర్తిగా నమ్మేవారు. ఇదే తరహాలో రెండేండ్ల నుంచి దాదాపు రెండు వందల మందికి పైగా దరఖాస్తుదారులను మోసం చేశారు. అనుమానం రాకుండా కొంతమందికి ఇండ్లకు సంబంధించి (నకిలీ) అలాట్‌మెంట్ లెటర్స్‌ను ఇచ్చారు. అయితే, రెండేండ్లు గడుస్తున్నా వారు చెప్పిన ప్రకారం ఇండ్లు రాకపోవడంతో కొందరు ఆరా తీశారు. దాంతో వారు మోసం చేస్తున్నట్టు గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. గతంలో జ్యోతిపై మొఘల్‌పురా, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయని అదనపు డీసీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు ఎస్.రాఘవేంద్ర, కె.నాగేంద్రప్రసాద్‌వర్మ, ఎస్ఐలు మల్లేష్, కె.నర్సిములు, జి.అంజనేయులు, ఎన్.నవీన్ తదితరులు ఉన్నారు.

జగిత్యాలలో ఆశా వర్కర్‌పై లైంగికదాడి

(మొదటిపేజీ తరువాయి)



చేశారు. లేకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళన తీవ్రతను గమనించిన అధికారులు చివరకు దిగొచ్చారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ లత, డీఎస్పీ రఘు, డీఎంహెచ్‌ఓ ప్రమోద్ కుమార్‌తోపాటు ఇతర అధికారులు యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. ఎఫ్ఐఆర్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని, బాధితురాలికి నష్టపరిహారంగా రూ.5 లక్షలు, తక్షణ ఆర్థిక సహాయంగా కలెక్టర్ నిధుల నుంచి రూ.50 వేలు అందజేస్తామని తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇంటి స్థలంతో పాటు ఇల్లు కట్టించే ప్రయత్నం చేస్తామని, ఆశా వర్కర్ల రక్షణ కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డీఎంహెచ్‌ఓ ప్రమోద్ కుమార్ ధర్నా వద్దకు వచ్చి, వైద్య శాఖ నుంచి కూడా ఆర్థిక సహాయం అందిస్తామని, ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ హామీలతో ఆశాలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఇందూరి సులోచన, కార్యదర్శి మమత, నాయకులు దివ్య, వనిత, జ్యోతి, గాయత్రి, ప్రేమలత, సీపీఐ(ఎం) నాయకులు తిరుపతి నాయక్, మైపాల్ నాయక్, వెంకటాచారి పాల్గొన్నారు. వైద్య సిబ్బంది డాక్టర్లు స్వాతి లక్ష్మణ్, మాదేశి శిరీషా ఆశా వర్కర్ల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. "ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆశా వర్కర్ల భద్రత కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి" అని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

27న ఆశావర్కర్‌పై లైంగిక దాడి

జగిత్యాల జిల్లాలో దుబ్బ రాజన్న జాతర సందర్భంగా ఫిబ్రవరి 27న ఒడ్డె లింగాపూర్‌కు చెందిన ఆశా వర్కర్ విధులు నిర్వహించి ఇంటికి వెళ్తుండగా, ఓ వ్యక్తి ఆమెను బెదిరించి.. బైక్‌పై తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. 18ఏండ్లుగా ఆశా వర్కర్‌గా సేవలందిస్తున్న దళిత మహిళ, నిరుపేద కుటుంబానికి చెందిన బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాకపోవడంతోపాటు నిందితుడిని వెంటనే అరెస్టు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

(మొదటిపేజీ తరువాయి)

హోటల్ తాజ్ వివాంటలో 'గనుల రంగంలో మహిళల భాగస్వామ్యం- వివిధ రంగాల్లో మహిళల పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..2047లో వికసిత భారత్ కలను నెరవేర్చేందుకు బాటలు వేస్తూ ఈ దేశ ఆడబిడ్డలు చరిత్ర సృష్టిస్తున్నారని కొనియాడారు. సమాజంలోని ప్రతి అడుగులో మహిళల శక్తికి గుర్తింపు నివ్వడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నొక్కి చెప్పారు. ఉన్నత విద్యలో మహిళల అడ్మిషన్లు 28 శాతానికిపైగా, సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సుల్లో 43 శాతానికిపైగా పెరిగాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాల గురించి సోదాహరణంగా వివరించారు. ప్రస్తుతం భారతదేశంలోని ఎయిర్ ఫోర్స్ పైలట్స్‌లో 15 శాతం మంది మహిళలే ఉన్నారనీ, మనదేశానికి దరిదాపుల్లో ఏదేశమూ లేదని చెప్పారు. మహిళలు అండర్ గ్రౌండ్ మైన్‌లలో కూడా పని చేసేందుకు అనుమతులిచ్చామని తెలిపారు. సింగరేణిలో మహిళల భాగస్వామ్యం పెరగబోతున్నదని చెప్పారు. కోలిండియాలో జ్యోతి ఉమెన్ లీడర్ షిప్ కార్యక్రమం ద్వారా మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రత్యేక ట్రెనింగ్ ఇవ్వడం సంతోషకరమన్నారు. మైనింగ్ రంగంలో అధికారుల నుంచి కార్మికుల వరకు 100 శాతం మహిళలే ఉండేలా చర్యలు తీసుకోవాలని బొగ్గు, గనుల శాఖను, కోలిండియాను ఆదేశించానని చెప్పారు. మహిళల భాగస్వామ్యం పెరిగితే ఉత్పత్తి సామర్థ్యం కూడా పెరుగుతుందనేది తన నమ్మకమన్నారు. మైనింగ్ రంగంలో పనిచేసే వారికి కోటి రూపాయల మేర హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మైనింగ్ రంగానికి మహిళా అంబాసిడర్‌ను నియమించనున్నట్టు తెలిపారు.

ప్రపంచంలోనూ, దేశంలోనూ మైనింగ్ రంగంలో మహిళల భాగస్వామ్యం ఎనిమిది నుంచి 10 శాతం లోపే ఉందనీ, మైనింగ్ రంగంలో మహిళలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) నొక్కి చెప్పారు. సమాన పనికి సమాన వేతనం కోసం మహిళలు ఫైట్ చేస్తున్నారని గుర్తుచేశారు. మహిళలకు అవకాశమిస్తే ఆకాశమే హద్దుగా రాణిస్తారని చెప్పారు. అంతరిక్షంలోనే కాదు భూగర్భంలో కూడా మహిళలు పనిచేయగలరని కొనియాడారు. సమాజ కట్టుబాట్ల వల్ల మహిళలు ముందడుగు వేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపైనా, ప్రభుత్వ పెద్దలపైనా ఉందన్నారు. మహిళా సంక్షేమం, శ్రేయస్సు కోసం కేంద్ర ప్రభుత్వం ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని కోరారు.

రూ.27.61 కోట్లతో మల్కాజ్‌గిరి రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి

ఇప్పటికే 60 శాతం పూర్తయిన పనులు



అభివృద్ధి పనులు ఇలా..

- స్టేషన్ భవనం ముఖద్వారం అభివృద్ధి, ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం ఏర్పాటు
- ప్రయాణీకుల సౌకర్యార్థం 12 మీటర్ల వెడల్పు గల పాదచారుల వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జి) నిర్మాణం
- 3 లిఫ్టులు, 3 ఎస్కలేటర్ల ఏర్పాటు
- ప్లాట్‌ఫామ్ విస్తరణ, ప్లాట్‌ఫారమ్‌పై అదనపు కప్పు ఏర్పాటు
- దివ్యాంగుల కోసం కొత్త టాయిలెట్ బ్లాకుల నిర్మాణం.
- విశ్రాంతి గది నిర్మాణం
- స్టేషను ఆవరణలో పచ్చదనాన్ని పెంచుతున్నారు.
- ట్రాఫిక్ సజావుగా సాగడానికి స్టేషన్ ప్రాంగణం విస్తరణ
- కళలు, సంస్కృతిని ప్రతిబింబించేలా పెయింటింగ్ చిత్రీకరణ.
- ప్రయాణీకులకు అనుకూలమైన సంకేతాలు, రైలు సూచిక బోర్డులు, కోచ్ సూచిక బోర్డులు మొదలైనవి ఏర్పాటు.

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

"అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్" కింద రూ.27.61 కోట్లతో చేపట్టిన మల్కాజిగిరి రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు ఈ ఆర్థిక సంవత్సరంలోగా పూర్తిచేసే లక్ష్యంతో రైల్వే శాఖ ముందుకు సాగుతున్నది. అందులో భాగంగానే ఇప్పటికే 60 శాతం మేర పనులు పూర్తిచేసింది. మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ హైదరాబాద్ డివిజన్ పరిధిలో సబర్బన్ గ్రేడ్-3 కింద ఉంది. సికింద్రాబాద్- మన్మాడ్ సెక్షన్‌లో ఉన్న ఈ స్టేషన్ రూ 5.48 కోట్ల వార్షిక ఆదాయాన్ని అందిస్తున్నది. సగటున రోజుకు 2500 మంది ప్రయాణీకుల రాకపోకలు సాగిస్తున్నారు. ఆ స్టేషన్‌లో దాదాపు 27 జతల రైళ్లు ఆగుతున్నాయి.

ప్రయాణీకులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడంలో భాగంగా పునరాభివృద్ధి పనులను రైల్వే శాఖ చేస్తున్నది. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో చర్లపల్లిలో ప్రత్యేక టెర్మినల్‌ను రైల్వే శాఖ నిర్వహించిన సంగతి తెలిసిందే.



డీఎస్సీ-2003 టీచర్లకు ఓపీఎస్ వర్తింపజేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి
- అంగీకారం తెలిపిన ముఖ్యమంత్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను వర్తింపజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారనీ, ఓపీఎస్‌ను వర్తింపజేసేందుకు అంగీకరించారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన శ్రీపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డిని శాలువాతో సీఎం సత్కరించి అభినందించారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలననుసరించి పాత పెన్షన్ విధానాన్ని వర్తింప జేయాలని కోరారు. దీనిపై అధికారులతో పరిశీలింపజేసి ఆదేశాలను జారీ చేస్తామంటూ సీఎం హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఏకీకృత సర్వీసు నిబంధనలను రూపొందింపజేసి ఉన్నతస్థాయి పదోన్నతులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖలో ఖాళీలు ఏర్పడగానే విద్యార్థులు నష్టపోకుండా వెంటనే పదోన్నతులిచ్చేలా ఉన్న జీవో 67ను పునరుద్ధరించాలని కోరారు. 12 ఏండ్లు పూర్తయిన స్కూల్ అసిస్టెంట్, 24 ఏండ్లు పూర్తయిన ఎస్జీటీల అర్హతలను పరిశీలించి గెజిటెడ్ హోదా కల్పించాలని సూచించారు. అన్నింటినీ పరిశీలింపజేసి ఆదేశాలను ఇస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి సహకరిస్తానని శ్రీపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షులు పి వెంకట్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదు?

- మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఒప్పందాలు బయటపడుతున్నాయని తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలిచాక, కాంగ్రెస్‌కు రంజాన్ గిఫ్ట్ ఇచ్చామంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. బీజేపీకి ఇప్పటికే ఎన్నో గిఫ్టులు ఇచ్చామనీ, త్వరలో మరో గిఫ్ట్ ఇస్తామని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటేసిన ఓటర్లకు, ఆయన కోసం క్రియాశీలకంగా పని చేసిన కార్యకర్తలకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించేందుకు బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం చేసుకున్నాయని విమర్శించారు.

రంగనాయక సాగర్ నుంచి ... 6 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించాలి

- మంత్రి ఉత్తమ్‌కు ఎంపీ చామల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగనాయక సాగర్ డీ10 కెనాల్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ డి-3 కెనాల్ పరిధిలో ఉన్న ఆయకట్టును స్థిరీకరణ చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జనగామ నియోజకవర్గం దూల్మిట్ట, చేర్యాల మండలాల పరిధిలోని కమలాయపల్లి, అర్జున్ పట్ల, ఆకునూర్, జూలపల్లి లింగాపుర్, దూల్‌మిట్ట గ్రామాల పరిధిలోని సుమారు 6 వేల ఎకరాలకు రంగనాయక సాగర్ డీ10 కెనాల్ కింద సిర్థీకరణ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అక్కడి రైతుల పంటలు ఎండిపోకుండా వెంటనే నీటిని విడుదలపై మంత్రి అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్టు చామల కిరణ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. పంటలు ఎట్టి పరిస్థితుల్లో ఎండిపోనివ్వకుండా చూస్తానని ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు కొండల్ రెడ్డి, నరసింగ రావు, కంచ రాములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టాస్క్ సంస్థకు నిటి ఆయోగ్ ప్రశంసలు

- కేటీఆర్ హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ను నిటిఆయోగ్ ప్రశంసించడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర యువతకు, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తాము చేసిన కృషికి ఇది గుర్తింపు అని ఆయన తెలిపారు. 2014లో ప్రారంభించి అనేక విజయాలు సాధించినట్టు పేర్కొన్నారు. టాస్క్ ద్వారా పారిశ్రామిక వర్గాలు, విద్యారంగం, ప్రభుత్వాలను కలుపుతూ నాణ్యమైన మానవ వనరుల తయారీకి, శిక్షణకు టాస్క్ ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. టాస్క్ సాధించిన విజయాలను నిటిఆయోగ్ తన నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించిందని సంతోషం వ్యక్తం చేశారు. టాస్క్ 761 కాలేజీల్లోని 9.84 లక్షల మంది విద్యార్థులకు, 18,650 మంది ఫ్యాకల్టీకి శిక్షణనిచ్చిందని ఆయన గుర్తు చేశారు. సుమారు 80 పారిశ్రామిక సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుని, 35 వేల మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిందని కేటీఆర్ తెలిపారు. ముఖ్యంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి టాస్క్ సంస్థ ద్వారా ఎంతో లబ్ధి చేకూరిందనీ, పారిశ్రామిక వర్గాల అవసరాలకు అనుగుణంగా టాస్క్ ఇచ్చిన శిక్షణతో విద్యార్థులు, యువత ఉపాధి అవకాశాలను సులభంగా పొందగలిగారంటూ నిటిఆయోగ్ అభినందించిందని కేటీఆర్ పేర్కొన్నారు.

రాష్ట్ర అతిథిగృహం ప్రారంభం

- ప్రజాధనం వృధా కానివ్వం: కోమటిరెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్‌లోని బేగంపేట ప్రజాభవన్ ఆవరణలో ఉన్న స్టేట్ గెస్ట్ హౌస్‌ను రాష్ట్ర రోడ్లు భవనాల సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొత్తగా నిర్మించిన భవనాన్ని ఆసాంతం మంత్రులు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం క్యాంపు ఆఫీసుగా వినియోగించిన భవనాన్ని ఆధునీకరించి స్టేట్ గెస్ట్‌హౌస్‌గా మార్చి అన్ని వసతులతో ఇంటిని మరిపించేలా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని అధికారులు, వేరే రాష్ట్రాల నుంచి వచ్చే అతిథులకు, విదేశాల నుంచి వచ్చే అతిథులకు ఆతిథ్యం ఇవ్వడం కోసం ఈ స్టేట్ గెస్ట్ హౌస్‌ను వినియోగంలోకి తెచ్చినట్టు వివరించారు. వేరే రాష్ట్రాల నుంచి వచ్చే అతిథుల కోసం హోటళ్లలో గదులు కేటాయించి ప్రజాధనం వధా చేయకుండా స్టేట్ గెస్ట్ హౌస్‌ను వినియోగిస్తామన్నారు.

ఈపీఎఫ్‌వో అంటే దేవాలయమే

భవిష్యత్‌లో ఏటీఎం నుంచి కార్యకలాపాలు

301 నెంబర్‌తో మరిన్ని సేవలకు ప్రణాళికలు : కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా

డిజిటలీకరణతో సేవలు మరింత విస్తృతం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్మికులకు సేవలందించే ఈపీఎఫ్ఓ దేవాలయం లాంటిదని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా అన్నారు. భవిష్యత్తులో కార్యాలయాలకే రాకుండా డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయనున్నట్టు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని బేగంపేటలో ఈపీఎఫ్ఓ జోనల్ నూతన కార్యాలయాన్ని మరో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాండవీయా మాట్లాడుతూ..దేశంలో అత్యధిక ఎక్కువ నిధులున్న సంస్థ ఈపీఎఫ్ఓ అన్నారు. ఆ కార్యాలయాలకు వచ్చే కార్మికుల సమస్యలను, క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని సూచించారు. కార్మికుల డబ్బుతో సమానంగా కేంద్ర ప్రభుత్వం కూడా నిధులను జమ చేస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో ఎక్కడ పనిచేసేవారైనా నేరుగా బ్యాంకుల నుంచే విత్‌డ్రా సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. కార్మికుల సేవల కోసం 201 టోల్‌ఫ్రీ నెంబర్‌ను కూడా ప్రారంభించామని చెప్పారు. భవిష్యత్తులో 301 నెంబర్‌తో మరిన్ని సేవలను అందించేలా ప్రణాళిక రూపొందించి పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు.

యూఎఎన్ నెంబర్ ద్వారా కార్యకలాపాలు నిర్వహించినట్టే కార్మికులు సేవలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

భవిష్యత్తులో ఈపీఎఫ్ఓ లావా దేవీలు ఏటీఎం ద్వారా కూడా నిర్వహించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. దేశాభివృద్ధికి వెన్నెముక కార్మిక శక్తియేనని పునరుద్ఘాటించారు. మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో పని విధానంలో కూడా మార్పులను తీసుకు రాబోతున్నామని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు కోసం అన్ని విధాలా సిద్ధంగా ఉండి పనిచేస్తు న్నామన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..మూడు రోజుల్లోనే క్లయిమ్‌లను పరిష్కరించేలా నిర్ణయం తీసుకున్న ప్రధాని మోడీ, కార్మిక శాఖ మంత్రి మాండవీయాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దేశంలోనే నెంబర్‌వన్ ఈఎస్ఐ ఆస్పత్రిలో హైదరాబాద్‌లో ఉందన్నారు. తెలంగాణలో మరిన్ని ఈఎస్ఐ ఆస్పత్రులు, ఈపీఎఫ్ఓ కార్యాలయాలు కట్టేందుకు స్థలాలి వ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ-కామర్స్ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఈపీఎఫ్ఓ ప్రయోజనాలను వర్తింపజేయాలని విన్నవించారు. రామగుండం లాంటి చోట్ల స్థలాలు కేటాయిస్తే పనులను మొదలు పెడతామన్నారు.

రాష్ట్రంలో విరివిగా పెట్టుబడులు పెట్టండి

పారిశ్రామిక వేత్తలకు రెడ్ కార్పెట్ వేస్తాం : మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల పరిస్థితులున్నాయి. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటాం. ఇక్కడ పెట్టుబడులు పెట్టి "తెలంగాణ రైజింగ్"లో భాగస్వామ్యం కండి" అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో ప్రపంచ ప్రఖ్యాత కళ్లజోళ్ల సంస్థ "లెన్స్ కార్ట్" రూ.1,500 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఉత్పత్తి కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తూ తెలంగాణ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సంస్థ ద్వారా 2,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, లెన్స్ కార్ట్ ప్రతినిధులు చౌదరి, సుమిత్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రెండేండ్లలో ఉత్పత్తి...

రాష్ట్రంలో నెలకొల్పనున్న "లెన్స్ కార్ట్" ప్లాంట్ రెండేండ్లలో ఉత్పత్తి ప్రారంభించనుంది. నాలుగేండ్లలో పూర్తి కార్యకలాపాలు మొదలవుతాయి. ఇప్పటికే రాజస్థాన్‌లో ఈ సంస్థ ఒక అధునాతన తయారీ యూనిట్‌ను నిర్వహిస్తోంది. తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను ప్రపంచంలోనే అతి పెద్దదిగా భావిస్తు న్నారు. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులు జపాన్, సింగపూర్, థాయ్‌లాండ్, తైవాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మలేషియా, వియత్నాం, సౌదీ అరేబియా తదితర దేశాలకు ఎగుమతి అవుతాయి.

అడుగడుగునా ప్రభుత్వాన్ని నిలదీస్తాం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో మాపై బాధ్యత పెరిగింది

సమస్యలపై చర్చలకు సిద్ధమే.. పనికిరాని మాటలకు కాదు : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయంతో తమపై మరింత బాధ్యత పెరిగిందనీ, ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రెఫరెండమా? వైఫల్యమా? అనే దానిపై సమీక్షించుకోవాలని సూచించారు. కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపొందిన అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్యలతో కలిసి గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విజయోత్సవాలను నిర్వహించారు. అనంతరం ప్రెస్‌మీట్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..బీఆర్ఎస్, కాంగ్రెస్ తోడు దొంగలనీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలెవరి వైపో స్పష్టంగా అర్థమైందని చెప్పారు. సేవ్ తెలంగాణ..సపోర్టు బీజేపీ నినాదంతో ముందుకెళ్తామన్నారు. బీజేపీ అభ్యర్థుల విజయం తెలంగాణ సమాజం, ఆత్మబలిదానాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులకే అంకితమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే బీజేపీని ఆదరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అధికారంలోకి వచ్చాక మోసం చేయడం, తప్పుడు ఆరోపణలు, వితండవాదం, తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తెలంగాణ సమాజం గమనిస్తుందన్నారు. అయినా ప్రజలు సీఎం మాటలు, ఆరోపణలను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలైనా హామీలను నెరవేర్చక ఎదురుదాడికి దిగుతున్నారనీ, బీజేపీపై ఆరోపణలను నెడుతున్నారని విమర్శించారు. పదేండ్లు తమదే అధికారం అంటున్న కాంగ్రెస్ నేతలకు ప్రజలు కర్ర కాల్చి వాత పెట్టారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే సంస్థాగతంగా మరింత పటిష్టమవుతున్నామని చెప్పారు. రానున్న ఒకటి రెండు నెలల్లోనూ అన్ని కమిటీలను పూర్తి చేసుకొని రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలతో కలిసి ప్రజా పోరాటాలకు సమాయత్తం అవుతామని చెప్పారు. తెలంగాణ ప్రజల్లో మొదలైన వ్యతిరేకతను కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు గుర్తించాలన్నారు. సమస్యలపై చర్చించేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. పనికిరాని ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం తనకు లేదన్నారు. మూడు రాష్ట్రాల్లోనూ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఓడించి రిటర్న్ గిఫ్ట్ ఇస్తారని చెప్పారు.

అమెరికాతో మైత్రి వీడాలి

ప్రధాని మోడీకి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

టెకీల పట్ల ట్రంప్ తీరుపై చంద్రబాబు మాట్లాడకపోవడం అన్యాయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ దేశాలన్నింటికీ ప్రమాదకరంగా మారుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఖండించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ డిమాండ్ చేశారు. అమెరికాతో భారత్ మైత్రి బంధాన్నీ వీడాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఉన్న మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లానని చెప్పే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అమెరికా ప్రభుత్వం అక్రమ వలసదారుల పేరుతో టెకీల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్న తీరుపై కనీసం మాట్లాకపోవడం అన్యాయమని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి ఆక్సిజన్ అందిస్తున్న చంద్రబాబు ప్రధాని మోడీపై ఒత్తిడి తేవాలని కోరారు. అమెరికాకు ఉన్న ధన, సైనిక బలాన్ని అడ్డం పెట్టుకుని ట్రంప్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రపంచ దేశాలను గుప్పెట్లో పెట్టుకునేందుకు అమెరికా సామ్రాజ్యవాదం ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే వివిధ దేశాలపై ఆంక్షలను విధిస్తూ అక్కడి ప్రజా ప్రభుత్వాలను కూలదోస్తూ సంపదను కొల్లగొడుతున్నదని విమర్శించారు. భారత్ పట్ల ట్రంప్ నిరంకుశంగా వ్యవహరిస్తున్న తరుణంలో ప్రధాని మోడీ దేశ ప్రతిష్టను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత అక్రమ వలసదారుల పేరుతో అక్కడ ఉన్న భారత ప్రజల పట్ల దారుణంగా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. అమెరికాకు ఉపాధి కోసం వెళ్లి అక్కడ ఏండ్ల తరబడి నివసిస్తున్న యువత పట్ల ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. దీంతో అక్కడున్న వారు పూర్తిగా నిరాశ నిస్పృహలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ దేశంలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తించి కనీసం నెల రోజులు వారికి సమయం ఇచ్చి వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలే తప్ప జంతువుల మాదిరిగా వేటాడుతూ సంకెళ్లు వేసి సైనిక విమానాల్లో తీసుకొచ్చి వదలడమేంటని ప్రశ్నించారు. ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు వెళ్లి వచ్చిన తర్వాత రోజు నుంచే అక్రమ వలసల పేరుతో అమెరికా వారి పట్ల క్రూరంగా వ్యవహరిస్తోందనీ, ఇది దుర్మార్గమని విమర్శించారు. భారత పౌరుల పట్ల ఇంత జరుగుతున్నా మోడీ మాత్రం అమెరికాతో స్నేహ సంబంధాలను కొనసాగించేందుకు తహతహ లాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కేరళ నుంచి క్యాడవర్ డాగ్స్

(మొదటిపేజీ తరువాయి)

పనులు సాగుతున్నాయి. టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని గుర్తించేందుకు కేరళ నుంచి ప్రత్యేకంగా క్యాడవర్ డాగ్స్‌ను రప్పిస్తున్నట్టు అరవింద్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం టన్నెల్ వద్ద జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి ఐటీ నిపుణులు, సింగరేణి సాంకేతిక నిపుణులు, సైనిక అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

రోబోల ఏర్పాటుపై పరిశీలన

కార్మికులను వెలికి తీసే క్రమంలో రెస్క్యూ టీమ్‌లకు ఎలాంటి ప్రమాదమూ జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. రోబో టెక్నాలజీని ఉపయోగించి పనులు నిర్వహించాలని అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. శానిటేషన్ వెహికిల్స్‌ను సొరంగంలోకి పంపుతున్నారు. అయితే సొరంగంలో శానిటేషన్ సమస్య జఠిలంగా మారింది. ఒకే ప్రాంతంలో 150 మంది పనులు నిర్వహిస్తున్నారు. ఎన్‌జీఆర్ఎఫ్, నేవీ, ఆర్మీ, హైడ్రా నిపుణులు, అధికారుల పర్యవేక్షణలో ఎన్వీ రోబో టెక్నాలజీ వాడితే ప్రయోజనం ఉంటుందని అధికారులు తెలిపారు. సహాయక చర్యలను గురువారం సాయంత్రం మినిస్ట్రీ ఫర్ హోం అఫైర్స్ నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సెక్రెటరీ కల్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ పర్యవేక్షించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఆయనకు రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి అరవింద్‌కుమార్ టన్నెల్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, కొనసాగుతున్న సహాయక చర్యలను వివరించారు.

టన్నెల్ లోపల 13.650 కిలోమీటర్ల ప్రాంతంలో బోర్ మిషన్‌పై రాళ్లు, మట్టి పడి దాదాపు 150 మీటర్ల పొడవు ఉన్న మిషన్ పూర్తిగా ధ్వంసమైందన్నారు. అందులోనే 8 మంది చిక్కుకుపోయారన్నారు. నీరు రావడం, మట్టి, రాళ్లతో కలిసి పోయిందన్నారు. ప్రస్తుతం టీబీఎంను కొద్దికొద్దిగా కట్ చేస్తూ ముందుకు పోతూ కార్మికుల కోసం వెతుకుతున్నట్టు వివరించారు.పనులను స్వయంగా పర్యవేక్షించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, కేరళ నుంచి వచ్చిన క్యాడవర్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి సాయంత్రం టన్నెల్‌లోకి వెళ్లారు. శుక్రవారం ఉదయం క్యాడవర్ డాగ్‌లను స్క్వాడ్‌తో పంపిస్తారు. పర్యవేక్షణ పనుల్లో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, డోగ్ర రెజిమెంట్ కమాన్‌డెంట్ పరిక్షిత్ మెహ్రా, ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ ప్రసన్న, జయప్రకాష్ అసోసియేట్ ఎం.డి. పంకజ్ గౌర్ తదితరులు ఉన్నారు.

సీఎస్, డీవోలకు షోకాజ్ నోటీసులు

ప్రభుత్వ వాహనంతో ఎస్కార్టు సౌకర్యం కల్పించాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి టీజీజేఎల్ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జగిత్యాల జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణలో భాగంగా ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలను నాలుగు చక్రాల వాహనం (కారు)లో తీసుకెళ్లకపోవడంతో పది మంది చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)లకు ఆ జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి ఇచ్చిన నిబంధనలకు విరుద్ధంగా మూడు చక్రాల వాహనం (ఆటో)లో ప్రశ్నాపత్రాలను తీసుకెళ్లడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు చక్రాల వాహనంలో ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలను ఎందుకు తీసుకెళ్లలేదో వివరణ ఇవ్వాలంటూ సీఎస్, డీవోలకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. షోకాజ్ నోటీసులు జారీ చేయడాన్ని అధ్యాపక సంఘాలు వ్యతిరేకించాయి. ఆ నోటీసులను ఉపసంహరించుకోవాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్ఏ-475) డిమాండ్ చేసింది. ఇంటర్ పరీక్షా కేంద్రాలకు ప్రభుత్వ వాహనంతో కూడిన ఎస్కార్టు సౌకర్యం కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యకు ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రం పంపించారు. విధి నిర్వహణలో ఉన్న వారికి సొంత కార్లులేవని తెలిపారు. రవాణా అలవెన్సు కింద ప్రతిరోజూ రూ.188 మాత్రమే చెల్లిస్తారని పేర్కొన్నారు. కారును అద్దెకు తీసుకుంటే రోజు సుమారు రూ.వెయ్యి చెల్లించాల్సి వస్తుందని వివరించారు. అందుకే ప్రభుత్వ వాహన సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ) సభ్యులు, హైపవర్ కమిటీకి ఇంటర్ బోర్డు కార్ల సౌకర్యాన్ని కల్పిస్తుందని తెలంగాణ ఇంటర్మీడియెట్ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం (టిగ్లా) రాష్ట్ర అధ్యక్షులు ఎం జంగయ్య, ప్రధాన కార్యదర్శి షేక్ నయీమ్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. వారికి ఇస్తున్నట్టుగానే సీఎస్, డీవోలకు కూడా ఇంటర్ బోర్డు కార్ల సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

ఇంటర్ బోర్డు కార్యదర్శికి ధన్యవాదాలు

జగిత్యాల జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)లకు ఇచ్చిన షోకాజ్ నోటీసు విషయంలో సమస్యను పరిష్కరించిన ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యకు టీజీజేఎల్ఏ-475 రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ధన్యవాదాలు తెలిపారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలను తీసుకెళ్లడానికి కారు లేకుండా ఇబ్బంది ఉంటే సంబంధిత జిల్లా అధికారులను సమాచారం ఇస్తే తగిన రవాణా ఏర్పాట్లు చేస్తారని పేర్కొ న్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా పరీక్షలను నిర్వహించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఇందుకు సంబంధించి జగిత్యాల కలెక్టర్‌తో కృష్ణ ఆదిత్య మాట్లాడి సమస్యను సానుకూలంగా పరిష్కరించారని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కోరలేదు: టి.జగ్గారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తనకు ఎమ్మెల్సీ టికెట్ కావాలని కోరలేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఇప్పటికే పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందనీ, పరిస్థితులు అనుకూలించక ఓడిపోయినట్టు తెలిపారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నాననీ, ఎమ్మెల్సీ కావాలని అడిగే గుణం తనది కాదని తెలిపారు. 2017లో రాహుల్‌గాంధీ సభ ఏర్పాట్ల మీద స్పష్టంగా ఆయన దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తు న్నట్టు తెలిపారు. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరనున్నట్టు చెప్పారు.

బీఆర్ఎస్, బీజేపీ చీకటి రాజకీయాలతో ఎమ్మెల్సీ గెలుపు

- డాక్టర్ మల్లు రవి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్, బీజేపీ చీకటి రాజకీయాలతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి విమర్శించారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు ఎక్కడా చెక్కు చెదరలేదని తెలిపారు. అనేక అవినీతి కేసులున్న కేసీఆర్ కుటుంబం క్విడ్ ప్రో పద్ధతిలో బీజేపీ కోసం పని చేస్తున్నదని ఆరోపించారు. గత పార్లమెంట్ ఎన్నికల ముందు నుంచే ఈ ఒప్పందాలు అమలవుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ లోపాయికారి మద్దతుతోనే బీజేపీ ఎనిమిది ఎంపీ సీట్లను గెలుచుకుందని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్‌కు 22 మంది ఎమ్మెల్యేలున్నా ఆ ఒప్పందంలో భాగంగా పోటీకి దూరంగా ఉండి బీజేపీని గెలిపించిందని తెలిపారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుల ఆమోదం పట్ల హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురువారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్‌లో 33 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు ఆమోదం తెలపడం పట్ల తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలోని 10,950 గ్రామాలకు క్షేత్రస్థాయి అధికారులు, కొత్త డివిజన్లు, మండలాలకు 217 పోస్టులను మంజూరు చేయడాన్ని వారు స్వాగతించారు. రాష్ట్రంలో ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులు మాత్రమే ఉండేవని తెలిపారు. దీంతో ఆ పై కేడర్‌లో పని చేసే అవకాశం లేకుండా ఉండేదనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తెలంగాణ రెవెన్యూ చరిత్రలో మైలు రాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబ కారణాల వల్లే శ్రీవిద్య బడికి దూరం

నా ఆదేశాలతో తిరిగి పాఠశాలలో చేర్పించిన అధికారులు : సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని సనత్‌నగర్ దాసారం బస్తీకి చెందిన మల్లెల శ్రీవిద్య సమస్యను పత్రికల ద్వారా తన దృష్టికి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ ద్వారా గురువారం ట్వీట్ చేశారు. హైదరాబాద్ డీఈవో రోహిణి ద్వారా విచారణ జరిపించానని తెలిపారు. శ్రీవిద్య పాఠశాలకు హాజరుకాలేకపోవడానికి ఆధార్ కార్డు లేకపోవడం కారణం కాదని తేలిందని స్పష్టం చేశారు. కుటుంబ కారణాల వల్ల ఆమె పాఠశాలకు దూరమైందని వివరించారు. తన ఆదేశాల మేరకు అధికారులు తిరిగి ఆమెను పాఠశాలలో చేర్పించారని తెలిపారు. ఆమె మంచి చదువులు చదవాలనీ, భవిష్యత్‌లో గొప్పగా రాణించాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

పచ్చదనం తరిగే..వెచ్చదనం పెరిగే..



నవతెలంగాణ- హయత్‌నగర్

రోజురోజుకూ నగరంలో పచ్చదనం తరిగిపోవడంతో దాని ప్రభావం వాతావరణంపై పడి వెచ్చదనం పెరిగిపోతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన్సూరాబాద్, హయత్‌నగర్ డివిజన్లలోని పలు కాలనీలలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సుమారు 10 నుండి 15 సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన చెట్లను కాలనీవాసులే నిర్మాణాల కోసం అడ్డుగా వస్తున్నాయని వాటిని మొదలుకు నరికి వేస్తూ పచ్చదనాన్ని తుంచి వేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు వాటిపై దృష్టి సాధించకపోవడంతో ఎవరికి వారే చెట్లను నరికి వేస్తూ వాతావరణంలో కాలుష్యానికి విఘాతం కలిగిస్తున్నారు.

చెత్తకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు..



నవతెలంగాణ- హయత్‌నగర్

చిరు దుకాణాలు, కాలనీల్లో డంపింగ్ యార్డు వద్ద ఉన్న చెత్తను ఎత్తే వీలుకాకపోవడంతో అక్కడే చెత్తకు నిప్పు పెట్టేస్తున్నారు. దీంతో పర్యావరణంలో వాతావరణ కాలుష్య శాతం పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తగలబెట్టకుండా నివారణ తీసుకోవాల్సిన హయత్ నగర్ సర్కిల్ అధికారులు చోద్యం చూస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు. చాలా చోట్ల వేసవి కాలంలో గడ్డికి, చెత్తకు నిప్పు పెట్టడంతో అగ్ని రవ్వలే అగ్ని జ్వాలలుగా మండుతూ పెద్ద పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్‌లు, కాలనీల్లో, ప్రధాన రహదారుల వద్ద చెత్త లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలు అమలు చేయాలని వినతి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎం) పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో బాలాపూర్ తహసీల్దార్ ఇందిరా దేవికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ బడంగ్‌పేట్ ప్రజా సమస్యలపై, స్థానిక సమస్యలపై, బస్తీలో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర సమస్యలపై సర్వే చేసినట్టు తెలిపారు. అదేవిధంగా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. డబల్ బెడ్ రూం ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్, గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్, గృహలక్ష్మి, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున సీపీఐ(ఎం) పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాబోయే కాలంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో అనురాధ లక్ష్మి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- తుక్కుగూడ పరిధిలోని రావిరాలలో డీసీపీ నూతన కార్యాలయానికి శంకుస్థాపన
- మంత్రి శ్రీధర్ బాబు





నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్‌కు సంబంధించి పోలీసుశాఖకు చెందిన వివిధ పోలీస్ భవనాల నిర్మాణాల కోసం స్థల కేటాయింపు కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నూతన భవన నిర్మాణ స్థల కేటాయింపులో భాగంగా తుక్కుగూడ పరిధిలోని రావిరాలలో వివిధ భవనాల నిర్మాణ సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో శాంతి భద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, పోలీస్ శాఖకు కావాల్సిన అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు తోడ్పాటు అందిస్తున్నామని పేర్కొన్నారు. పోలీస్ శాఖను మరింతగా బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో నేరశాతం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ, విశేషంగా కృషి చేస్తున్నందుకు కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్‌ను అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ఐపీఎస్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, ఐఏఎస్, డీసీపీ మహేశ్వరం సునీత రెడ్డి, ఏసీపీ లక్ష్మికాంత్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు గురువారెడ్డి, సుధాకర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర చైర్మెన్ చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చీగిరింత పారిజాత నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చిన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ఐద్వా



ఐద్వా సీనియర్ నాయకురాలు విజయ

నవతెలంగాణ-హస్తినాపురం

సమాజంలో మహిళల సమస్యలపై ఐద్వా అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఐద్వా సీనియర్ నాయకురాలు విజయ అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సమావేశాన్ని నందనవనం కాలనీ ఇంద్రసేనారెడ్డి కాలనీలో గురువారం కమిటీ హాల్లో నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన ఐద్వా సీనియర్ నాయకురాలు విజయ మాట్లాడుతూ.. సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలు, లైంగిక దాడితో పాటు మహిళల సమస్యలపై ఐద్వా నిర్విరామంగా పోరాటాలు చేస్తుందని గుర్తుచేశారు. అనంతరం నూతన సర్కిల్ కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా సర్కిల్ కార్యదర్శిగా ఎండి కమర్, అధ్యక్షురాలుగా దండు రాధ, ఉపాధ్యక్షులుగా భారతమ్మ, రూప, రాధమ్మ, మాధవి, సహాయ కార్యదర్శిగా లింగమ్మ, వరలక్ష్మి, అంజమ్మ, ముత్యాలమ్మ, కమిటీ సభ్యులుగా శిరీష, అనురాధ, జయమ్మ, ప్రేమలత, పూర్ణ, మంగమ్మ, చంద్రకళ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



నవతెలంగాణ- హయత్‌నగర్

గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. లక్ష్మారెడ్డి పాలెంకు ఎదురుగా సూర్య వంశీ కాలనీ దగ్గర యోయో హోటల్ పక్కన ఓగుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. చుట్టు పక్కల వారు 100 కాల్ చేయగా పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అతని వయస్సు దాదాపు 40 సంవత్సరాలు ఉందని అంచనా వేశారు. అతను బ్లూ, వైట్ లైన్స్ గల షాటు, లైట్ పింక్ షర్ట్ దుస్తులు వేసుకొని ఉన్నాడు. ఇతను చూడడానికి బిక్షగాడిలా కనిపిస్తున్నాడు. తర్వాత అతని మృతదేహాన్ని ఉస్మానియా హాస్పిటల్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన కమిషనర్





నవతెలంగాణ-మీర్‌పేట్

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది పని తీరును, పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సామాన్య ప్రజల సమ స్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత పోలీస్ సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. విజబుల్ పోలిసింగ్‌లో భాగంగా స్వయంగా తాను ప్రజ లతో మమేకమై ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులను, సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. అనంతరం సమస్యాత్మక ప్రాం తాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రత పరిరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

'దళిత' రాష్ట్ర స్థాయి
వర్క్ షాప్‌లను విజయవంతం చేయాలి

డీహెచ్‌పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సురేందర్



నవతెలంగాణ-హయత్ నగర్

ఈ నెల 10, 11, 12వ తేదీలలో రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో జరిగే దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సురేందర్ పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సవంత్సరాలు గడుస్తున్నా నేటికీ దళితులు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మనిషిని మనిషిగా గుర్తించడం లేదన్నారు. ఇప్పటికీ చాలా మందికి కనీస వసతులు తిండి, ఇల్లు, బట్ట, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు లేవని వెల్లడించారు. పాలకులు దళితులను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వినియోగించుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారు కానీ..అవి కాగితాలకే పరిమితమవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాలు కళ్ళు తెరిచే వరకు మా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మా పథకాలు, మా నిధులు, మాకు సక్రమంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు, ఇండ్లు లేనివారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. మా దళిత జాతికి నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం, ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలను కల్పించడానికి, మన హక్కులు మనం సాధించడం కోసం మన పోరాట రూప కల్పన కోసం వేములవాడలో జరిగే దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమావేశాలను దళితులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'తాగునీటి సమస్యను పరిష్కరించండి'



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పరిధిలో ఉన్న జేనిగే కొమురయ్య కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం కమిషనర్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ జేనిగే కొమురయ్య కాలనీలో ఆరు నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొని ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ పార్టీ అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సరస్వతికి వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. వాటర్ డిపార్ట్మెంట్ అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆ సమస్య తమ పరిధిలోకి రాదని, మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించాలని వాటర్ డిపార్మెంట్ అధికారులు సమాధానం ఇచ్చారని తెలపారు.

నీటి సరఫరా లేకుండానే బిల్లులు...

కాలనీలో నీటి సరఫరా అందించకుండానే ఒక్కో ఇంటికి రూ. 17వేల చొప్పున వాటర్ బిల్లులు జారీ చేస్తున్నారని అన్నారు.నీటి వసతి లేకుండా ప్రజలను బిల్లుల భారంతో వేధించడం అన్యాయమన్నారు. కాలనీవాసుల సమస్యను గమనించిన కమిషనర్ రెండు రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

సమస్యలు లేకుండా చూడాలని వినతి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిష్కరించాలని సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలోని కొన్ని కాలనీలో సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం వేసవి కాలం మొదలు కానున్న దృష్ట్యా తాగు నీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా సౌకర్యార్థం, ప్రజల దాహం తీర్చడానికి వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు శివలింగం ప్రణయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీ కూతురు అదృశ్యం



నవతెలంగాణ- హయత్‌నగర్

తల్లీ కూతురు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీకి చెందిన గుమ్మడి ఆశ.. ఈ నెల 5న ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఎవరితోనో చాటింగ్ చేస్తుంది. ఈ విషయాన్ని భర్త గుమ్మడి స్వామి ఆమెను అడిగాడు. కానీ గుమ్మడి ఆశ సరిగా సమాధానం చెప్పలేదు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆమె తన కూతురును తీసుకుని బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. వారి ఆచూకి కోసం చుట్టుపక్కల ప్రాంతాలలో, తెలిసిన వాళ్ల దగ్గర వెతికినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే గుమ్మడి స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మాజీ కార్పొరేటర్ ఇంద్రసేన



నవతెలంగాణ-బడంగ్‌పేట్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మాజీ కార్పొరేటర్ ఇంద్రసేన కాంట్రాక్టర్‌కు సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్ జయ సూర్యపట్నం, లక్ష్మీనగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. డివిజన్ పరిధిలోని గత 5 సంవత్సరాల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్టు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించండి

కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్

నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పడుతున్న కాలనీలో రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మిని గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో కలిసి కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత నూతన రోడ్ల నిర్మాణానికి ఇతర పనులకు నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హస్తినాపూర్ డివిజన్ అభివృద్ధే తన లక్ష్యమని అన్నారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. మేయర్ విజయలక్ష్మి సానుకూలంగా స్పందించి.. డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.



పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలి

స్కూల్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి





నవతెలంగాణ-సిటీబ్యూరో

పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని స్కూల్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మునగనూరులో ఎడ్యుస్మార్ట్ స్కూల్‌లో ప్రజ్ఞాంతర ఏ రోబోటిక్స్ ఫెయిర్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సంధ్యారెడ్డిలు మాట్లాడుతూ స్కూల్లో పిల్లలకు పాఠ్య అంశాలతో పాటు కాలానికి అనుగుణంగా వస్తున్న సాంకేతిక అంశాలతో ఉన్న అవకాశాలపై నైపుణ్యాన్ని పెంచాలని సూచించారు.

ఈ అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. చదువు ఒకటే జీవితం కాదని.. ప్రతి ఒక్క విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి వెలికితీస్తే వారి జీవితాలను తీర్చిదిద్దిన వాళ్ళం అవుతామని అన్నారు. ఉపాధ్యాయులతో పాటు తల్లీదండ్రులు కూడా తమ పిల్లలకు ఏ అంశాలలో అభిరుచి ఉందో తెలుసుకొని వారిని ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల రోబోటిక్స్‌ను పదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

- హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు విజయ్ కుమార్
- పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



నవతెలంగాణ -శామీర్‌పేట

కష్టపడి కాకుండా ఇష్టంతో చదివితేనే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు విజయ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. గురువారం హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ సభ్యులు నగేష్ వాళ్ల తల్లి రోజమ్మ జ్ఞాపకార్థం మూడుచింతలపల్లి మండలం కేశవరంలోని జిల్లా పరిషత్తు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలి

- కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్



నవతెలంగాణ - చర్లపల్లి

కాలనీ వాసులందరూ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సూచించారు. గురువారం నాచారం డివిజన్‌లో కొత్తగా ఏర్పడ్డ ప్రోగ్రెస్సివ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ వీఎస్‌టీ కాలనీ కార్యవర్గ సభ్యులు కార్పొరేటర్‌ను వారినివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కమిటీ వాసులకు కార్పొరేటర్ శుభాకాంక్షలు తెలిపారు.ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా కాలనీ అభివృద్ధికి పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ జాన్ వెస్లీయ్ (రిటైర్డ్ డీసీపీ) సుగుణకర్ రావు, రోహిత్ కుమార్, అర్జున్, మధుకర్, పురుషోత్తం, శైలు, స్రామాట్, ప్రభు కుమార్, విశ్వనాథ్, కిరణ్ రెడ్డి, కిరణ్ మౌరియ,మహేష్ యాదవ్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న మల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని సోమారం గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్యతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముదిరాజ్ పెద్దలు, మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డిలు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం నిర్మించుకోవాలనుకున్న కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. మూడో తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం నిర్వహించే శ్రీపోచమ్మ తల్లి బోనాలు, గౌవురంగంతో ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల,మున్సిపల్ అధ్యక్షులు దయానంద్ యాదవ్, భాస్కర్ యాదవ్,ప్రధాన కార్యదర్శి సుదర్శన్,మాజీ సర్పంచులు జగన్ రెడ్డి, రాజమల్లారెడ్డి, బీఆర్ఎస్ నేతలు అకిటి నవీన్ రెడ్డి, భాగ్య రెడ్డి, శ్రీనివాస్ రాజు, రఘుపతి రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై సెమినార్

నవతెలంగాణ-కాప్రా

ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఈసీఎల్ కమలానగర్ జిల్లా ఆఫీసులో సెమినార్ నిర్వహించారు.ఈ సెమినార్‌కు ముఖ్యతిథిగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి, జిల్లా అధ్యక్షురాలు ఎన్.సృజన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వాలు మహిళా సమస్యలను పరిష్కరించకుండా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. మహిళా దినోత్సవాన్ని ఫ్యాషన్ షోలు, ముగ్గుల పోటీల లాంటివి నిర్వహించి అసలు ఉద్దేశాన్ని పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. 1857లో అమెరికాలో పనిగంటల కోసం చేసిన పోరాటంలో అనేక మంది యువతులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. 1910లో కూపన్ హాగ్లో కార్ల జడ్కేన్ అధ్యక్షతన జరిగిన మహిళా అంతర్జాతీయ సదస్సులో మహిళల కొరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరపాలని డిమాండ్



చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. 175 ఏండ్లు గడిచినా ఇప్పటికీ సమాన హక్కుల కోసం, పని గంటలకు, వేత నాలలో అసమానతల కోసం ఇంకా పోరాటాలు చేయా ల్సి వస్తుందని వాపోయారు. ప్రస్తుత ప్రభుత్వాలు ఓట్ల కోసం మహిళలను మోసం చేస్తున్నారని విమర్శించా రు. పెరిగిన ధరలను అదుపు చేయడం లేదని, ఉపాధి కల్పించలేకపోతున్నారని తెలిపారు. నేడు మహిళలలో మూఢవిశ్వాసాలను పెంపొందించి మహిళలు ఏం కట్టుకోవాలి, ఏం తినాలి అనేది కూడా నిర్ణయిస్తూ ఆవు కన్నా హీనంగా మహిళని చూస్తున్నారని వాపోయారు. నమ్మకాల పేరుతో మహిళలను చదువుకు దూరం చేస్తు న్నారని మండిపడ్డారు. మహిళలకు రాజ్యాంగం కల్పించి న హక్కులను కాలరాస్తూ మనుధర్మ శాస్త్రాన్ని ముందు కు తీసుకువచ్చి మహిళలను మళ్లీ నాలుగు గోడలకే పరిమితం అయ్యేటట్టు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాస్త్ర విజ్ఞానాన్ని, సైన్స్‌ను పెంపొందించాల్సింది పోయి తిరోగమన పద్ధతిలో పాఠ్యపుస్తకాల్లో కూడా డార్విన్ సిద్ధాంతాన్ని తీసేసి మూఢనమ్మకాలను పెంపొ ందిస్తున్నారని ఆరోపించారు. మహిళా దినోత్సవం ఏ ఉద్దేశంతో ఏర్పడ్డదో ఆ ఉద్దేశంతోటే మహిళలందరూ పోరాటాలకు సిద్ధమై హక్కులను సాధించుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఆఫీస్ బేరర్స్ పి.మంగ, ఆర్.లక్ష్మి, సఫియా సుల్తానా, ఏ.విజయ, సీహెచ్ లీలావతి, జిల్లా కమిటీ సభ్యులు ఎస్. నాగమణి, భారతి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



- యూత్ ప్రధాన కార్యదర్శి గడ్డం వినేష్ యాదవ్

నవతెలంగాణ - చర్లపల్లి

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని యూత్ ప్రధాన కార్యదర్శి గడ్డం వినేష్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానన్నారు. గురువారం మల్లాపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ నూతన కమిటీ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారావు అరుణ్ పటేల్ మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా గడ్డం వినేష్ యాదవ్‌ను నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం వినేష్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో పదవీ అప్పగించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ ఐదో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయికిరణ్ గౌడ్, డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుపుల జయంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీయాలి

- శ్రీశ్రీ జ్ఞాన్ మందిర్ స్కూల్ డైరెక్టర్ పురుషోత్తం

నవతెలంగాణ - జవహర్ నగర్

విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని గుర్తించి వెలికి తీయాలని శ్రీ శ్రీ జ్ఞాన్ మందిర్ స్కూల్ డైరెక్టర్ పురుషోత్తం అన్నారు. గురువారం జవహర్ నగర్ లోని శ్రీ శ్రీ జ్ఞాన్ మందిర్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు వర్క్‌లు, పైథాగరస్ తీరం, స్క్వేర్ రూట్, క్యూబ్ రూట్ సులభ పద్ధతిలో సాధించుట, చంద్రయాన్ 3, వాటర్ హార్వెస్టింగ్ సిస్టం, గుండె పని చేయు విధానం, రామాయణం, సేంద్రీయ పద్ధతిలో వంట సాగు విధానం వంటి ప్రాజెక్టు వర్క్‌లను పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శాస్త్రవేత్తల కృషితో చంద్రమండలానికి వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. నాటి నుంచి ఈరోజు వరకు ఎన్నో కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తూ, మానవ జీవితం సుఖమయం చేస్తున్నారన్నారు. అయినా సమాజంలో అశాస్త్రీయ విధానాలు రోజురోజుకు పెరుగుతున్నాయని చెప్పారు. వాటిని రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. మూఢనమ్మకాలను పారదోరాలని పిలుపునిచ్చారు.



నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

-డైరెక్టర్ లలిత, ప్రిన్సిపాల్ శైలజ

నేటి బాలలే రేపటి బావి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని, పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని, డైరెక్టర్ లలిత, ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిరంతరం పుస్తకాలతో కుస్తీ కాకుండా అందుకు అనుగుణంగా ఆనందవేదిక... నో బ్యాగ్ డేలను ప్రోత్సహించాలన్నారు. తరగతి గదిలోని విద్యార్థి ఆలోచనకు గుర్తింపు తేవాలంటే ఉపాధ్యాయుల ప్రోత్సాహం తప్పనిసరి అన్నారు. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయుల ప్రేరణ తోడయితే వారు సరికొత్త ఆవిష్కరణలు రూపొందిస్తారని చెప్పారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన కొన్ని విజ్ఞాన ప్రదర్శనలు ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార సూచనలుగా ఉన్నాయని ప్రశంసించారు. శాస్త్ర సాంకేతిక రంగాలతోనే సమాజం అతి వేగంగా అభివృద్ధి సాధిస్తుందని, అన్ని రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆలోచనా విధానం మారాలని సూచించారు. ఆవిష్కరణలు విద్యార్థి దశలోనే మొదలు కావాలని విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెడితేనే అద్భుతాలు సాధ్యమవుతాయని సూచించారు. కొత్త ఆలోచనలతో ఎలాంటి సమస్యనైనా పరిష్కరించే అవకాశం ఉంటుందని అన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ జ్ఞాన మందిర్ ఉపాధ్యాయులు కర్నే సురేందర్, రమ, స్వప్న, నందిని, పూజిత, రాజశ్రీ, దివ్య జ్యోతి, మధులత, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విజిబుల్ పోలీసింగ్‌లో స్వయంగా పాల్గొన్న సీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి కమిషనర్ సుధీర్ బాబు మీర్ పేట పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా గురువారం లివిజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని స్థానిక ప్రజలతో మమేకమై వారి స్పందనను తెలుసుకున్నారు. వేలి ముద్రల ద్వారా నేరస్తులను గుర్తించేందుకు ఉపయోగించే అత్యధిక సాంకేతిక పరికరం పాప్లాన్‌ను స్వయంగా పరీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

సమగ్ర కుటుంబ సర్వే ఎన్యుమరేటర్లకు ఇన్సెంటివ్ చెల్లించండి



- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.రేవతి కల్యాణి



నవతెలంగాణ-కాప్రా

సమగ్ర కుటుంబ సర్వేలో పని చేసిన ఎనిమిరేటర్లకు ఇన్సెంటివ్ వెంటనే ఇవ్వాలని, లేని పక్షంలో పోరాటానికి సిద్ధమవుతారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం. రేవతి కల్యాణి అన్నారు. కాప్రా పరిధిలో ఎన్యుమరేటర్స్‌తో సమగ్ర కుటుంబ సర్వే చేయించుకుని మూడు నెలలు పూర్తయినా ప్రభుత్వం ఇస్తానన్న ఇన్సెంటివ్ ఎన్యుమరేటర్ల ఖాతాలో వేయలేదని పేర్కొన్నారు. గురువారం ఇన్సెంటివ్ చెల్లించాలని కాప్రా డీసీకి లెటర్ అందజేశారు. పగలు, రాత్రి అని తేడా లేకుండా సమగ్ర కుటుంబ సర్వే పూర్తి చేయించుకుని ఇన్సెంటివ్ ఇవ్వకపోడం దారుణం అన్నారు. ఇన్సెటివ్ ఎప్పుడిస్తారని ప్రశ్నిస్తే మభ్యపెట్టే మాటలు చెబుతున్నారని వాపోయారు. సర్వే చేయించిన అధికారులకు ఇన్సెంటివ్ ఇప్పించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. అధికారులు చొరవ తీసుకోని ఇన్సెంటివ్ ఇప్పించాలని లెటర్ అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఐదో సీఐఏ ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పో-2025

- ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





నవతెలంగాణ - చర్లపల్లి

5వ సీఐఏ ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌ఫో -2025 ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. గురువారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని పారిశ్రామిక వాడలోని చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ఇండస్ట్రీస్ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. స్టాల్ ఏర్పాటు చేసిన కంపెనీ వారికి అభినందనలు తెలిపారు. వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలన్నారు. రూ.150 కోట్లతో పారిశ్రామిక వాడలో రోడ్ల కోసం నిధులు మంజూరు చేయించానని, కన్వెన్షన్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం

నగరంలోని సీఐఏ కార్యాలయ ప్రాంగణంలో పారిశ్రామిక ప్రదర్శన (ఇండస్ట్రియల్ ఎక్స్‌పో) ప్రారంభమైంది. చర్ల పల్లికి చెందిన కంపెనీలు 106 స్టాళ్లు ఏర్పాటు చేశాయి. చర్లపల్లిలో తయారయ్యే ఉత్పత్తులపై వ్యాపారులకు, విద్యార్థులకు అవగాహన కల్పించ డం, పరిశ్రమల మధ్య ఐక్యత, ఒప్పందాలు పెంపొందించడం ఈ ఎక్స్‌పో ముఖ్య ఉద్దేశం. మూడురోజుల పాటు ఈ ఎక్స్‌పో జరగనుంది. నిత్యావసర పరికరాలు, గృహోపకరణాలు, సోలార్ ఉత్పత్తులు, మోటార్లు, ఇతర మిషనరీలు అన్నీ చర్లపల్లిలోనే తయారవుతాయన్నాయి. వ్యాపారులు, ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే పొందవచ్చని చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు (సీఐఏ) కె.గోవింద రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఐఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, చైర్మెన్ రోషిరెడ్డి, చంద్రశేఖర్, వెంకటరమణ, మోహన్, మూర్తి, యాదయ్య, రాము, బాలరాజు పారిశ్రామిక యజమానులు, స్టాల్స్ కు సంబంధించి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్బీసీ ప్రమాదంపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలి

- దళిత జన కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ రమేష్ డిమాండ్



నవతెలంగాణ - చర్లపల్లి

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్బీసీ) ప్రమాదానికి ప్రభుత్వమే బాధ్యత హించాలని, ప్రమాదంపై సమగ్ర న్యాయ విచారణ చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని దళిత జన కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ రమేష్ డిమాండ్ చేశారు. సొరంగం పనులు మొదలుపెట్టే ముందు మౌలిక మరమ్మతులు చేయకుండా ఎలా ముందుకెళ్లారని ప్రశ్నించారు. ఆధునిక సమాజంలో ఎంతో టెక్నాలజీ ఉన్నా సొరంగంలో ఇరుక్కున్న వారిని కాపాడటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా గురుమంచి అశోక్ చారి



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడ ఆర్టీసీ డిపో బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా గురుమంచి అశోక్ చారి ఎన్నికయ్యారు. గురువారం కుషాయిగూడ డిపో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ చారి మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను దక్కించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై పాలకులను యాచించకుండా రాజకీయాలను శాసించే విధంగా బీసీలలో చైతన్యం తీసుకురావాలన్నారు. అంతకుముందు పలువురు అశోక్ చారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చీర ఉపేందర్ కార్యదర్శి తోడేటి శ్రీనివాస్ కోశాధికారి మచ్చ బాబు గౌడ్, సహాయ కార్యదర్శులు శ్రీశైలం, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మా నిర్మాణాలను కూల్చడం సరికాదు

- భవనారుషి సొసైటీ అధ్యక్షుడు సీతాంజనేయులు



నవతెలంగాణ-కాప్రా

రెవెన్యూ అధికారులు నిర్మాణాలను కూల్చడం సరికాదని భవనారుషి సొసై టీ అధ్యక్షుడు సీతాంజనేయులు ఆంజనేయులు అన్నారు. భవనారుషి కోపరేటి వ్ హౌస్ బిల్డింగ్ సొసైటికి చెందిన స్థలంలో 158 సర్వే నెంబర్‌లో రెండు ఏకరాల 10 గుంటల స్థలం 1984వ సంవ టత్సరం నుంచి తమ ఆధీనంలో ఉన్నదని, ఆ స్థలం తమ సొసైటీకి చెందిన స్థలమని తెలిపారు. గురువా రం సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సొసైటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ ..158 సర్వే నెంబర్‌లోని రెండు ఎకరాల 10 గుంటల భూమిని, 710 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ స్థలమని ఇటీవల రెవెన్యూ అధికారులు బోర్డు పాతినట్టు తెలిపారు. దీంతో తమ



వద్ద ఉన్న పేపర్లతో తాము హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఈనెల 3వ తేదీ హైకోర్టులో ఆస్థలం భవనారుషికి చెందినదని, ఎవరూ ఎలాంటి జోక్యం చేసుకోవద్దని హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను రెవెన్యూ అధికారులకు అందజేశామని తెలిపారు. అయినా రెవెన్యూ అధికారు లు తమకు నోటీసు అందజేసి తాము ఏర్పాటు చేసుకున్న బౌండరీ రేకులను కూల్చివేసినట్టు తెలిపారు. పేదలైన పద్మశాలీల స్థలాన్ని అన్యాయంగా కూల్చి వేశారని వాపోయారు. తమకు న్యాయం జరిగేదాక పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు అతినగరం సుదేష్, రమేష్, రామకృష్ణ, నాగభూషణం, విశ్వేశ్వరరావు తదితరు లు పాల్గొన్నారు. కాగా ఈ విషయామై కాప్రా తహసీల్దార్ సుచరితను వివరణ కోరగా తాము కూల్చి వేసింది ముమ్మ టికి ప్రభుత్వ స్థలామేనని తెలిపారు. 710 సర్వేనెంబర్ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని ఆమె తెలిపారు.

మాంసాహారులకు అత్యుత్తమమైనది మధూస్ హెర్బల్ చికెన్

- ఎన్.యం.ఆర్.ఐ.డైరెక్టర్ డాక్టర్ యస్.బి.బర్బుద్దే

నవతెలంగాణ-బోడుప్పల్

యాంటీబయాటిక్స్ లేకుండా వినియోగదారులకు సురక్షితమైన, పోషకాలతో కూడిన చికెన్ అందించటానికి మధూస్ హెర్బల్ చికెన్ వారు చేస్తున్న కృషి అభినందనీయమని ఐసీఏఆర్-నేషనల్ మీట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ యస్.బి.బర్బుద్దే అన్నారు. గురువారం చెంగిచెర్లలోని ఐసీఎంఆర్ నేషనల్ మీట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన మధూస్ హెర్బల్ చికెన్ ప్రారంభంగా జరిగిన సాంకేతిక సమావేశంలో ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ ఆకలి సూచికలో 125 దేశాలలో భారతదేశం 111వ స్థానంలో ఉండటం దేశ జనాభా పోషక అవసరాలను పెంచాల్సిన అవసరాన్ని సూచిస్తుందన్నారు. మాంసంతో సహా జంతు ఆధారిత ఆహారాలు ప్రోటీన్, విటమిన్ ఖనిజ అవసరాలను తీర్చడంలో సహాయపడతాయన్నారు. మాంసం ఉత్పత్తి, ప్రోసెసింగ్, వినియోగ సాంకేతికతల ద్వారా ఆధునిక వ్యవస్థీకృత మాంసం రంగం అభివృద్ధికి సంస్థ చేస్తున్న కృషిని, వివిధ కార్యకలాపాలను వివరించారు. వ్యవసాయ వ్యాపార ఇంక్యుబేటర్ ప్రిన్సిపల్, సైంటిస్ట్ పీఐ డాక్టర్ యం.ముత్తు కుమార్ పరిశుభ్రమైన మాంసం ఉత్పత్తి యొక్క ప్రాముఖ్యత ,విలువ జోడింపు, పశువుల సరఫరా గొలుసులో వ్యవస్థాపకులు, స్టార్టప్‌లకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. ఇంక్యుబేషన్ కార్యక్రమం ద్వారా వారందరికీ మద్దతు లభిస్తుందన్నారు. విలువలతో కూడిన వ్యాపారం చేయటం తన నైజం అని ప్రజలకు



ఆరోగ్యకరమైన చికెన్ అందించటానికి అనేక ప్రయోగాల అనంతరం ఈ హెర్బల్ చికెన్ ను అందుబాటులోకి తెచ్చామని మధూస్ హెర్బల్ ఫార్మ్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ వసంత మధుసూదన్ రెడ్డి అన్నారు. ఇందుకు విశేష కృషి చేసిన పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ పౌల్ట్రీ రీసెర్చ్ స్టేషన్ హైదరాబాద్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్‌కు, అన్ని విధాలా సహకారాలు అందించిన ఐసీఎఆర్-యస్ యంఆర్ఐ డైరక్టర్ డాక్టర్ యస్.బి.బర్బుద్దేకు, సైంటిస్ట్ డాక్టర్ ముత్తు కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. మధూస్ హెర్బల్ చికెన్ పెంచే విధానం యాంటీబయాటిక్స్ లేకుండా ఫైటో బయాటిక్స్ తో కూడిన మూలికల సమాహారంతో పూర్తి శాఖాహారం ఇస్తూ ఎలా మధూస్ హెర్బల్ చికెన్ తయారు చేస్తున్నది. అలాగే ఐసీఎఆర్-యస్ యం ఆర్ ఐ నిబంధనలకు అనుగుణంగా చేస్తున్న ప్రాసెసింగ్ విధానాన్ని మధూస్ హెర్బల్ చికెన్ సీఈవో యస్.వి.రామప్రసాద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పలువురు మేధావులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

వోల్వో సరికొత్త హైడ్రాలిక్ వాహనం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
జీడిమెట్ల పారిశ్రామికవాడలో యునైటెడ్ సర్వీస్ సంస్థకు వోల్వో సంస్థ ప్రతినిధులు గురు వారం సరికొత్త హైడ్రాలిక్ వాహనాన్ని అందజేశారు. అగ్ని ప్రమాదం సంభవించిన, పెద్ద భవనాలను, ప్రమాదకర స్థాయిలో ఉన్న కన్స్ట్రక్షన్ బిల్డింగులు సురక్షితంగా కూల్చి వేసేందుకు వోల్వో సరికొత్త హైడ్రాలిక్ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చింది. అరగంటలో ఆ నిర్మాణాలు నేలమట్టం అవుతాయి. భారీ హైడ్రాలిక్ యంత్రాలు నిమిషంలో పని పూర్తి చేస్తాయి. ఇది చుట్టూ ఉన్న పరిస రాలను ప్రభావితం చేయకుండా సుమారు 4 -7 అంతస్తుల భవనాన్ని కూల్చుతుంది.



కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ లో గీత పాఠశాలలో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఓం శాంతి జెండాను ఎగుర వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో డివిజన్ పరిధిలోని గీత పాఠశాలలో ఉచితంగా ధ్యానం చేపించబడుతుందని వివేకానంద్ నగర్ ఇన్‌చార్జ్ జ్యోతి బెహెన్, బాలానగర్ ఇన్‌చార్జ్ మాధవి బెహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, చందు పాల్గొన్నారు. నవతెలంగాణ-బాలానగర్

దుండిగల్ రెవెన్యూలో వేలంపాటను తలపిస్తున్న కబ్జాలు



- దుండిగల్ మండలం పరిధిలోని సర్వేనెంబర్ 120, సర్వే నెంబర్ 214 ఖాళీ స్థలాల బిట్లు హాట్ కేకుల్లా కబ్జా దారుల చేతుల్లో
- కాపాడవలసిన రెవెన్యూ అధికార యంత్రాంగం వీఆర్‌ఏ మొదలుకొని పై స్థాయి అధికారులందరూ సూత్రధారులే
- ఒత్తిడి వస్తేనే తూతూ మంత్రపు నామ మాత్రంగా చర్యలు
- మరుసటి రోజు మరలా కబ్జాదారుడు యథావిధిగా నిర్మాణాలు
- అక్రమ నిర్మాణాలపై వివరణ అడిగినప్పుడే తప్పకుండా చర్యలు చేపడతామంటున్న అధికారులు.. చేతల్లో శూన్యం.

నవతెలంగాణ-దుండిగల్
నగర శివారు ప్రాంతాలలోని ప్రభుత్వ అనేక భూములు అన్యాక్రాంతం అవడంతో వాటిని పరిరక్షించే చర్యల్లో భాగంగా ఇప్పటికే అన్ని రెవెన్యూ కార్యాలలోని అధికారులకు ఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది. ప్రతిష్టాత్మకంగా హైడ్రాతో సమ న్వయం చేసుకొని భూములను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టు చున్నారు. ఈ నేపథ్యంలో అందుకు భిన్నంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండల రెవెన్యూ పరిధిలో అనేకచోట్ల భూకబ్జాలు ఏదేచ్ఛగా జరుగుతున్నాయి. ముఖ్యంగా డి పోచంపల్లి సర్వేనెంబర్ 120, అలాగే సర్వేనెంబర్ 214 గాగిల్లాపూర్‌లోని ప్రభుత్వ భూములు కబ్జా దారులకు హాట్ కేక్ లాగా 125 గజాల స్థలం భూములు, 200 గజాల స్థలం బిట్ల కింద పలుచోట్ల ప్రభు త్వమే వేలం పాట నిర్వహించింది. అధికారుల కనుసన్నల్లో కబ్జా దారుల చేతుల్లోకి ప్రభుత్వ స్థలాలు కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడి పరిరక్షించవలసిన రెవెన్యూ అధికారులే తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం పరిపాటిగా మారుతుంది. దీనితో కబ్జాదారులు రెచ్చిపోతూ ఎక్కడ ఖాళీ స్థలం కనబడితే అక్కడ పాగా వేశారు. తమదైన శైలిలో అధికారులను ప్రలోభాలకు గురి చేస్తుండడంతో గతంలో చర్యలు తీసుకుంటూ విధులు నిర్వ హించిన అధికారులు సైతం చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తున్నారని స్థానిక ప్రజలే తెలియజేస్తున్నారు. ఇటీవల గాగిల్లా పూర్‌లో ఏకంగా రూమ్ నిర్మాణం చేపట్టితే స్థానిక ఫిర్యాదులతో ఆర్ఐ రవి నేతృత్వంలో అక్రమ నిర్మాణమని తేల్చి చర్యలు మాత్రం తూతూ మంత్రంగా చర్యలు చేపట్టారని ఆరోపనలు ఉన్నాయి. మరుసటి రోజు కబ్జాదారుడు దర్జాగా మరల నిర్మాణం చేపట్టడంతో రెండుసార్లు కూల్చి వేతలపై ఆర్ఐ దోబూచిలాడుతూ చివరికి కబ్జాదారుడికి ఆపన్న హస్తం అందించాడు. అంతే కాకుండా ఆయన వద్ద అన్ని పత్రాలు ఉన్నాయంటూ ఆర్ఐ వత్తాసు పలకడం కొసమెరుపు. అనేక చోట్ల ఇదే తంతు కొనసాగుచుండగా, మరోచోట సర్వే నెంబర్119 స్టేడియం ఎదురుగా గల ప్రభుత్వ స్థలంలోలోని 200 గజాల ప్రభుత్వ స్థలం బిట్లు అధికారులు, కబ్జాదారుల సమన్వయంతో రూము, కాంపౌండ్ నిర్మాణంతో పూర్తి చేయడంతో దీనికి వివరణ తెలిపిన ఎమ్మార్వో.. వారు పేదవారని ఇంటి చుట్టు చెత్తాచెదారంతో ఉండడంతో కాంపౌండ్ నిర్మించుకుంటామంటే సరేలే అని ఊరుకున్నట్టు తెలపడం స్థానికులను నివ్వరపరిచింది. ఇలా ప్రభుత్వ భూమిని అనేక చోట్ల రెవెన్యూ యంత్రాంగం ధారాదత్తం చేస్తున్నదని విమర్శలు ఉన్నాయి.

ఇటీవల దుండిగల్ మండలం రెవెన్యూకు విచ్చేసిన ఆర్డిఓ శ్యాం ప్రసాద్ దృష్టికి అనేక కబ్జాల విషయం వెలుగులోకి రావడంతో తహసిల్దార్, ఆర్ఐని మందలించారు. ముఖ్యంగా గాగిలాపూర్‌లో కబ్జాదారులకి సహకరిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఎమ్మార్వో సమక్షంలో ఆదేశించినప్పటికీ ఎమ్మార్వో, ఆర్ఐలు మాత్రం కబ్జాలపై చర్యలు మాత్రం శూన్యం. ఇప్పటికైనా పైఅధికారులు దుండిగల్ మండల రెవెన్యూ పరిధిలో పలుచోట్ల జరిగే అక్రమ కబ్జాలను నియంత్రించి స్థానిక ప్రజల ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



దుండిగల్ మండల పరిధిలో పలుచోట్ల అక్రమ నిర్మాణాలు, అక్రమ కబ్జాలు జరుగుతున్నయని ఎప్పటి కప్పుడు పర్యవేక్షించి చర్యలు చేపట్టడం జరుగుతుంది. గాగిల్లాపూర్ విషయం లో తన దృష్టికి వచ్చాయని చర్యలు ఎందుకు తీసుకోలేదో తెలుసుకుంటా నని తెలిపారు.

-దుండిగల్ తహసిల్దార్ అబ్దుల్ మతిన్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి
క్యాంపు కార్యాలయంలో, గురువారం నాడు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు చేతుల మీదుగా, ఫతేనగర్‌కు చెందిన పి.కవిత (పి.మోహన్) ముఖ్యమం త్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. తనకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు అయిన, రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా చలి వేంద్రం ప్రారంభం
వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అని ట్రస్ట్ నిర్వాహకులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు అభినం దించారు. గురువారం ఆర్యవైశ్య సంఘం మూసాపేట్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. సంయుక్తంగా, మూసాపేట జనతా నగర్‌లో చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయనతో పాటు మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, బాలాజీ నగర్ కార్పొరేటర్ పగడాల శిరీష బాబు రావు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, శేఖర్ గుప్తా, నేతి రాములు గుప్తా, శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.



సత్ జ్ఞాన్ హై స్కూల్‌లో మోటివేషన్ ప్రోగ్రాం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
సత్ జ్ఞాన్ హై స్కూల్ వెంకటేశ్వర నగర్‌లో గురువా రం విద్యార్థులు, తల్లిదండ్రులు టీచర్స్‌కు మోటివేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తగా వేణు కళ్యాణ్ పాల్గొన్నారు. ఆయన విద్యార్థులకు, తల్లిదండ్రుల కు అనేక సూచనలు, సలహాలు మార్గదర్శకత్వం యొక్క ప్రాముఖ్యత తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ... నేడు సమాజంలో సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎక్కువగా ఉందని పిల్లలందరూ జాగ్రత్తగా ఉం డాలి ఆయన సూచించారు. పిల్లలు పాఠశాలకు రెగ్యుల ర్‌గా వచ్చి చదువుకోవాలని, అమ్మ నాన్న మనసు నొప్పిం చకూడదని ఆయన చెప్పారు. 10వ తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని కోరారు. వారికి పరీక్షపై తగు సూచనలు సలహాలు ఇచ్చారు. తల్లిదండ్రు లు కూడా పిల్లల మనసెరిగి నడుచుకోవాలని చెప్పారు. పిల్లలు ఇంటర్నెట్ సోషల్ మీడియా ప్రభావం ఈ రోజుల్లో అధికంగా ఉంది. కాబట్టి పేరెంట్స్ వారు ఉప యోగిస్తున్న ఫోన్ నిత్యం గమనించాలని సూచించారు. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు కూడా పిల్లల అభివృద్ధిలో కీలకపాత్ర ఉంటుందని చెప్పారు. ఈ సంద ర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం మాట్లాడుతూ..స్వయంకృషితో పైకి వచ్చినవారి అనుభ వాలు విని ఆచరిస్తే ప్రతిఒక్కరు ప్రయోజకులవుతారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు చింతల మహేష్, అకాడమీక్ డైరె క్టర్ చింతల మానస్, ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెం ట్స్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి హాస్పిటల్‌లో రోబోటిక్ సర్జరీ సేవలు ప్రారంభం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారంలోని మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలో రోబో టిక్ సేవలను ప్రారంభించారు. ఎస్ఎస్ఐ మంత్ర 3.0 పేరిట ఏర్పాటు చేసిన రోబోటిక్ సర్జరీ సేవలను మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సతీమణి, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ కల్పనా రెడ్డి, మల్లా రెడ్డి వైద్యశాలల చైర్మెన్ డా.సిహెచ్ భద్రారెడ్డి, వైస్ చైర్మెన్ డాక్టర్. సిహెచ్ ప్రీతి రెడ్డిలో గురువారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా డా.భద్రారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోనే తొలి శస్త్ర చికిత్స రోబోటిక్ వ్యవస్థ ను తమ వైద్యశాలలో ప్రవేశపెట్టడం గర్వకారణంగా ఉందన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా కచ్చితత్వంతో తక్కు వ సమయంలో శస్త్ర చికిత్సను పూర్తి చేయడంతో పాటు రోగి వేగంగా కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను ఇక్కడి ప్రజలకు అందిం చాలన్న సంకల్పంతోనే ముందుకు సాగుతున్నామని అన్నారు. అందులో భాగంగానే రోబోటిక్ సర్జరీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు.

డా. ప్రీతి రెడ్డి మాట్లాడుతూ.. రోబోటిక్స్ ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులకు నాందిపలుకుతుంద ని తెలిపారు. అత్యంత అధునాతనమైన రోబోటిక్ వ్యవస్థ ఎస్ఎస్ఐ మంత్ర 3.0 సేవలను మొట్టమొదటిసారిగా మల్లారెడ్డి నారాయణ వైద్యశాలలో ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. దీని ద్వారా వైద్య రంగం లోని సాంకేతికత వినియోగంలో తమ వైద్యశాల ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు.సంక్లిష్టమైన గుండె, కిడ్నీలకు సంబంధించిన శస్త్ర చికిత్సలోఈ అధునాతన రోబోటిక్ సర్జరీ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రోగి సైతం త్వరగా కోలుకుంటారని స్పష్టం చేశారు. ఇప్ప టికే ఆర్థోపెడిక్ సర్జరీలలో తాము ఈ విధానాన్ని వినియో గిస్తున్నామని ఆమె తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన సర్జరీ సేవలు నార్త్ హైదరాబాద్‌లోనే కేవలం తమ వైద్య శాలలో అందుబాటులో ఉండటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తద్వారా రోగులకు కచ్చితత్వంతో కూడిన మెరుగైన సేవలను అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఐఎన్‌టీయూసీ అధ్యక్షులుగా కర్క నాగరాజు



నవతెలంగాణ-బాలానగర్
మూసాపేట్ ప్రాంతానికి చెందిన హిందుస్తాన్ ఏరో నాటికల్ లిమిటెడ్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న కర్క నాగరాజును కూకట్‌పల్లి నియోజకవర్గం ఐఎన్‌టీ యూసీ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ నేపథ్యం లో నియామక పత్రాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, కర్క నాగరాజుకు గురు వారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ నియోజకవర్గంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. దివంగత మాజీ కార్మిక శాఖ మంత్రి ప్రియ శిష్యుడు పీజేఆర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తున్నమని వారు పేర్కొన్నారు. అనంతరం కర్క నాగరాజు మాట్లాడుతూ నాపై నమ్మకం తో ఐ.యన్.టి.యు.సీ కూకట్‌పల్లి నియోజకవర్గం అధ్యక్షులుగా నియమించిన బండి రమేష్‌కు, జాతీయ ఐ.యన్.టి.యు.సీ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవరెడ్డికి, జాతీయ కార్యదర్శి ఆర్. ప్రకాష్ గౌడ్, మేడ్చల్ జిల్లా ఐ.యన్.టి.యు.సీ అధ్యక్షులు కూన భరత్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికై తన వంతు కృషి చేస్తానని కర్క నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్క పెంటయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ పుష్పారెడ్డి, వైస్ చైర్మెన్ ప్రకాష్, ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అనిల్, అరుణ్ కుమార్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

కేపీహెచ్‌బీ సీఐ రాజశేఖర్ రెడ్డికి కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఫోటోలు మార్ఫింగ్ చేసి వివిధ సోషల్ మాధ్యమాలు ద్వారా సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న బీఆర్ఎస్ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి కెపిహెచ్‌బీ సీఐ రాజశేఖర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అనుచరుడు చాంద్ పాషా అనే వ్యక్తి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాధు ప్రతాపరెడ్డి, బి.సంజీవ్ రావు, తూము వినయ్ కుమార్, ఓబీసీ సెల్ చైర్మెన్ మేకల మైకల, దేవ సాయం రవి, కొమ్ము బాబురావు, రాజు ముదిరాజ్,బచ్చుమల్లి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని స్థానిక కార్పొ రేటర్ కొలుకుల జగన్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని శివనగర్ లో పలు సమస్యలపై పాదయాత్ర నిర్వహించిన అనంతరం గ్రేటర్ నిధుల తో వేసే సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాజకీయాలకతీ తంగా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివా నగర్ అధ్యక్షులు నాగరాజు, డాక్టర్.విట్టల్, ఆజం, భాస్కర్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, అజర్, ధర్మారావు, రాజు, ఖయ్యూం,సంపత్ రెడ్డి,వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సేవలను గుర్తించి నామినేటెడ్ పదవి ఇవ్వాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి
విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్‌కి చేసిన సేవలను గుర్తించి, నామి నేటెడ్ పదవి ఇవ్వాలని యువజన కాంగ్రెస్ నాయకులు జవహర్ బాల్ మంచ్ స్టేట్ కోఆర్డినేటర్ జిట్ట సునీల్ యాదవ్ కోరారు. పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను, గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో కలిశారు. 20 సంవత్సరాలుగా ఎన్ఎస్‌యూఐ లో, విద్యార్థి దశ నుంచి, యువజన నాయకుడిగా కాంగ్రెస్‌లో పార్టీకి విధే యుడుగా ఉంటూ.. పార్టీ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగింది. కావున తనకు రాబోయే రోజుల్లో నామినేటెడ్ పదవి ఇవ్వాల్సిం దిగా కోరారు. నాయకులకు తన రాజకీయ బయోడేటాను జిట్ట సునీల్ కుమార్ యాదవ్ అందించారు.

కారు బీభత్సం పలువురికి గాయాలు



నవతెలంగాణ-నిజాంపేట్
మియాపూర్ గండి మైసమ్మ ప్రధాన రహదారిలో బీటెక్ విద్యార్థి కారుని వేగంగా నడుపుతూ రోడ్డు ప్రక్కన ఉన్న చెరుకు బండిని ఢీకొట్టాడు. గురువారం ఉదయం సుమారు 9 గంటల ప్రాంతంలో స్థానిక విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గురువారం ఉదయం విద్యార్థి వెర్నా కారును అతివేగంతో చెరుకు బండి నడిపించుకునే స్టాల్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో చెరుకు బండి వ్యాపారికి తీవ్ర గాయాల య్యాయి. ఈ విషయమై బాచుపల్లి పోలీసులు వివరాలు తీసుకున్నట్టు సమాచారం. అయితే విద్యార్థిని నడిపిన వాహనంపై మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి వాహన స్టిక్కర్ కలిగి ఉండటం ఆ విద్యార్థి సీఎంఆర్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్టు సమాచారం. ఈ ఘటనపై చెరుకు బండి వ్యాపారి బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆస్తి పన్ను చెల్లించకపోతే సీజ్ చేస్తాం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
సకాలంలో ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకపోతే సీజ్ చేస్తామని డిప్యూటీ కమిషనర్ అన్నారు. బాలానగర్ ఏరియాలోని ట్రినిటీ మెటల్ ఇండస్ట్రీస్ రూ.1,15,08, 150 లు ఆస్తి పన్ను చెల్లించనందుకు గురువారం ఏఎంసీ మురళీ, ఇన్‌చార్జి ఎంఎసీ టికె.ప్రభాకర్, టాక్స్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజీముద్దీన్‌లు పాల్గొని ఆ ప్రాపర్టీని సీజ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి అభివృద్ధికి పాటుపడాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
ప్రతి ఒక్కరు తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకులు గాదె శివ చౌదరి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ ఆదేశాల అనుసారం ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని గురువారం కాలనీలలో సమస్యల పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని వసంత్ నగర్, గోపాల్ నగర్, ధర్మ రెడ్డి కాలనీ, శ్రీల పార్క్ ప్రైడ్ కమ్యూనిటీ, ఐడీపీఎల్ కాలనీలో ఆయన పర్యటించారు. డ్రయినేజీ సమస్యల పరిష్కారం, రోడ్ల పరిశుభ్రత, చెత్త కుప్పల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, స్థానిక నాయకులు తదితరులున్నారు.

కార్యకర్తను పరామర్శించిన తీగుల్ల కిషోర్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

తీవ్ర అస్వస్థతకు గురైన మెట్టుగూడ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు వాసింను బీఆర్‌ఎస్ యువనేత తీగుల్ల కిషోర్ కుమార్ గౌడ్ మెట్టుగూడ డివిజన్ కార్పొరేటర్ రాసూరి సునీత, ఇతర నాయకులతో కలిసి పరామర్శించారు. శాసనసభ్యులు పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు వాసింను కలిసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ గౌడ్ తన వంతుగా ఆర్థిక సహకారాన్ని అందించారు.

మెస్ బిల్స్ మాఫీకి వికలాంగుల ధర్నా



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ విద్యాను అభ్యసిస్తున్న వికలాంగు విద్యార్థులు గురువారం పరిపాలన భవన్‌లోని వీసీ ఛాంబర్‌లో ధర్నా నిర్వహించారు. విద్యార్థుల నుంచి అక్రమంగా మెస్ బిల్లు వసూలు చేయడానికి వ్యతిరేకంగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తామన్నారు. ఈ విషయమై ఓయూ వీసీని పలుమార్లు కలిసి తమ సమస్యను విన్నవించిన పట్టించుకోవటం లేదని ఇక గత్యంతరం లేక ధర్నా చేపట్టినట్టు చెప్పారు. ఈ ధర్నాలో వికలాంగుల నాయకులు బాణాల వెంకటయ్య, పల్స ఆంజనేయులు, బయ్యా నాగరాజు, కుర్మయ్య బానోతు నరేష్, పాండురంగ, చింపిరిజెట్టి రాజు, బండి శ్రీను, వెంకన్న విద్యార్థులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసనసభ్యులు హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ ఆదేశాల మేరకు యూసఫ్ గూడా కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్ తన కార్యాలయంలో సమైక్య డ్వాక్రా గ్రూపుల మహిళలతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకొని, కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమం జీహెచ్‌ఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట్ కిషన్ రావు, యూసీడీ కమ్యూనిటీ ఆఫీసర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఐలపాక నర్సింగ్ దాస్, డివిజన్ స్థాయి మహిళా గ్రూప్ సభ్యురాళ్ళు అమ్మాజీ, నిర్మల, నాగమణి, శ్రీదేవి, ధనరేఖ, రేష్మ, దేవి, సరోజ, అనురాధ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటితో బైక్ కడుగుతున్న వ్యక్తికి జరిమానా



నవతెలంగాణ-బంజారాహిల్స్

జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించారు. ఘటన గురువారం జూబ్లీహిల్స్‌లో చోటు చేసుకుంది. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ ప్రధాన రహదారిపై వెళుతుండగా.. రోడ్ నం. 78లో నీరు లీకేజీ అయినట్టు ఎండీ గమనించి.. స్థానిక జీఎంను లీకేజీకి కారణాలు ఆరా తియ్యమని ఆదేశించారు.. దీంతో డివిజన్ జీఎం హరిశంకర్ స్థానిక మేనేజర్‌తో వెళ్లి పరిశీలించారు. అయితే దగ్గరికి వెళ్లి చూస్తే ఒక వ్యక్తి జలమండలి సరఫరా చేసే నీటితో బైక్ కడుగుతున్నాడు. ఇదే విషయం ఎండీకి విన్నవించారు.. దీంతో ఎండీ ఆగ్రహం వ్యక్తం చేసి.. తాగునీటిని ఇలా ఇతర అవసరాలకు వినియోగించవద్దని చెప్పారు. అతనికి నోటీసు అందించి, జరిమానా వెయ్యాలని సంబంధిత జనరల్ మేనేజర్‌ను ఆదేశించారు. ఎండీ ఆదేశాల మేరకు ఆ వ్యక్తికి రూ.1000 జరిమానా విధించారు. జలమండలి సరఫరా చేసే తాగునీరు ఇలా ఇతర అవసరాలకు వినియోగించద్దని ఎండీ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే.. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జలమండలి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి జలమండలి సుదూరు ప్రాంతాల నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తుంది. కాబట్టి.. నీటిని వృథా చేయకుండా వాటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని కోరుతోంది. ఇప్పటికే నగరంలో భూగర్భ జలాలు అడుగంటిపోగా కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. రానున్న రెండు నెలలు నీటికి ఇబ్బంది అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు తాగునీటికై సరఫరా చేసే శుద్ధమైన నీటిని వృథా చేయకూడని విజ్ఞప్తి చేస్తోంది. జలమండలి జీహెచ్‌ఎంసీ, ఓఆర్‌ఆర్ పరిధిలో 13.7 లక్షల నీటి కనెక్షన్లు ఉండగా ప్రతి రోజూ 550 ఎంజీడీల నీటిని ప్రజలకు సరఫరా చేస్తోంది. వెయ్యి లీటర్ల (ఒక కిలోలీటరు) నీటి సరఫరాకు రూ.48 వ్యయం ఖర్చు చేస్తోంది. కేవలం తాగునీటి కోసం ఉద్దేశించిన రక్షిత నీటిని వాహనాలను శుభ్రం చేయడానికి, గార్డెనింగ్, ఇండ్ల పరిసరాలను కడగడానికి వృథా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

తల్లి, కూతురు అదృశ్యం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఐదేండ్ల కూతురుతో తల్లి అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బోరబండ సబ్ ఇన్‌స్పెక్టర్ స్వప్న రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. ఎర్రగడ్డ, శంకర్ లాల్ నగర్ హనుమాన్ టెంపుల్ వద్ద రామ్ లగాన్ యాదవ్ తన భార్య రితా యాదవ్, కుమార్తె చాచితో కలిసి నివాసం ఉంటూ పానీపూరి బండి వ్యాపారం నడిపిస్తున్నాడు. ఫిబ్రవరి 24న అతను వ్యాపారం నిమిత్తం పానీపూరి బండి వద్దకు వచ్చానని, అదే రోజు తన భార్య కూతురిని తీసుకుని వెళ్లిపోయిందని, అనేకచోట్ల బంధువుల వద్ద, స్నేహితుల వద్ద విచారించిన ఆచూకీ లభించలేదని, తన ఫోను స్విచ్ ఆఫ్ అయిపోయిందని, తన భార్య, కుమార్తె ఆచూకీ తెలుసుకొని తనకు న్యాయం చేయాలని బోరబండ పోలీస్‌స్టేషన్‌లో రామ్ లగాన్ ఫిర్యాదు చేశాడని అన్నారు. కేసు నమోదు చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు స్వప్నారెడ్డి మీడియాకు తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా అన్ని పరిసరాలలో నిగా పెట్టామని, త్వరలో తల్లి, కూతురి ఆచూకీ తెలుసుకుంటామని పేర్కొన్నారు.

బీఎన్ఐ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



నవతెలంగాణ-బంజారాహిల్స్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బీఎన్ఐ క్యాపిటల్ ఛాప్టర్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ చాప్టర్‌లో 120 మంది సభ్యులు ఉన్నారు. ఇది హైదరాబాద్ ప్రాంతంలో అతిపెద్ద ఛాప్టర్‌లలో ఒకటిగా ఉంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అర్గలా హెల్త్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ డా. శ్రీదేవి యాడవల్లి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అందుకోసం బీఎన్ఐ సహకారం కూడా ఉండటం శుభప్రదమని అన్నారు. ఈ 90 నిమిషాల సమావేశంలో సభ్యులు వ్యాపార మార్పిడిని జరిపిన విధానం నెట్‌వర్కింగ్ శక్తిని ప్రదర్శించిందన్నారు. బీఎన్ఐ రూపొందించిన ఈ మోడల్ వ్యాపార మార్పిడికి అత్యంత విశ్వసనీయమైన మార్గంగా నిలుస్తుందని చెప్పారు. సమయాన్ని కచ్చితంగా అమలు చేసే విధానం అందరికి ఆదర్శప్రాయం అన్నారు. ఈ సందర్భంగా మహిళా సభ్యులను ఘనంగా సత్కరించారు. బీఎన్ఐ కాపిటల్ ఛాప్టర్ ఈ ప్రాంతంలో అత్యధిక మహిళా వ్యాపారవేత్తలను కలిగి ఉంది. ఈ చాప్టర్‌లో 23 మంది సభ్యులు ఉన్నారు. ప్రత్యేక అతిథులుగా మిసెస్ ఏషియా పసిఫిక్ యూనివర్స్ 2016 అభిమనిక యాదవ్, ఇన్వెస్ట్మెంట్స్ అండ్ స్కేలింగ్, ఆంథిల్ వెంచర్స్ అనుపమ్ పాండే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ కాపిటల్ అధ్యక్షుడు పంకజ్ సురానా, ఉపాధ్యక్షుడు అనుదీప్ తోమ్మంద్రు, కార్యదర్శి, కోశాధికారి సిరిష అడేపు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి ఆటంకాలు తొలగిస్తాం..

- పరిసరాలను ఆహ్లాదంగా మార్చుతాం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

చెరువుల అభివృద్ధిలో ఎక్కడా ఆటంకాలు లేకుండా చూస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. నగరంలో చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు. కార్పొరేట్ సంస్థలు సీఎస్‌ఆర్ నిధులను అందించి చెరువుల అభివద్ధికి తోడ్పడాలన్నారు. అలాగే పరిసర ప్రాంతాల నివాసితుల్లో ఉన్నత వర్గాల వారు కూడా చేయూతనందించాలన్నారు. నానక్‌రామ్ గూడలోని ఖాజాగూడ పెద్ద చెరువుతో పాటు, నెక్నాంపూర్‌లోని ఇబ్రహీంబాగ్ చెరువును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖాజాగూడ చెరువు అభివృద్ధిలో తలెత్తిన ఇబ్బందులను ఈ సందర్భంగా అక్కడ పనులు చేపట్టిన ఎస్.ఎస్.ఎల్ ఇన్‌ఫ్రా, దివ్యశ్రీ ఇన్‌ఫ్రా ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అక్కడికక్కడే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి చెరువులోకి మురుగు నీరు చేరకుండా కాలువ డైవర్షన్ పనులు చేపట్టాలని సూచించారు. పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకునేలా ఈ చెరువు పరిసరాలను అభివద్ధి చేయాలని, ఇందుకు పర్యటకాభివృద్ధి సంస్థ కూడా భాగస్వామ్యం కావాలన్నారు. నెక్నాంపూర్లోని ఇబ్రహీంబాగ్ చెరువు ఆక్రమణలను ఇటీవలే తొలగించామని, ఇప్పటికే ఈ చెరువును కొన్ని సంస్థలు దత్తత తీసుకున్నాయని, ఈ పనులు వేగంగా జరగాలని కమిషనర్ సూచించారు. దుర్గం చెరువు, ఖాజాగూడ చెరువు, మల్కం చెరువు, ఫిలింనగర్ చెరువుల నుంచి వరద నీరు ఇబ్రహీంబాగ్ చెరువుకు చేరేదని స్థానికులు, అధికారులు తెలిపారు. నివాసప్రాంతాలు పెరిగిపోవడంతో యీ చెరువులు, నాళాలు మురుగుతో నిండిపోయాయని స్థానికులు కమిషనర్‌కు చెప్పారు. ఈ ప్రాంతాల నుంచి వచ్చిన మురుగు నీటిని డైవర్ట్ చేసి ఇబ్రహీంబాగ్ చెరువును కాపాడలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. దాదాపు 88 ఎకరాలకు పైగా ఉన్న చెరువు అభివృద్ధితోపాటు ఇబ్రహీంబాగ్ చెరువులోకి మురుగు చేరకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులకు కమిషనర్ సూచించారు.

కుటుంబాన్ని నడిపేది మహిళ ..



- మాజీ ఐఏఎస్ చిరంజీవులు

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రపంచాన్ని నడిపించేది డబ్బు కుటుంబాన్ని నడిపేది మహిళా అని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భన్నీ పురస్కరించకుని మాజీ ఐఏఎస్ చిరంజీవులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. గురువారం సోమాజిగూడలోని హోటల్ మెర్క్యురీలో ఫైనాన్షియల్ ఇంక్లూషన్‌కు వ్యాపార కరస్పాండెంట్‌ల సహకారాన్ని వేడుకగా ఆచరించుకుంటున్న ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరైయ్యారు. ఫైనాన్షియల్ ఇంక్లూషన్‌ను ప్రోత్సహించడంలో వారి కీలక పాత్రను గుర్తించి, తెలంగాణ రాష్ట్రనికి చెందిన అత్యుత్తమ మహిళా వ్యాపార కరస్పాండెంట్‌లను బ్యాంక్ సత్కరించి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతదేశం వ్యాప్తంగా 5 లక్షల్లో సుమారు లక్షకు పైగా కన్నా మహిళా వ్యాపార కరస్పాండెంట్‌లతో కలిసి బ్యాంక్ పనిచేస్తున్నట్టు ప్రకటించడం అభినందనియం అన్నారు. మహిళల పట్ల తమకున్న చిత్తశుద్ధికి నిదర్శనం తాను వరంగల్ కరీంనగర్ జిల్లాలో కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో మహిళా సంఘాలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్రీనిధి కో ఆపరేటివ్ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ కూడా మహిళలు స్వయం శక్తితో ఎదిగేందుకు కృషి చేశాయని తెలిపారు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సీఈఓ పినాక్ చక్రవర్తి మాట్లాడుతూ.. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ వర్క్‌ఫోర్స్‌లో మహిళలను సాధికారపరచడం ఫైనాన్షియల్ ఇంక్లూషన్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు, స్థిరమైన ఆర్థిక వృద్ధిని కొనసాగిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

మహిళల నేతృత్వంలోని బ్యాంకింగ్ కరస్పాండెంట్ల విస్తరిస్తున్న నెట్‌వర్క్ ద్వారా, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఆర్థిక అంతరాన్ని తగ్గించేందుకు, ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు, భారతదేశం వ్యాప్తంగా మహిళలకు సాధికారత కల్పించేందుకు కట్టుబడి ఉందనీ వివరించారు.

సీఐటీయూ ప్యానెల్ 'స్టార్' గుర్తుకు ఓటేయ్యాండి

- డంపింగ్ యార్డ్ కార్మికుల యూనియన్ ఎన్నికలు
- సీఐటీయూ నాయకుల ప్రచారం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సీఐటీయూ యూసఫ్ గూడా సర్కిల్, కృష్ణ కాంత్ పార్క్ వద్ద అనిల్, అస్లాం, సుధాకర్, నరసయ్య అధ్యక్షతన ఎన్నికల ప్రచారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ పాపారావు, రాపర్తి అశోక్ పాల్గొని మాట్లాడుతూ.. యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో స్టార్ గుర్తుకు ఓటేసి సీఐటీయూ ప్యానల్స్‌ను గెలిపించాలని తెలిపారు. కార్మికులందరూ ఐక్యంగా కలిసి ఎన్నికల్లో తమ యూనియన్‌ను గెలిపించుకుంటే కార్మిక హక్కుల కోసం పనిచేసే సీఐటీయూ ఆధ్వర్యంలో బలమైన పోరాటాలు చేయవచ్చని తెలపడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు 8 గంటల పని దినాన్ని తీసివేసి, 12 గంటల పని దినం పెట్టాలని చూస్తున్నటువంటి బీజేపీ అనుబంధ సంఘం, యజమానుల కోసం పనిచేసే బీఎంఎస్‌ను ఓడించాలని కోరారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తా మని చెప్పిన బీజేపీ ఉన్న ఉద్యోగాలను తొలగిస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రయివేటు పరం చేసి కార్మికులకు హక్కులు లేకుండా చేస్తున్నటువంటి బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి, కార్మికుల కోసం, కనీస వేతనం 26 వేలు పెంపు కోసం అందరు ఐక్యంగా పనిచేయాలన్నారు. డంపింగ్ యార్డ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి, 12వ తేదీ జరిగే గుర్తింపు ఎన్నికల్లో స్టార్ గుర్తుకు అందరూ ఓటేసి మన ప్యానల్‌ని గెలిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మ కావాలనే ఆడపడుచుల ఆశయం కోసం ఉచిత ఫెర్టిలిటీ పరీక్షలు



- డాక్టర్ దుర్గ జీ రావు

నవతెలంగాణ-బంజారాహిల్స్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నెలరోజుల పాటు ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఒయాసిస్ ఫెర్టిలిటీ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ దుర్గాజీ రావు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జీవన విధానంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా రోజురోజుకు సంతానం లేమితో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, గతంలో కేవలం మహిళల్లోనే సంతానలేమి సమస్యలు కనిపించేవని ప్రస్తుతం పురుషుల్లో కూడా కనిపిస్తున్నాయని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఉన్న తమ ఆస్పత్రులలో మహిళలకు ఉచిత ఫెర్టిలిటీ పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు సూచనలు అందిస్తామని చెప్పారు. సంతానలేని సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఈ కార్యక్ర మంలో మార్కెటింగ్ హెడ్ సౌమ్య దీప్ పాల్గొన్నారు.

ఇఫ్లూ వీసీగా ప్రొ. నాగలపల్లి. నాగరాజు



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్‌లో ది ఇంగ్లీషు అండ్ ఫారేన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) నూతన్ వీసీగా ప్రొఫెసర్ నాగలపల్లి. నాగరాజు నియమితులైయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్రావిద్యా శాఖ మంత్రి, రాష్ట్రపతి అమోదం అనంతరం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొ. నాగరాజు ప్రస్తుతం ఒరిస్సా రాష్ట్రంలో గంగాధర్ మెహర్ యూనివర్సిటీ వీసీగా పనిచేస్తున్నారు. అయిన మొదట అరుణాచల్‌ప్రదేశ్ రాజీవ్ గాంధీ సెంట్రల్ యూనివర్సిటీలో పనిచేస్తు, అనంతరం కర్ణాటకలోని గుల్బర్గా సెంట్రల్ యూనివర్సిటీలో ఆంగ్ల భాష ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆయనది దక్షిణ ఒరిస్సా ప్రాంతంలో గల గజపతి జిల్లాకు చెందిన ఛత్రపూర్ అనే గ్రామం. ఆయనకు 37 ఏండ్లు బోధన, పరిశోధన అనుభవం ఉంది. పలు పుస్తకాలు, రీసెర్చ్ ఆర్టికల్స్ పబ్లిష్ చేసి, అమెరికా, బ్రిటన్, లాంటి దేశాల్లో పలు అంతర్జాతీయ సెమినార్స్‌లాలో ప్రసంగించారు. ఇఫ్లూలో వీసీగా అయిన ఐదేండ్లు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. 2024 జనవరి 24 నుంచి ఇఫ్లూ ఇన్‌ఛార్జి వీసీ పాలనలో ఉన్న విషయం తెల్సిందే. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



యూరో కిడ్స్ స్కూల్‌లో ఘనంగా అన్యువల్ స్పోర్ట్ డే వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో విద్యార్థులు ఆటపాటలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అబిగైల్, ఆశ్రిత, రియాన్స్, దర్రిక్, కబీర్, ఆశ్విక్, మేదస్వి, రినా, నిపున్, కృతన్ష్, రుద్రాన్ష్, ప్రనిల్‌లకు ప్రిన్సిపాల్ లీనా వర్ఘీనియా, డైరెక్టర్ మోసెస్ ప్రవీణ్ కుమార్, సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది దివ్య ,సుందరి, సుజాత, రమణ, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-ముషీరాబాద్

జహ్నావి కాలేజిలో మహిళా దినోత్సవ వేడుకలు

- విద్యార్థులను భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా తన వంతు కృషి
- వైస్ చైర్మెన్ ఏ.లక్ష్మి



నవతెలంగాణ-బేగంపేట్

జాహ్నవి విద్యా సంస్థలు అంతర్జాతీయ మహిళా దినోత్సం పురస్కరించుకున్నారు. ఈ వేడుకలు గురువారం నారాయణగూడ కళాశాలలో జరిపారు. ఈ సందర్భంగా జాహ్నవి డిగ్రీ పీజీ కాలేజీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ వైస్ చెర్మెన్ ఏ లక్ష్మి మాట్లాడుతూ.. జంట నగరాల్లో అత్యుత్తమ బోధనను అందిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యతుకు జాహ్నవి విద్యా సంస్థలు బాసటగా నిలుస్తున్నాయన్నారు. విద్యార్థులు జీవితంలో ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకోవాల్సింది కళాశాల దశలోనే అని, జాహ్నవి విద్యాసంస్థలో ఉన్న ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సులలో చేరిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆమె తెలిపారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు, విలువలతో కూడిన విద్యను అందిస్తూ ప్రతి ఏడాది మంచి ఫలితాలు సాధిస్తోంది. నారాయణగూడలో 1997లో ప్రారంభమైన జాహ్నవి విద్యాసంస్థ 26 ఏండ్ల సుదీర్ఘ కాలంలో విద్యార్థులకు వారి లక్ష్యాలపై మార్గ నిర్దేశం చేస్తూ అంతర్ ప్రతిభా కనబరచి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో జాహ్నవి కాలేజీ ఎప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. పాటవాలను వెలికి తీస్తూ ఎంతో మందిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో అపారమైన నేర్పు, ఓర్పు, కల్గిన అధ్యాపకులు విద్యను భోదిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న మేధోశక్తిని వెలికితీసి సృజనకు పదును పెట్టేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

జాహ్నవి కళాశాల బ్రాంచ్‌లు..

జాహ్నవి విద్యాసంస్థల బ్రాంచ్‌లు హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్ జిల్లాలోని నారాయణగూడ, బోడుప్పల్, సికింద్రాబాద్, విద్యానగర్‌లో ఉన్నాయి.

జాహ్నవి విద్యాభ్యాసం చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు

జాహ్నవి కళాశాలలో విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆర్క్ ట్రెనింగ్ అండ్ సోల్యూషన్ వారి సౌజన్యంతో విప్రో, టీసీఎస్, కాగ్నిజంటల్, కార్వీ, ఇన్ఫోసిస్, గూగుల్ ఫ్లెక్స్, టెక్ మహేంద్ర, జెన్పాక్ట్ తదితర కంపెనీల ప్రతినిధులను కళాశాలకు ఆహ్వానించి వందశాతం ఉపాధి అవకాశాల కల్పన కోసం జాహ్నవి విద్యాసంస్థల యాజమాన్యం ఎంతో కృషి చేస్తుంది.

విద్యలోవిద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ మెరుగైన ఫలితాలు

విద్య వ్యవస్థలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఆయా అంశాలపై వివరిస్తూ వారి మేథస్సుకు మరింత పదును పెట్టి అన్ని రంగాల్లో ప్రతిభచాటేందుకు పూర్తి స్థాయిల్లో అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి అవసరమైన విద్యా మెలుకువలు నేర్పిస్తూ విద్యపై మక్కువ పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ మానసిక ఒత్తిడిలేని విద్యతో పాటు ఉన్నత విద్యావంతులుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని జాహ్నవి విద్యాసంస్థల చైర్మెన్ ఎ. పరమేశ్వర్, వైస్ చైర్మెన్ ఎ. లక్ష్మి తెలిపారు. అనంతరం చైర్మెన్ ఏ పరమేశ్వర్, వైస్ చైర్మెన్‌కు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి



- ఎస్సార్ నగర్ పోలీసులను ఆదేశించిన తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్/ అమీర్‌పేట్

చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన పుల్లయ్య అతని కొడుకు రామాంజనేయులును వెంటనే అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని, మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎస్సార్‌నగర్ పోలీసు అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్‌లోని బీకేగూడలో నివసించే పుల్లయ్య గత కొన్ని ఏండ్లుగా చిట్టీలను నడుపుతూ.. ఇటీవల పరారీ అయ్యాడు. దీంతో పుల్లయ్య వద్ద చిట్టీలు కట్టిన సనత్‌నగర్, దాసారం బస్తీలకు చెందిన బాధితులు, వెస్ట్ మారేడ్ పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి తాము నిత్యం వివిధ రకాల పనులు చేసుకుంటూ చిట్టీలు కట్టామని, పుల్లయ్య నమ్మించి మోసం చేశాడని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఎస్సార్ నగర్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులు అంతా పేద, మధ్య తరగతి కుటుంబాలేనని వివరించారు. వీలైనంత త్వరగా పుల్లయ్యను పట్టుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యేనుకలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు కర్నాకర్ రెడ్డి, రాజేష్ ముదిరాజ్, పీయూష్ గుప్తా, ఆకుల రాజు, సాయి, కృష్ణమూర్తి, తిమ్మప్ప, దిలీప్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

వృద్ధురాలు మృతి.. నివాళులర్పించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్

అమీర్‌పేటకు చెందిన వ్యాపార వేత్త, బీఆర్‌ఎస్ నాయకులు కొత్తపల్లి మధుసూదన్ రావు మాతృమూర్తి శకుంతలా దేవి (100) గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అమీర్‌పేట్ రిలయన్స్ వీధిలోని వారి నివాసానికి వెళ్ళి శకుంతలా దేవి భౌతికకాయానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తపల్లి మధుసూదన్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, గోపిలాల్ చౌహాన్, కూతురు నర్సింహ, సర్దార్ కుల్వంత్ సింగ్, బలరాం తదితరులు ఉన్నారు.

భోజ్ రెడ్డి కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం



నవతెలంగాణ-బేగంపేట్

భోజ్ రెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం, జిజ్ఞాస-2025 నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ జాతీయ సాంకేతిక ఉత్సవంలో నూతన సాంకేతికంపైన నిర్వహించిన వివిధ పోటీలలో 630 ఔత్సాహిక విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ప్రొఫెసర్ శ్రీలం వెంకటేష్, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ ఆర్ శ్రీదేవి, డైరెక్టర్, ఎంట్రెప్రీనర్షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్ట్ అప్, జేఎన్‌టీయూహెచ్ పాల్గొన్నారు. ప్రారంభోత్సవంలో ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ ప్రసంగిస్తూ భోజ రెడ్డి కళాశాల ఎటువంటి లాభాలను ఆశించకుండా మహిళా అభ్యుదనానికి పాటుపడుతుందని మెచ్చుకున్నారు. ఈ సంస్థ బి కేటగిరి అడ్మిషన్‌లో ఉత్తమ పద్ధతులను అనుసరిస్తూ అగ్రస్థానంలో నిలిచిందని కొనియాడారు. ప్రొఫెసర్ ఆర్ శ్రీదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా సంతోషంగా కృషితో విద్యను అభ్యసించాలని ప్రస్తావించారు. జాబ్ సీకర్స్ కాకుండా జాబ్స్ గీవర్స్‌లాగా ఉండాలన్నారు. అనంతరం కళాశాల సెక్రెటరీ డాక్టర్ వి సుధా, సీఓఓ డాక్టర్ సుజాత గంగాధర్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె మాధవన్ మాట్లాడుతూ.. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు జిజ్ఞాన ఉత్సవాలు సాధనంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ గ్రేసి, ఉప ప్రధానోపాధ్యాయుడు జి దయాకర్ రెడ్డి, కన్వీనర్ డాక్టర్ పి దీప్తి, ఆర్ మంజు బాధవి అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ యాప్‌తో నగరంలో పరిశుభ్రత మెరుగు

సమగ్ర ఛలాన్ నిర్వహణ (సీసీఎంఎస్) పై శిక్షణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సమగ్ర ఛలాన్ నిర్వహణ వ్యవస్థ (సీసీఎంఎస్)పై గురువారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓలు, డిప్యూటీ ఈఈ లు (ఎస్‌డబ్ల్యూఎంఎస్), ఏసీపీలకు సీసీఎంఎస్ యాప్ ద్వారా జరిమానాలను విధించే విధానంపై శిక్షణ అందించారు. అడిషనల్ కమిషనర్లు (ఐటీ), (శానిటేషన్), జాయింట్ కమిషనర్ (ఐటీ), టీజీ ఆన్‌లైన్ ప్రతినిధులు అధికారులకు 'సీసీఎంఎస్' యాప్ ఏవిధంగా పనిచేస్తుందో వివరించారు. టీజీ ఆన్‌లైన్ సంస్థ ఈ యాప్‌ను అమలు చేసే ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. ఈ యాప్ ద్వారా ప్రధానంగా కూడళ్లలో చెత్త వేయడం, వాణిజ్య సంస్థల వద్ద ట్విన్ బిన్లు లేకపోవడం, నిర్మాణ, విధ్వంస వ్యర్థాలకు అనుమతి లేకుండా పడేయడం వంటి ఉల్లంఘనలపై జరిమానాలు విధిస్తారు. దాంతో నగరంలో పరిశుభ్రత మెరుగుపడుతుందన్నారు.

ఎమ్మెల్సీలుగా అంజిరెడ్డి, మల్క కొమరయ్య గెలుపుతో సంబరాలు

నవతెలంగాణ- మేడ్చల్

ఉమ్మడి కరీంనగర్-ఆదిలాబాద్- నిజామాబాద్-మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా సీ అంజిరెడ్డి, టీచర్ ఎమ్మెల్సీగా మల్క కొమరయ్య ఘన విజయం సాధించిన సందర్భంగా మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీజేపీ నాయకులు గురువారం సంబరాలు నిర్వహించారు. మేడ్చల్ పట్టణంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రం దగ్గర బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. మండల అధ్యక్షుడు ఎక్కల దేవి శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్ దాస్, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగం అర్జున్, మైసూరి రాజు,శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ కార్యాలయం ఎదుట అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి,మిఠాయిలు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రమ్ రెడ్డి,జిల్లా నాయకులు అమరం మోహన్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంజిత్ మోహన్,కృష్ణ గౌడ్,మాజీ కౌన్సిలర్ లు దొడ్ల మల్లికార్జున్,అమరం సరస్వతి,నాయకులు రవీందర్ గౌడ్,అర్జున్ తదితరులున్నారు.

ఆశాలకు జీపీఎస్ సిస్టం తొలగించాలి

- ఎన్‌సీడీ, ఎఎన్‌సీ టార్గెట్లు తీసివేయాలి
- 18వేల ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలి
- పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి
- సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వెంకటేష్
- సికింద్రాబాద్‌లోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా..వినతి పత్రం అందజేత





నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు జీపీఎస్ లోకేషన్ సిస్టమ్ అమలు చేయడం వలన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, ఈ పద్ధతి మహిళలైన ఆశా వర్కర్ల మీద నిఘా వేసినట్టుగా ఉందని సీఐటీయూ విమర్శించింది. ఈ మేరకు గురువారం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ, సౌత్ కమిటీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయం హరిహర కళాభవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షురాలు టి.యాదమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, అధ్యక్షులు జె.కుమార స్వామి, సౌత్ సిటీ కమిటీ అధ్యక్షురాలు ఎం.మీనా మాట్లాడుతూ ఈనెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18వేల ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలనీ, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం ట్రెనింగ్ పూర్తి చేసిన ఆశాలకు, ఏఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్ సౌకర్యం కల్పించాలనీ, వెయిటేజీ మార్కులు వెంటనే నిర్ణయించాలన్నారు. గత 15 రోజుల సమ్మె హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు, గతేడాది ఫిబ్రవరి 9న, జూలై 30న డిసెంబర్ 10న ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు, మట్టి ఖర్చులు రూ.50 వేలు చెల్లిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. డిసెంబర్ 10న ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు నిర్ణయిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించాలనీ, ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ నిర్ణయించాలన్నారు. ఆశాలకు ప్రతి ఏడాది 20 రోజులు వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలనీ, 6 నెలలు మెడికల్ సెలవులివ్వాలన్నారు. గత ప్రభుత్వ హామీ ప్రకారం ప్రసూతి సెలవులు కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలనీ, ఆశాలకు పూనమ్ క్లాత్‌తో కూడిన క్వాలిటీ యూనిఫామ్, ఎండాకాలంలో కాటన్ యూనిఫామ్ ఇవ్వాలన్నారు. ఆశాలు చేస్తున్న పారితోషికం లేని పనులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు 6 నెలల పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలనీ, 2022, 2023, 2024 సంవత్సరాల లెప్రసీ సర్వే పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. 2024 మార్చి 3-5 వరకు 3 రోజుల పల్స్ పోలియో డబ్బులు చెల్లించాలన్నారు. ఇప్పటివరకు లేని ఆస్పత్రుల్లో వెంటనే ఆశాలకు రెస్ట్ రూం ఏర్పాటు చేయాలనీ, ఇప్పటికే కేటాయించిన ప్రాంతాల్లో ఇతరులకు ప్రవేశం ఉండకూడదని ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఆశాలకు పని భారం తగ్గించాలనీ, పారితోషికం లేని పనులు చేయించకూడదన్నారు. అంతకుముందు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటిని సీఐటీయూ ప్రతినిధుల బృందం కలిసి వినతి పత్రం అందించింది. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం. అనిత, సీఐటీయూ నగర సీనియర్ నాయకులు మల్లేష్, సరిత, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఇయర్ పరీక్ష ప్రశాంతం..

- జిల్లాలో తొలి రోజు 75,083 మంది హాజరు
- 2412 మంది విద్యార్థులు గైర్హాజరు



హైదరాబాద్ జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ ద్వితీయ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ఆరంభమయ్యాయి. తొలిరోజు సెకండ్ ఇయర్ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. హైదరాబాద్ జిల్లాలో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 2,412 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లోకి గంట ముందే విద్యార్థులను అనుమతించారు. సెకండ ఇయర్ విద్యార్థులకు మొదటి పరీక్ష కావడంతో ఉరుకులు పరుగులు తీస్తు కనిపించారు. పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి కనిపించింది. దానికితోడు అక్కడక్కడ ట్రాఫిక్ జామ్‌ల బెడద తప్పలేదు. సంవత్సర పరీక్షలకు 77,495 విద్యార్థులకుగాను 2,412 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణకుగాను 244 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 73,407 జనరల్ విద్యార్థులకుగాను 71,166 మంది విద్యార్థులు హాజరుకాగా 2,241 మంది గైర్హాజరయ్యారు. వొకేషన్ విభాగంలో 4,088 మంది విద్యార్థులకు గాను 3,917 మంది హాజరవ్వగా 171 మంది గైర్హాజరయ్యారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63,946 మంది విద్యార్థులకు గాను 62,969 మంది హజరు కాగా.. 977 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ విభాగంలో 62,886 మంది విద్యార్థులకుగాను 61,941 మంది హాజరుకాగా 945 మంది గైర్హాజరయ్యారు. ఇక వోకేషనల్ విభాగంలో 1060 మంది విద్యార్థులకు 1028 మంది హజరు కాగా.. 32 మంది గైర్హాజరయ్యారు. మాస్‌కాఫీయింగ్, మాల్‌ప్రాక్టీస్ వంటి ఎలాంటి కేసులు నమోదు కాలేదు. పరీక్ష కేంద్రాలను డీఈసీతో పాటు హైపవర్ కమిటీలు ఆకస్మికంగా తనిఖీలు చేశాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో ఆయా సెంటర్ల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యార్థులు కొంత ఇబ్బందిపడ్డారు.

సిల్ట్ కార్టింగ్ వాహనాల యజమానులతో ఎండీ భేటీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి పరిధిలో పనిచేస్తున్న సిల్ట్ కార్టింగ్ వాహనాల యజమానులతో ఎండీ అశోక్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ 180 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో సిల్ట్ కార్టింగ్ వాహనాలది కీలక పాత్ర ఉందన్నారు. సెక్షన్‌లో నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అధికారులు ఏ సమయంలో ఫోన్ చేసినా అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు మీపై మంచి అభిప్రాయం ఏర్పడేలా కష్టపడాలని తెలిపారు. ఈ వాహనాల వల్లేమీ కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయన్నారు. అందుకు కతజ్ఞతగా కష్టపడి పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించాలని పేర్కొన్నారు. బోర్డులో ఎవరికీ లేని విధంగా వాహనాల బిల్లులు సమయానికి చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఆధునిక టెక్నాలజీతో వాహనాల కదలికలను తాను ఎప్పటికప్పుడు డ్యాష్ బోర్డులో గమనిస్తున్నట్లు చెప్పారు. ఏ రోజుకారోజు సిల్ట్ తీసేయాలని ఆదేశించారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వాహనాల యజమానులు పలు సమస్యల్ని ఎండీకి తెలుపగా ఆయన వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సిల్ట్ కార్టింగ్ యజమానులు ఎండీ అశోక్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్-1 అమరేందర్ రెడ్డి, వాహనాల యజమానులు పాల్గొన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయింది

డాక్యుమెంట్ నెంబర్ 5464/2017 సబ్ రిజిస్టర్ ఆఫీస్ హాయత్ నగర్ లో తేది 27/10/2017న శివం డెవలవర్స్ పేరుతో రిజిస్టర్ అయిన డాక్యుమెంట్ 27 ఫిబ్రవరి 2025 న కంపెనీ పార్ట్నర్ అయిన పి.శ్రీనివాస్ హుడా సాయి నగర్ కాలనీ నుండి వనస్థలిపురంకు ఆటోలో ప్రయాణం చేస్తున్న సందర్భంగా ఒరిజినల్ డాక్యుమెంట్ పోయింది. సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా పై డాక్యుమెంట్ సంబంధించిన సమాచారం ఈ క్రింది నెంబర్ కి ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి.
సెల్ నెంబర్: 9392497696

మహిళా దినోత్సవం కానుక..

- నలుగురు మహిళా సీఐలకు ఎస్‌హెచ్‌వోగా నియామకం



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ సీపీ, డీజీ సీవీ ఆనంద్ నలుగురు మహిళా సీఐలకు ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. సెంట్రల్‌జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న జ్యోత్స్నాకు కాచిగూడ (ఎల్ అండ్ ఓ) ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. మేయిన్‌న సీపీఆర్‌లో పనిచేస్తున్న దోమాట దిబోరాను సెంట్రల్‌జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగాను, టాస్క్‌ఫోర్సు అడ్మిన్‌గా పనిచేస్తున్న చిట్టిబ్రను సెక్రెటరియేట్(లేక్) పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. సీసీఎస్‌లో పనిచేస్తున్న పీ.వెంకటలక్ష్మిని నాంపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. వీరితోపాటు కాచిగూడ హెస్‌హెచ్‌వోగా పనిచేసిన చంద్రకుమార్‌ను మేయిన్ పీసీఆర్‌కు బదిలీ చేశారు. సెక్రెటరియేట్(లేక్) పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన సత్యనారాయణ మూర్తిని నల్లకుంటా ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో పోటీ పడుతున్నారని, మీరు కూడా స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా మీ సత్తా చూపించాలన్నారు. పక్షపతధోరిని వహించొద్దన్నారు. ప్రత్యేకంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు ప్రభుత్వాలు అన్ని విధాలుగా సహకరించాలి

- భారతీయ కిసాన్ సంఘ్ నూతన అధ్యక్షులు సాయి రెడ్డి



నవతెలంగాణ -శామీర్ పేట

పండించిన పంటకు మద్దతు ధర కల్పించి, రైతులకు అన్ని విధాలా సహకరించాలని భారతీయ కిసాన్ సంఘ్ నూతన అధ్యక్షులు కొండల సాయి రెడ్డి కోరారు. గురువారం మేడ్చల్ జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షులు కె.రాజేందర్ రెడ్డి అధ్యక్షతన శామీర్ పేట మండలంలోని అలియాబాద్ రైతు వేదికలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారతీయ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన కొండల సాయి రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రైతులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ ఈ సమాజానికి ఆహారాన్ని అందిస్తున్నారని అన్నారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్నారు. ధరల హెచ్చుతగ్గుల నివారణకు ఇది ఉపయోగపడుతుందన్నారు. రైతు చైతన్యంతో దేశం అభివృద్ధి జరుగుతుందన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ -దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో పనిచేస్తుందని ప్రపంచంలోనే ఎక్కువ సభ్యత్వం కలిగిన రైతు సంఘం భారతీయ కిసాన్ సంఘమని తెలిపారు. దేశంలో దేశభక్తి కలిగిన డీవోటీ కార్యకర్తలకు రాష్ట్ర, జిల్లా గ్రామస్థాయిల లో శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసుకొని ప్రణాళికలు సిద్ధం చేసుకుని పని చేస్తామని చెప్పారు. తెలంగాణలో కిసాన్ సంఘ్ మేడ్చల్ జిల్లాను ఒక శిక్షణ కేంద్రంగా ఏర్పాటు చేసుకొని ఇక్కడ నైపుణ్యం కలిగిన కార్యకర్తలతో శిక్షణ ఇప్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు స్వావలంబన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం మేడ్చల్ జిల్లా భారతీయ కిసాన్ సంగ్ జిల్లా కార్యవర్గం, మండల కార్యవర్గాలు, గ్రామ కమిటీలు అఖిలభారత ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జోగినపల్లి శ్రీరంగారావు, ఉపాధ్యక్షులు పన్యాల వెంకట రెడ్డి, కార్యదర్శి బోరంపేట మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు కె. సురేందర్ రెడ్డి, పి. సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్. ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, మిగతా కార్యవర్గ సభ్యులు పెద్దలు పెద్ద నరసింహారెడ్డి, వివిధ మండలాల నుంచి విచ్చేసిన మండల గ్రామ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, SURYAPET DISTRICT: AT: SURYAPET
O.S.No.214 of 2024

BETWEEN: -
Pothumarthi Satyanarayana S/o. P.Nageswara Rao Aged about 53 years, Occ: Business R/o. Plot No.28(Old No.24) 16-2-28,16-2-29 Hydernagar, CBCID Colony, Kukatpally, Hyderabad-500085 ...Plaintiff
AND
G.Karunakar Reddy S/o. G.Narasimha Reddy Aged about 54 years, Occ: Business R/o H.No.11-13-888, Balagi Nivas, Road no. 2 Green Hills Colony, Hyderabad. ...Defendant.
To.
G.Karunakar Reddy S/o. G.Narasimha Reddy Aged about 54 years, Occ: Business R/o H.No.11-13-888, Balagi Nivas, Road no.2 Green Hills Colony, Hyderabad.
Whereas the above-named plaintiff has instituted the above a suit against you for Suit for Perpetual Injunction. You are hereby summoned to appear before the Hon'ble I Additional Junior Civil Judge, Suryapet District, at Suryapet on 24 th day of March 2025 at 10.30 A.M. in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above suit. Please take notice, that in default of your appearance the above matter will be heard & determined in your absence.
(By order of the Hon'ble court)
M/S SAMAVARTHY LAW CHAMBERS
R.S.SRAVAN KUMAR
CH. AVINASH KUMAR
D. ANUSHA, ADVOCATES
Flat No 201, 1-8-131 to 143, Karan Residency, above 'Naturals,'Pender Ghast Road, Sindi Colony, Secunderabad – 500 003.
Mobile:9533775867

IN THE COURT OF THE HON'BLE XXVII ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT: SECUNDERABAD
E.A.NO.77 OF 2024
IN
E.P.NO.48 OF 2015

Between:
Sri.Aniket Seth & Ors ...Petitioner/Claim Petitioners
And
M/s Sai Jitesh Constructions Pvt Ltd &Ors ...Respondents/DHR/JDR
1] Smt.Y.Vijaya Lakshmi W/o.Late Suryakant Reddy, aged 81 years Occ: Housewife
2]Y.Nisha Reddy, D/o.Late Suryakant Reddy, Aged 61 Years, Occ. Housewife
3] Y.Rajeev Reddy, S/o. Late Suryakant Reddy Aged 61 Years, Occ. Business
All are R/o.H.No.3-4-769, Barkatpura, Hyderabad
The Petitioners Mr Aniket Seth & Another has filed E.A.No.77 of 2024 in E.P.No.48 of 2015on the file of Hon'ble XXVII Addl. Chief Judge, City Civil Court, Secunderabad under Order XXI Rule 58 C.P.C for claim Petition. The said application is posted on 10-03-2025 for your appearance. You are therefore required to appear in person or through a duly appointed advocate before the Hon'ble XXVII Addl. Chief Judge, City civil Court, Secunderabad on 10-03-2025 at 10:30 Am failing which the Hon'ble court shall proceed to decide the matter based on the material available on record.
//ISSUED UNDER ORDER OF THE COURT//
GANU & CO
Advocates
Flat No. 201-202, Vipanchi Estates. D.No. 3-5-874/A, Hyderguda, HYD-500 029.
Ph.: 040-23234570/23232837

IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD
O.S.NO.1820 OF 2020

Between:
Canara Bank, Ameerpet Branch, Hyderabad. ....Petitioner/Plaintiff
And
Sri Vishnu Amudavakla ...Respondent/Defendant
To
Sri Vishnu Amudavakla S/o. A. Chandraiah, aged about 37 years, occ: Business, Represented by its sole Prop: Vishnu Tea Stall, R/o. 8-3-901/23, Nagarjuna Nagar Colony, Yellareddyguda, Hydera bad - 500073. Ph No. 9063117332.
Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of Rs. 69,166/- together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the 29th March, 2025, at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//BY ORDER OF THE COURT//
N. VENUGOPALA RAO
ADVOCATE
1-2-234/2/1,Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.
Cell : 98492 64568

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE: CITY CIVIL COURT, AT: HYD'BAD
O.P.NO.2013 of 2024

Between:-
Shaik Mubeen ...Petitioner
AND
Md.Imran Khan and others ...Respondents.
To,
Vineeth Dunde S/o.not known, Aged Major, Occ: Insured of the vehicle Br. No. AP-28-DN-0091, R/o.H. No.2-3-64/1/1/1/A/1, Jaiswalgarden, Amberpet, Hyderabad, TG 500013. ...Respondent No.2.
NOTICE
Please take notice that the petitioner here inabove filed the above OP against you and others claiming compensation for the injuries received by him road accident. The above OP is posted to 20-03-2025 for your appearance.
Therefore, you are hereby requested to appear before the above said court on 20-03-2025 at 10.30 am, either in person or through an Advocate duly instructed, and file your counter if any. Failing which the above matter will be heard in your absence.
// BY ORDER OF THE COURT //
P.NARASIMHA
Advocate
Hyderabad.
Cell No.9100085959
Counsel for petitioner

IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT HYDERABAD
O.S.NO. 4223 of 2021

Between:
Canara Bank, R K Muth Branch, Hyderabad ....Petitioner/Plaintiff
And
Sri Y. Sudheer Babu ...Respondent/Defendant
To
Sri Y. Sudheer Babu S/o. Y. Venkateshwara Rao, aged about 44 years, Occ: Business, Sole Proprietor HI Project Binding, Shop No.3, MIG-17, Phase -1, Dharma Reddy Colony, KPHB Colony, Hyderabad - 500085 and R/o. H.No. LIG - 824, Phase-I, KPHB Colony, Balanagar, Hyderabad - 500072. Ph No. : 990850405.
Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of Rs. 9,96,426/- together with costs and future interest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the 29th March, 2025, at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.
//BY ORDER OF THE COURT//
N. VENUGOPALA RAO
ADVOCATE
1-2-234/2/1,Plot No.2/P, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.
Cell : 98492 64568

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND & SESSIONS JUDGE MEDCHAL-MAKAJGIRI DISTRICT, AT: KUSHAIGUDA
T.R.O.P.26 OF 2024

Between:
M/s Ring Road Warehousing Pvt Ltd ...Petitioner
AND
N.Vykuntam &12 others ....Respondents
To,
Punjari Brijesh Narayana, S/o P.Mahesh Narayana Age:24yrs,Occ:Student,R/o:H.No.1 12-11-1330, Boudhanagar Warasiguda, Secunderabad. (Respondent No.12)
NOTICE
Please take notice that the petitioner has filed the above transfer petition against you and other respondents and the same is posted to 18-03-2025 at 10.30 AM for your appearance either in person or through your Counsel before Hon'ble court failing which Hon'ble court shall proceed against you as per law.
(By Order of the Court)
Venugopal Julakanti
Advocate
Office: Flat No.203-A Mayfair Gardens Rd.No.12, Banjara Hills Hyderabad- 34.
(Counsel for Petitioner)

IN THE COURT OF THE HON'BLE X ADDITIONAL JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT; AT: HYDERABAD
O.S.NO. 329 OF 2025

Between:
SMT.P.A.RANADE, @ PRATIBHA BILGRAMI ....Plaintiff
AND
1. State Bank of India, Himayath nagar branch, Hyderguda, Hyderabad, Rep. by its branch Manager: Off:3-6-232, Himayathnagar, Hyderabad-29
2. All concerned ....Defendants
To,
State Bank of India, Himayathnagar branch, Hyderguda, Hyderabad, Rep.by its branch Manager: Off: 3-6-232, Himayathnagar, Hyderabad-29 ....Respondent/Defendant
The Respondent/Defendant is hereby put to notice that above referred petitioner/plaintiff has filed above O.S.No.329 of 2025. The above Hon'ble court ordered for taking out publication against the Respondent/Defendant and posted said suit on 25.03.2025 for their appearance. If any person having any claim or objection etc., in the above regard may appear on said date before above Hon'ble court at 10:30 A.M. either in person or through counsel and submit their version. If there is no such claims received on said date, this Hon'ble court will proceed and dispose of case hearing the other parties to case.
ROYYALA THIRUPATHAIAH
B.A., LLB
ADVOCATE
Off : 1-71/2, 2nd Floor, Bhavana Building, Prabathnagar, Near GBR Hospital, Chaitanyapuri, DSNR, HYD-60,
Cell : 8074656005

IN THE COURT OF THE HON-BLE SPECIAL JUDICIAL MAGISTRATE OF 1ST CLASS FOR TRAIL OF CASES UNDER TELANGANA PROHIBITION AND EXCISE ACT CUM III ADDL JUNIOR CIVIL JUDGE SAN-GAREDDY DIST: AT: SANGAREDDY
IN
O.S.No.1003 of 2024

Between:-
M/s SREE VINAYAKA ENTERPRISES Rep by its Propt K.SHASHIKANTH ....Plaintiffs
AND
1.M/s M.K.RAO INVESTMENTS Pvt.Ltd. Rep by Sri.M.KISHAN RAO and another .....Defendants 1 & 2
To
1.M/s M.K.RAO INVESTMENTS Pvt. Ltd.Rep by Sri. M.KISHAN RAO S/O ANJAIAH AGED ABOUT 70 YEARS, OCC: BUSINESS, R/O H.NO.15-4-188, OSMAN SHAHI, HYDERABAD-500012, TELANGANA
2.M.V.SRINIVASA REDDY S/o MV NARAPPA REDDY AGED ABOUT 56 YEARS, OCC: BUSINESS, R/O H.NO. EWS-13, KPHB COLONY, KUKATPALLY, HYDERABAD-500072, TELANGANA ...Defendants 1 & 2
This is for your information and notice that the O.S.No.1003 of 2024 is posted on 26.03.2025 for your appearance. You are hereby summoned to appear either in person or through your pleader with your defense if any at 10.30 A.M on the above said date before the Hon'ble court failing which the suit will be heard and determined as Ex-Party.
// By Order of the Hon'ble Court //
Sd/-
S.K.ZAKEER HUSSAIN, ADVOCATES & ASSOCIATES
MOOSAPET BUS STOP KUKATPALLY, HYDERABAD-72, T.G, Mobile No: 9985161616

IN THE COURT OF THE HON'BLE Ist ADDL. DISTRICT JUDGE, R.R.DISTRICT AT: L.B.NAGAR
O.S.No.1104 OF 2019

Between:-
Sumathi Narendra, & another ...Plaintiffs
AND
K.Mohan Rao & others ...Defendants
COURT SUMMONS
To,
D8:M.Sreyas Reddy, S/o.Rajender Reddy, Aged about 40-years, Occ: Business,
D9:Smt.M.Hema, W/o M.Rajender Reddy, Aged about 51-Years, Occ: House-Wife,
Both are R/o Flat No.401, Gowri Apartment, Urdu Hall Lane, Behind CDR Hospital, Himayathnagar, Hyderabad-(T.S.).
WHEREAS the above-named Plaintiffs had filed the above Suit for Declaration, Cancellation of Sale Deeds, Gift Deeds and Development Agreements, etc. against You and others in respect of the Suit Schedule Properties. Since you i.e. Defendants No.8 & 9 are avoiding to receive the Court Su Summons and as directed by this Hon'ble Court, the Plaintiffs made this Publication for your appearance in the above Suit on 28.03.2025 at 10.30 AM to answer the Suit-Claim.
Therefore, You i.e. Defendants No.8 & 9 are hereby called upon to appear either in person or through your Advocate duly instructed to appear and answer the above Suit-Claim on 28.03.2025 at 10.30 AM in the above Suit at R.R.District Court Complex, L.B.Nagar failing which the matter will be heard and decided by the Hon'ble Court in your absence by setting You Ex.Parte.
// BY ORDER OF THE COURT //
Sd/-
M/s.G.Sudha,
G.Ravinder Goud,
Advocates
H.No.10-3-16/2, Humayun Nagar, Mehdipatnam, Hyd-500 022.
Cell: 9948440168
COUNSEL FOR PLAINTIFF

IN THE COURT OF THE HON'BLE Ist ADDL. DISTRICT JUDGE, R.R.DISTRICT: AT: L.B.NAGAR
I.A.No.1333 OF 2019
IN
O.S.No.1104OF 2019

Between:-
Sumathi Narendra, & another ...Petitioners/Plaintiffs
AND
K.Mohan Rao & others ...Respondents/Defendants
COURT NOTICE
To,
R8:M.Sreyas Reddy, S/o Rajender Reddy, Aged about 40-years, Occ: Business,
R9: Smt.M.Hema, W/o M.Rajender Reddy, Aged about 51-Years, Occ: House-Wife,
Both are R/o Flat No.401, Gowri Apartment, Urdu Hall Lane, Behind CDR Hospital, Himayathnagar, Hyderabad-(T.S.
WHEREAS the above-named Petitioners/Plaintiffs had filed the above Suit for Declaration, Cancellation of Sale Deeds, Gift Deeds and Development Agree ments, etc. against You and others in respect of the Suit Schedule Properties and also filed the above-said Petition for AD-INTERIM INJUNCTION in respect of Petition Schedule Properties. Since you i.e. Respondents No.8 & 9 are avoiding to receive the Court Notices and as directed by this Hon'ble Court, the Petitioners s made this Publication for your appearance in the above-said Petition on 28.03.2025 at 10.30 AM to answer the Petition Relief.
Therefore, You i.e. Respondents No.8 & 9 are hereby called upon to appear either in person or through your Advocate duly instructed to appear and answer the above-said Petition Relief on 28.03.2025 at 10.30 AM in the above Suit at R.R.District Court Complex, L.B.Nagar failing which the matter will be heard and decided by the Hon'ble Court in your absence by setting You Ex.Parte.
// BY ORDER OF THE COURT //
Sd/-
M/s.G.Sudha,
G.Ravinder Goud,
Advocates
H.No.10-3-16/2, Humayun Nagar, Mehdipatnam, Hyd-500 022.
Cell: 9948440168
COUNSEL FOR PLAINTIFF

నవతెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం మార్చి 07, 2025 www.navatelangana.com

గాంధీనగర్‌లో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లో ప్రత్యేక ప్రణాళికతో పార్కుల అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. గురువారం కార్పొరేటర్ కార్యాలయంలో హార్టికల్చర్ మేనేజర్ ఆశిష్ కుమార్‌తో కార్పొరేటర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కుల అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధులు మంజూరు కానున్నాయని అందుకు హార్టి కల్చర్ అధికారులు ప్రత్యేక దృష్టి వహించి అభివృద్ధి పనులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలో గాంధీనగర్ డివిజన్‌లోని పార్కులను అద్భుతంగా సుందరీకరించి, ఉద్యానవనాలను తలపించే విధంగా అభివృద్ధి చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెం ట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యా శ్రీ హై స్కూల్‌కు180 అవార్డులు



నవతెలంగాణ-ధూల్‌పేట్

తెలంగాణ రాష్ట్ర స్థాయి చేతి వ్రాత పోటీలలో జీయగూడ విద్యా శ్రీ హై స్కూల్ విద్యార్థులు 180 అవార్డులను గెలుచుకున్నారని ఆ స్కూల్ చైర్మెన్ శ్యామ్ వెరా తెలిపారు. ఈ మేరకు గురువారం స్కూల్ కార్యాలయంలో వారు వివరాలను వెల్లడించారు. ఇటీవల అక్షర్ హ్యాండరైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణా రాష్ట్ర స్థాయిలో వివిధ స్కూల్‌ల్లో సుమారు 12 వేల మంది విద్యార్థులు చేతి వ్రాత పోటీలలో పాల్గొనగా 180 మంది విద్యార్థులు గెలిచారన్నారు. వీరందరికి 8వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు స్కూల్ ఆడిటోరియంలో అక్షర్ హ్యాండరైటింగ్ అకాడమీ వారు సర్టిఫికెట్, మెడల్స్‌లను బహుకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథులుగా కూల్సుంపురా ఏసీపీ మునావర్, కాంగ్రెస్ గ్రేటర్ యూత్ అధ్యక్షులు కిరణ్ తదితరులు హాజరువుతున్నట్లు తెలిపారు.



శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దు

- త్వరలో మరిన్ని పోలీస్ స్టేషన్‌లు నిర్మిస్తాం : మంత్రి పొన్నం
- ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు సహకరించాలి : ఎమ్మెల్యే కాలేరు
- ఆ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడిన .. మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్



నవతెలంగాణ-అంబర్‌పేట

శాంతిభద్రతల విషయాలలో పోలీసులు ఎలాంటి రాజీ లేకుండా నిర్దిష్ట ప్రణాళికతో పని చేయాలని నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం అంబర్‌పేటలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయాన్ని నగర సీపీ సీవీ ఆనంద్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే మరిన్ని పోలీస్ స్టేషన్లు నిర్మిస్తామని శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మార్వో ఆఫీసు నిర్మించడానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాలు ఆబిడ్స్, అశోక్ నగర్, బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాలలో కార్యాలయాలు ఉన్నాయని ప్రజలకు మెరుగైన సదుపాయాల కోసం నియోజకవర్గంలోని ఉండే విధంగా ప్రభుత్వ కృషి చేయాలని ప్రభుత్వానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు మాట్లాడుతూ ఇప్పుడు డీసీపీ ఆఫీస్ కట్టిన స్థలం ఒకప్పుడు కబ్జాకి గురైందని ఓ రియాల్టర్ ప్లాట్లు చేసి అమ్మాలని చూసాడు. కొట్లాడి భూమిని కబ్జా నుంచి కాపాడిన నాకు 2 వేల గజాలు ఇస్తా అని ఆఫర్ చేసినా కూడా పట్టించుకోలే అని అన్నారు. అంబర్‌పేటలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కాలేజ్ ఏర్పాటుకు సీఎం చొరవ చూపాలని స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలన్న సీఎం సంకల్పం చాలా గొప్పదనీ స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటు ఐతే.. పోలీసులకు కూడా ఉపయోగకరమన్నారు. ఒకప్పుడు హైదరాబాద్ ఫుట్‌బాల్ టీమ్ చాలా గొప్పగా ఉండే.. ఇప్పుడు ఫుట్ బాల్ లేకుండా పోయిందని హైదారాబాద్ సీపీ కూడా క్రికెట్ చాలా బాగా ఆడుతాడు. మొన్న చూసా.. అద్భుతంగా బౌలింగ్, బ్యాటింగ్ చేస్తారని కొనియాడారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ ప్రజలకు రక్షణగా పోలీసు సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారని భవిష్యత్తులో కూడా ప్రతి పేదవాడికి న్యాయం జరిగే వరకు పోలీసులు అన్ని విధాలుగా అండగా ఉంటారని పేర్కొన్నారు. కార్పొరేటర్ ఇ.విజయ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నడుస్తున్న చే నెంబర్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వ కార్యాలయాలు నియోజకవర్గానికి తీసుకురావాలని ప్రభుత్వం సహకరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ ఆఫీసర్స్ రమేష్ రెడ్డి, ఈస్ట్ జోన్ డీసీబీ బాలన్న, ఏసీపీ రఘు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

శ్యాం ప్రసాద నగర్ గుడిసే వాసులకు ఇండ్లు కట్టించాలి

సీపీఐ(ఎం) ముషీరాబాద్ కార్యదర్శి ఆర్.వెంకటేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం బాగ్‌లింగంపల్లిలోని శ్యాం ప్రసాద నగర్ గుడిసే వాసులకు పక్కా ఇండ్లు కట్టించాలని సీపీఐ(ఎం) ముషీరాబాద్ కార్యదర్శి ఆర్.వెంకటేష్ డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై సీపీఐ(ఎం) ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో 4వ రోజు బస్తీల్లో సర్వే కార్యక్రమంలో భాగంగా బాగ్‌లింగంపల్లి శ్యాంప్రసాద్ నగర్ గుడిసెలో సర్వే నిర్వహించారు. సర్వేలో సీపీఐ(ఎం) ముషీరాబాద్ కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి చిన్నచిన్న గుడిసెలలో 20 పేద కుటుంబాలు జీవనం సాగిస్తున్న గత ప్రభుత్వాలు బస్తీ వాసులకు ఇండ్లు కేటాయించకపోవడం దుర్మార్గమని, కాంగ్రెస్ ప్రభుత్వామైన శ్యామ్ ప్రసాద్ నగర్ గుడిసె వాసులకు ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. శ్యాం ప్రసాద్‌నగర్ బస్తీ వాసులు చిన్న చిన్న రేకుల రూమ్‌లలో ఒక్కో కుటుంబంలో సుమారు పది మంది జీవిస్తూ చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జీవో 58కింద రెండుసార్లు దరఖాస్తులు చేసుకుంటే అధికారులు సర్వేలు నిర్వహించి వదిలేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం శ్యాం ప్రసాద నగర్ గుడిసే వాసులకు పక్క ఇండ్లు కట్టించాలని కోరారు. ఈ సర్వేలో ముషీరాబాద్ జోన్ కార్యదర్శివర్గ సభ్యులు కే. రమేష్, నాయకులు సి.మల్లయ్య, బస్తీ వాసులు కళావతి, లక్ష్మీదేవి, మల్లమ్మ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే.. రాకపోకలకు అంతరాయం

చెత్త కుండీ డంపింగ్ తొలగించాలి : సీపీఐ(ఎం) సౌత్ జిల్లా నాయకులు కృష్ణ కిషన్



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ సమీపంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా నాయకులు కృష్ణ కిషన్‌లు డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలపై సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో జంగంమేట్ డివిజన్ రవీందర్ నాయక్ నగర్ కాలనీలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ దగ్గర విచ్చలవిడిగా చెత్తకుండి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడంతో రైల్వే స్టేషన్ రవీందర్ నాయక్‌నగర్ కాలనీ వాసులకు ప్రజలు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ సమస్యను పరిష్కారించాలని గత రెండేళ్లుగా జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. అప్పుడప్పుడు తాత్కాలికంగా చెత్త తీయడం జరుగుతుందని పూర్తిస్థాయిలో అక్కడ నుంచి డంపింగ్ యార్డు మార్చలేని పరిస్థితిలో జీహెచ్‌ఎంసీ అధికారులున్నారన్నారు. చెత్త సేకరణ రాంకీ సంస్థ ఇవ్వడంతో ఈ సమస్య ఏర్పడుతుందన్నారు. సకాలంలో చెత్త తొలగించకపోవడంతో చెత్త పెద్ద ఎత్తున జమ అవుతుందని దీంతో దుర్వాసన వెదజల్లడంతో స్థానిక ప్రజలు, రాకపోకలు సాగించేవారు అసౌకర్యానికి గురవుతున్నారని ఇప్పటికైనా రవీందర్ నాయక్ నగర్ కాలనీలో ఫలక్‌నుమా రైల్వే స్టేషన్‌దారిలో చెత్త డంపింగ్ యార్డ్ లేకుండా చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు రాంకుమార్, శ్రీను రాజేష్, గోపాల్ రవిస్వామి, వినోద్ తదితరులున్నారు.

మంద కృష్ణ మాదిగకు ఎస్సీ వర్గీకరణ ఇష్టం లేదు

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డా.పిడపర్తి రవి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మంద కృష్ణ మాదిగకు ఎస్సీ వర్గీకరణ ఇష్టం లేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డా.పిడమర్తి రవి అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అంబేద్కర్ సంఘాల సమాఖ్య అధ్యక్షులు రాపోలు రాములు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఇన్‌చార్జి నరసింహారావుతో కలిసి పిడపర్తి రవి మాట్లాడుతూ గత 30 ఏండ్ల పాటు ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని నేనే చేస్తున్నానని చెప్పుకుంటూ రెండో వైపు సీఎం ఎ.రేవంత్ రెడ్డి వర్గీకరణపై ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే తట్టుకోలేక ఆ క్రెడిట్ తనకు రాదని, కాంగ్రెస్ సీఎంకు పోతుందని మంద కృష్ణ మాదిగ ఇప్పుడు నేతకానీ కులస్తులపై తుపాకి పెట్టి మాదిగ జాతిని కాల్చుతున్నాడని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ డా.పిడమర్తి రవి విమర్శించారు. నేడు క్యాబినెట్‌లో రిపోర్టును మళ్లీ యధావిధిగా ఆమోదించడం అభినందనీయమన్నారు. కృష్ణ మాదిగ ఎన్ని కుట్రలు చేసిన ఆయన ట్యాంక్ బండ్‌లో దూకిన వర్గీకరణ ఆగదని ఎద్దే వా చేశారు. వర్గీకరణ చట్టమైన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా మాదిగల కృతజ్ఞత యాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ యాత్ర 10 రోజుల పాటు 33 జిల్లా కేంద్రాల్లో జరగనున్నట్లు ఆయన వెల్లడించారు. వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రోజు మాదిగలు మండల, నియోజకవర్గ స్థాయిలో సీఎం ఎ.రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ సభలు, సమావేశాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మీసాల మల్లేష్, మాదిగ ఎన్డీఎస్ఎస్ జాతీయ ఉపాధ్యక్షులు బుదల బాబురావు, కె.ఎస్.బాబు, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు నక్క మహేష్, మాదిగ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జెర్రిపోతుల సాయన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు వరలక్ష్మి, రాష్ట్ర నాయకులు మారపాటి సాయిలు, నంగనూరు వేణుగోపాల్, టీకేయూఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్, దేవరకొండ నరేష్, జోగు గణేష్, చిలకమ్మారీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సీపీఐకి అవకాశం వస్తే.. బీసీలకే ఇవ్వాలి



నవతెలంగాణ-ఓయూ

ఎమ్మెల్సీగా సీపీఐకి అవకాశం వస్తే ఆ అవకాశం బీసీలకే ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య దర్శి జాజుల లింగంగౌడ్ సీపీఐ జాతీయ, రాష్ట్ర నాయకత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. కమ్యూనిస్ట్ పార్టీలో బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు వాళ్ళ భుజాలు కాయలు కాసేలా జండాలు మోసారని, ఎంతో మంది కేసుల పాలయ్యారని, త్యాగాలు చేశారన్నారు. 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు సీపీఐ గౌరవించి గౌరవప్రదంగా ఆ యొక్క ఎమ్మెల్సీ సీటును మొదటి నుంచి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఒక బీసీ బిడ్డకు ఇచ్చి సామాజిక న్యాయం పాటించాలని లింగంగౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం ఓయు ఇన్‌చార్జి రవీందర్ పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతికీ ప్రభుత్వం అహర్నిశలు కృషి

స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళా అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రభుత్వ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రెండు రోజులపాటు జరుగు ఈ వేడుకలకు స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, మహిళా చైర్ పర్సన్ దీపారెడ్డి, కన్వీనర్ విజయ సుజాత, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏటరి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివాసేన రెడ్డి, అద్దంకి దయాకర్ మాట్లాడుతూ మహిళా అభ్యున్నతి కోసం కాంగ్రెస్ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళా పక్షపాతిగా కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కేంద్రాలు సృష్టించి ఆర్థికంగా ఎదిగేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రామారావు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వినోద్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంపీ కృష్ణ యాదవ్, సంగారెడ్డి వైద్యనాథ్ తదితరులున్నారు.

జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జీవో నెంబర్ 60 ప్రకారం నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. అతి తక్కువ వేతనాలు చెల్లించటం అన్యాయమని, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జీవో నెంబర్ 60 ప్రకారం రూ.22,750ల వేతనం రావాల్సిండగా వారికి కేవలం రూ.15 వేలు మాత్రమే చెల్లించటం ఎన్‌హెచ్‌ఎం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గురువారం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయుసీ) ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌లతో కలిసి కోఠిలోని ఎన్‌హెచ్ ఎం డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి అన్ని ఆన్‌లైన్ పనులు చేయటం జరుగుతుందన్నారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ ఆర్‌వి.కర్ణన్‌ను కలిసి ఈ ఉద్యోగుల సమస్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, వర్కింగ్ ప్రెసిడెంట్ సారంగుల బాలసుబ్రమణ్యం, డాటా ఎంట్రీ ఆపరేటర్లు రాష్ట్ర నాయకులు బత్తుల రాఘవేంద్ర, అఖిల్ గౌడ్, వంగ స్వాతి, ప్రవీణ్, శ్రీదేవి, సౌజన్య, శ్రీకాంత్, ఇమ్రాన్, సౌమిత్రి, ప్రవీణ, సిద్దు, నాగార్జున, రాజశేఖర్, అనిత కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మెన్ సుల్తాన్ యాదగిరి, సీనియర్ జర్నలిస్ట్ షోయబ్ ఉల్లాఖాన్, జేఏసీ సెక్రటరీ జనరల్ టీ ప్రఫుల్ రాంరెడ్డి అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ది గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే సందర్భంగా తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం కే.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టులను గత ప్రభుత్వం విస్మరించిందని, రేవంత్ ప్రభుత్వం వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో లారీలు, తూటాలను లెక్క చేయకుండా జర్నలిస్ట్‌లు కవరేజ్ చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు లక్ష్మికాంతం, చర్చల చంద్రన్న ప్రసాద్, డోలక్ యాదగిరి, పెద్ద యాదగిరి, అంజలి, జర్నలిస్టులు పి. కరుణాకర్, బి శ్రీనివాస్, నర్సింహా, అఖిలేష్, ఎం కిరణ్, సత్యం, గణేష్, సీహెచ్ .శేఖర్, అనిల్, శ్రీధర్, రహీమ్, విజయ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

'ఆదాయపు పన్ను బిల్లును స్వాగతిస్తున్నాం'

- ఐసీఎంఏఐ హైదరాబాద్ ఛాప్టర్ చైర్ పర్సన్ సీఎంఏ డా.కందూరి లావణ్య



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఆదాయపు పన్ను బిల్లును తాము స్వాగతిస్తున్నామని ఐసీఎంఏఐ హైదరాబాద్ ఛాప్టర్ చైర్ పర్సన్ సీఎంఏ డా.కందూరి లావణ్య అన్నారు. గురువారం హిమాయత్ నగర్‌లోని సీఎంఏ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లావణ్య మాట్లాడుతూ ఇది సులభతర వ్యాపారానికి, పన్ను చెల్లింపుదారులకు అనుకూలమైన పన్ను వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ నిబద్ధతను స్పష్టంగా తెలియజేస్తుందన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాకారం చేసేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నామన్నారు. ఆదాయ పన్ను బిల్లు 2025లోని సెక్షన్ 515(3)(బీ) ప్రకారం 'అకౌంటెంట్' నిర్వచనంలో 'కాస్ట్ అకౌంటెంట్'ను చేర్చాలని, లోక్‌సభకు సమగ్రమైన మెమోరాండం సమర్పించామని తెలిపారు. ప్రస్తుతం ఆదాయపు పన్ను చట్టంలో టాక్స్ ఆడిట్ అనేది నిజమైన ఆడిట్ కాదని, ఇది ఇప్పటికే ఆడిట్ చేయబడిన ఆర్థిక నివేదికల నుంచి పన్ను సంబంధిత డేటాను సంకలనం చేయడమేనని, సుప్రీంకోర్టు సివిల్ కేసు 29 (2021)లో పేరా 27లో పేర్కొన్న ప్రకారం సీఎంఏలు సమర్థంగా సంకలనం చేయగల సామర్థ్యం కలిగి ఉంటారన్నారు. 2025 ఆదాయపు పన్ను బిల్లు, సెక్షన్ 515(3)(బీ)లోని 'అకౌంటెంట్' నిర్వచనంలో సీఎంఏలను చేర్చాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీఎంఏఐ హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి సీఎంఏ ఖాజా జలాలుద్దీన్, ఐసీఎంఏఐ కేంద్ర మండలి సభ్యులు సీఎంఏ డాక్టర్ కేసీహెచ్ ఏవీఎస్ఎన్ మూర్తి ఉన్నారు.

13 నుంచి 19 వరకు 'వరల్డ్ రోటరాక్టు డే' యువజనోత్సవాలు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వరల్డ్ రోటరాక్టు డే సందర్భంగా ఈ నెల 13 నుంచి 19 వరకు రెండు తెలుగు రాష్ట్రాలలో యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామని ప్రముఖ ఇంద్రజాలికుడు, రోటరీ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ యూత్ చైర్మెన్ టి.విజయకాంత్ వెల్లడించారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టి. విజయకాంత్ మాట్లాడుతూ మద్యం, గంజాయి, పొగాకు అనేవి యువత ఎక్కువగా ఉపయోగించే మూడు మాదకద్రవ్యాలను దూరం చేయడానికి, మంచి ఆహారాలు, క్రమం తప్పకుండా వ్యాయామం, క్రీడలతో జీవితానికి ఆరోగ్యకరమైన విధానాన్ని ప్రోత్సహించడానికి యువతకు వరల్డ్ రోటరాక్టు డే సందర్భంగా అవగాహనా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, వీటితో పాటు యువతులకు సాధికారతపై సదస్సులు, మురికివాడలలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు, పిల్లలకు మ్యాజిక్, క్రీడలు, సాంస్కృతిక టాలెంట్ షోలు వారం రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. 19న హైదరాబాద్ హిమాయత్ నగర్ సరిగా పాలస్ లో ముగింపు సభ ఉంటుందని, ఇందులో రోటరాక్టు ఆర్టిస్ట్ ఏరియా క్లబ్ ప్రారంభంతో పాటు మ్యాజిక్ షోలు, సినీ ఆర్టిస్టులతో ప్రదర్శనలు ఉంటాయని, ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా.ద్వారకానాథ్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో రోటరీ క్లబ్ భాగ్యనగర్ ఇమ్మీడియేట్ అధ్యక్షులు ఆదినారాయణ, పాస్ట్ ప్రెసిడెంట్ జి.సురేందర్ రెడ్డి, సతీష్‌రెడ్డి, ఎగ్ బ్యాంకు ఫౌండర్ వాల్మీకి హరికిషన్, అవసరం ఫౌండేషన్ అధ్యక్షులు టి.కృష్ణమూర్తి, ఇలేగాంట్ కంపెనీ సీనియర్ డైరెక్టర్ పసుపులేటి గోపాల్, సినీ ఆర్టిస్ట్ షానీ సోలొమన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఆసక్తి గలవారు ఈ 9848061312 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవలసిందిగా కోరారు.

కవులు, కళాకారులకు కీర్తి పద్మ పురస్కారాల ప్రధానం



నవతెలంగాణ-ముషీరాబాద్

అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'చేనేత కళా వెలుగులు' శీర్షికన కవి సమ్మేళనం గురువారం బాగ్‌లింగంపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవులు తమ కవితల్ని వినిపించి ఆహుతుల్ని అలరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అర్హులైన కళాకారులకు, కవులకు కీర్తిపద్మ పురస్కారాలను అందజేశారు. కూచిపూడి నాట్యంలో మాస్టర్స్ డిగ్రీ చేసిన నాట్య గురువు కుమారి బి. వేద శ్రీని కీర్తి పద్మ పురస్కారంతో సత్కరించారు. కుమారి వేద శ్రీ కూచిపూడి నాట్యంలో మాస్టర్స్ డిగ్రీ చేసి అనేక నాట్య ప్రదర్శనలు ఇస్తున్నారు. సిలికాన్ ఆంధ్ర-యూఎస్ఏ, ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా నిర్వహించిన 5వ ఐకేడీసీలో ప్రపంచ గిన్నిస్ రికార్డ్ స్థాపించారు. ట్రిబుల్ ఐటీ బాసరలో బెస్ట్ కొరియో గ్రాఫర్, చిలకలూరిపేటలో జరిగిన కార్యక్రమంలో నాట్య మయూరి బిరుదును అందుకున్నారు. నోవాటెల్‌లో జరిగిన జీ- 20 సదస్సులో మాధురి, రాజభవన్‌లో బంజారా నృత్య కార్యక్రమం చేశారు. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఉచిత వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మా సత్యనారాయణ, ఎస్.రవికుమార్, జె.బి.రాజు. అమృత్ కుమార్ జైన్, రామకృష్ణ చంద్రమౌళి, సరోజినీ దేవి, భారతి తదితరులున్నారు.

అధికారం శాశ్వతం కాదు

- యువ నాయకులు మైలారం సాయిరాం



నవతెలంగాణ-అంబర్‌పేట

అధికారం ఎవరికి శాశ్వతం కాదని ప్రజా ప్రతినిధులు నాయకులు తెలుసుకోవాలని అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన మైలారం సాయిరాం అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్‌లను శంకుస్థాపనకు పిలవకుండా ఎలా ప్రారంభిస్తారని అంబర్‌పేట నియోజకవర్గానికి జరిగిన అవమానకరమని ఇవాళ ఈ ప్రభుత్వం మరల మరో ప్రభుత్వం ఉండొచ్చు కానీ ప్రోటోకాల్ తప్పనిసరి పాటించాలని సూచించారు.

బాలికల విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం..

- వైద్య ప్రజారోగ్య అదనపు డైరెక్టర్ కాకుమాను శశిశ్రీ..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బాలికల ఉన్నత విద్యతోనే మహిళా సాధికారత సాధ్యపడుతుందని తెలంగాణ వైద్య ప్రజా ఆరోగ్య అదనపు డైరెక్టర్ కాకుమాను శశి శ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ప్రజారోగ్యశాఖ ఫిమేల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.మహాలమ్మ ఆధ్వర్యంలో గురువారం కోఠి సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ భాషానిలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజల్వన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకాశమే హద్దుగా ఎదిగిన, ఎదుగుతున్న మహిళామణులను స్ఫూర్తిగా తీసుకుని నేటి విద్యార్థినులు, యువతులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని ఛేదించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ జానకి మాట్లాడుతూ గృహిణులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మహాలమ్మ మాట్లాడుతూ రాష్టంలో మహిళల భద్రతపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ విజయనిర్మల, నేషనల్ అథ్లెటిక్ ఫ్రాన్సెసమ్మ, అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి రమాదేవి, కోశాధికారి సక్కుబాయి, నాయకురాళ్లు కె ప్రమీళ, ఎస్.మల్లేశ్వరి, రాజశ్రీ, పద్మావతి, భాగ్యలక్ష్మి, వసంత, ప్రభావతి, రాజమణి, ఉమా మహేశ్వరి, ఖుర్షీదా బేగం, పైడి విజయ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ మహిళలు తమ సత్తా చాటుతున్నారు. సమాజంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా అటు ఇంటి పనులకు, ఇటు ఉద్యోగ బాధ్యతలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల కాలంలో ఉద్యోగం, సంబంధిత కార్యకలాపాలలో పురుషులతో పాటు మహిళల భాగస్వామ్యమూ పెరిగింది. నిజం చెప్పాలంటే పురుషుల కన్నా ఎక్కువ సమయాన్నే కేటాయిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతల రీత్యా ఇంటి పనులకు కేటాయించే సమయం కాస్త తగ్గినా.. పురుషులతో పోలిస్తే అదీ చాలా ఎక్కువగానే ఉన్నది. ఇవేవే ఊహించి చెబుతున్న విషయాలు కాదు. గతేడాదికి 15-59 ఏండ్ల వయసుగల వారితో జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) జరిపిన 'టైమ్ యూజ్ సర్వే'లో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

భారాలన్నీ మోస్తూ..



అబలవు కావమ్మ...

అబలవు కావమ్మ...
అబలవు కావమ్మ నీవు సబలవు మాయమ్మ
పితృస్వామ్యాన్ని గెలిచి నిలిచినా యుక్తివి నీవమ్మా ..!
ఆది పరా శక్తివి మాయమ్మ

మతాల గురువులు అందరూ
నీది అధమ స్థానమని ఘోషిస్తే
అన్నిటినీ నువ్వు తోసిరాజని తోవ చూపినావు!
మహిళల వెన్నుతట్టినావు!



బాల్యం చిదికిందా..! కౌమారం కాటేసిందా!
కుటుంబం వంచించిందా! సమాజం వెలివేసిందా
కుటుంబ కాటును సమాజ వేటును సవాలు చేసావు!
దగా చేసిన దుష్ట శక్తిపై బాణం విసిరావు
గురి తప్పక కొట్టావు
అబలవు కావమ్మ నీవు సబలవు మాయమ్మ

చట్టాల దెప్పి పోట్లు చట్టాల వెన్ను పోట్లు
కడుపు కోత పాట్లు ఆచారపు అగచాట్లు
సాక్ష్యం నిలువక మోక్షం కలుగక బోనులో నిలిచావా
చట్టం కోరల్లో చిక్కుక నువ్వు విలవిల లాడావా
బలిపీఠమె ఎక్కావా
అబలవు కావమ్మ నీవు సబలవు మాయమ్మ

ఎంచుకున్న రంగంలో ఘన కీర్తిని చాటావు
పరాభవాల్ని పరాక్రమంతో పార ద్రోలి నావు
కల్లోల కడలిలో దరికి చేరిన కథానాయికమ్మ
హర్డిల్స్ దాటి ఫైనల్స్ చేరిన ఛాంపియనువమ్మా
ప్రపంచ కప్పును పైకి లేపిన
జగజ్జేతవమ్మా..
నీవు జగజ్జేతవమ్మా..

- ఎస్.ఎ.సమద్, 9160100486

కావ్య బ్యాంక్ ఉద్యోగం చేస్తోంది. భర్త ఓ పెద్ద కంపెనీలో హెచ్.ఆర్ మేనేజర్. వీరికి ఇద్దరు పిల్లలు. కావ్య తన పనితో బ్యాంక్‌లో మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకుంది. ఉదయం ఇంటి పనులు చేసేందుకు ఓ సహాయకురాలిని పెట్టుకుంది. వంట మాత్రం తనే చేసుకుంటుంది. సాయంత్రం బ్యాంక్ నుండి వచ్చిన వెంటనే పిల్లల హోం వర్క్‌లు, స్నాక్స్, రాత్రి భోజనం, రేపటి కోసం టిఫెన్లు, వంట ఏర్పాటు, బట్టలు మడతపెట్టుకోవడం ఇలాంటి పనులన్నీ పూర్తి చేసుకుంటుంది. భర్త మాత్రం ఎప్పుడో తాపీగా ఇంటికి వచ్చి ప్రశాంతంగా కాసేపు టీవీ చూసి, మరికొంత సేపు ఫోన్ చూసుకొని తినేసి పిల్లలకు హాయ్, బాయ్ చెప్పి పడుకుంటాడు.

సునీత ఓ బట్టల షాప్‌లో సేల్స్ గర్ల్‌గా పని చేస్తుంది. ఒక బాబు ఉన్నాడు. భర్త చిన్న కంపెనీలో చిరు ఉద్యోగి. ఉదయం 9 గంటలకు సునీత వెళ్లి షాప్ ఓపెన్ చేయాలి. కనీసం గంట ముందైనా బయలు దేరాలి. అంటే ఎనిమిది గంటకల్లా ఇంట్లో అన్ని పనులు పూర్తి చేసుకొని, బాబును స్కూల్ టైం కన్నా అరగంట ముందే అక్కడ వదిలేసి హడావుడిగా వెళ్ళిపోతుంది. భర్త మాత్రం లంచ్ బాక్స్ తీసుకొని ప్రశాంతంగా వెళ్ళిపోతాడు. మళ్లీ రాత్రి తొమ్మిది గంటలకు ఇల్లు చేరుతుంది. అప్పటి వరకు బాబును ఆమె తల్లి చూసుకుంటుంది. ఇంటికి వచ్చి రాత్రి వంట, బాబు హోమ్ వర్క్, రేపటి కోసం ఏర్పాట్లు అంతా మామూలే... ఇలా అన్నింటికీ న్యాయం చేస్తూనే కుటుంబానికీ ఆర్థికంగా తన వంతు అండగా నిలబడుతుంది. కానీ భర్త మాత్రం ఆమెకు ఒక్క పనిలో కూడా సాయం చేయడు.

పైన చెప్పింది కేవలం రెండు ఉదాహరణలు మాత్రమే. బాగా చదువుకొని మంచి స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్న మహిళలైనా.. అంతంత మాత్రం చదువుకొని చిరు ఉద్యోగాలు చేస్తున్నా...అసలు ఏమీ చదవకుండా కూలీ పనులకు పోతున్నా మహిళలందరూ ఇల్లు ఇల్లూ, అటు వృత్తి రెండింటికీ న్యాయం చేస్తున్నారు. అంటే ఏ బాధ్యతనూ విస్మరించకుండా, భారాలన్నీ మోస్తూనే సమాజంలో తామేంటో నిరూపించుకుంటున్నారు. ఈ వాస్తవాలనే 'టైమ్ యూజ్ సర్వే' బయట పెట్టింది.

సర్వే జరిగింది ఇలా...

వివిధ పనులపై వ్యక్తులు వెచ్చించిన సమయాన్ని ఈ సర్వే వివరించింది. ఈ సర్వేలో భాగంగా 1,39,487 ఇండ్లను కవర్ చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 83,247 ఇండ్లు, పట్టణ ప్రాంతాల నుంచి 56,240 ఇండ్లు ఉన్నాయి. ఆరేండ్ల వయసు పైబడినవారు 4,54,192 మంది సర్వేలో పాల్గొన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 2.85 లక్షల మందికి పైగా, పట్టణ ప్రాంతాల నుంచి 1.68 లక్షల మందికి పైగా ఉన్నారు.

రోజుకు 305 నిమిషాలు

ఈ సర్వే ప్రకారం ఏదో ఒక వృత్తిలో భాగస్వామ్యం అవుతున్న మహిళల సంఖ్య పెరిగింది. వృత్తి చేస్తున్న మహిళల సంఖ్య 2019లో 21.8 శాతంగా ఉంటే.. 2024 నాటికి అది 25 శాతానికి చేరింది. అలాగే పురుషులకు సంబంధించి 2019లో 70.9 శాతంగా ఉన్న భాగస్వామ్యం.. గతేడాది 75 శాతానికి పెరిగింది. ఎటువంటి ఆదాయం పొందని ఇంటి సేవలకు మహిళలు వెచ్చించిన సమయం 2019లో రోజుకు 315 నిమిషాలు ఉండగా.. అది గతేడాదికి 305 నిమిషాలకు తగ్గింది. పురుషులతో పోలిస్తే ఇది కూడా చాలా ఎక్కువే అని చెప్పొచ్చు. అంటే మహిళలు ఎలాంటి ఆదాయాన్ని పొందని ఇంటి సేవల నుండి ఉద్యోగ, ఉపాధి కార్యకలాపాల వైపునకు మళ్లారని దీని ద్వారా అర్థమవుతుందని మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ తెలియజేస్తోంది.

ఉద్యోగ ఉపాధికి 341 నిమిషాలు

ఈ సర్వే ప్రకారం మహిళలు ఇంటి పనులతో పాటు ఉద్యోగ, ఉపాధి సంబంధిత పనులకూ ప్రాధాన్యతనిస్తున్నారు. 2024లో ప్రజలు ఇందుకు రోజుకు 440 నిమిషాలు వెచ్చించారు. పురుషుల విషయంలో ఇది 473 నిమిషాలుగా ఉండగా.. మహిళలకు సంబంధించి 341 నిమిషాలుగా ఉన్నది. మహిళలు ఇంట్లో వారి కోసం గృహ సేవల్లో రోజుకు 289 నిమిషాలు పని చేశారు. ఇది పురుషుల విషయంలో 88 నిమిషాలే కావటం గమనార్హం.

కుటుంబ సంరక్షణలో ఆమెనే ముందు

కుటుంబాలకు మహిళ ఇచ్చే ప్రాధాన్యం ఎలా ఉంటుందో ఈ సర్వే ద్వారా మరోసారి వెల్లడైంది. ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ ఇంట్లోవారి సంరక్షణ విషయంలో కూడా మహిళల భాగస్వామ్యంతో పాటు వారు వెచ్చించే సమయం కూడా పురుషులతో పోలిస్తే దాదాపు రెండు రెట్లు ఎక్కువగానే ఉన్నది. కుటుంబీకుల సంరక్షణ కోసం మహిళలు 137 నిమిషాలు, పురుషులు 75 నిమిషాలు వెచ్చిస్తున్నారని సర్వే చెబుతోంది. 15 ఏండ్లకు పైబడిన దాదాపు 41 శాతం మంది మహిళలు వారి కుటుంబీకుల సంరక్షణలో పాలు పంచుకున్నారు. ఇది పురుషుల విషయంలో 21.4 శాతం మాత్రమే ఉంది. సంరక్షణ కార్యకలాపాలకు మహిళలు రోజుకు 140 నిమిషాలు కేటాయిస్తే.. పురుషులు మాత్రం 74 నిమిషాలకే పరిమిత మయ్యారు. కుటుంబీకుల సంరక్షణ బాధ్యతను మహిళలే చూసుకుంటున్నారన్న వాస్తవాన్ని ఈ లెక్కలు తెలియజేస్తున్నాయని సంబంధిత మంత్రిత్వ శాఖ అంటుంది.

నేర్చుకోవటానికి 413 నిమిషాలు

సర్వేలో పాల్గొన్నవారిలో దాదాపు 16.8 శాతం మంది తమ అవసరాల కోసం వస్తువులను ఉత్పత్తి చేయటంలో పాలు పంచుకున్నారు. ఇందుకు రోజులో 116 నిమిషాలు వెచ్చించారు. ఆరు నుంచి 14 ఏండ్ల మధ్య వయసున్న చిన్నారులు రోజుకు 413 నిమిషాలు నేర్చుకోవటానికి సంబంధించిన పనులపై వెచ్చించారు. ఆరేండ్లు, అంత కంటే ఎక్కువ వయసున్నవారు రోజుకు 171 నిమిషాలు సంస్కృతి, విశ్రాంతి, మాస్ మీడియా ఉపయోగంపై గడిపారు. ఈ అంశాలపై పురుషులు 177 నిమిషాలు, మహిళలు 164 నిమిషాలు వెచ్చించారని ఈ సర్వే తెలిపింది.

భాగం పంచుకుంటే...

ఈ సర్వేను సమగ్రంగా పరిశీలించి నపుడు.. ఇంట్లో మగవారు కూడా ఇంటి బాధ్యతల్లో సమభాగం పంచుకుంటే మహిళలు మరింతగా తమ వృత్తుల్లో రాణించడం ఖాయం. ఈ విషయాన్ని మగవారు గుర్తించాల్సిన అవసరాన్ని కూడా ఈ సర్వే తెలియజేస్తోంది. ఏది ఏమైనా అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముందు ఇలాంటి సర్వేను విడుదల చేసి, మహిళల శ్రమను, నైపుణ్యాన్ని ప్రపంచం గుర్తించేలా చేసిన మంత్రిత్వ శాఖకు ధన్యవాదాలు చెప్పాల్సిందే. అలాగే ఇంటి బాధ్యతల విషయంలో కూడా మగవారు భాగం పంచుకు నేలా అవగాహన కల్పించే చర్యలు కూడా చేస్తే మరీ మంచిది. అలాగే ఇంటి పని, కుటుంబంలో వారికి సేవలు చేసే పని కేవలం తమదే అనే భావనలో ఉన్న మహిళల్లో కూడా కొంత మార్పు రావాలని, భర్తల బాధ్యత కూడా ఇందులో ఉంటుం దనే విషయాన్ని గుర్తించాలని ఈ మహిళా దినోత్సవం సందర్భంగా కోరుకుందాం... ■

ట్రంప్‌నకు తలొగ్గిన భారత్!

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టమవుతోంది. ముందుగా ట్రంప్ సన్నిహితుడైన మస్క్‌ను ప్రసన్నం చేసుకుంటే..ఆ తర్వాత ట్రంప్ గురించి ఆలోచించవచ్చన్న ధోరణి కేంద్రంలో కనిపిస్తోంది. అమెరికాలో అదానీ లంచాల కేసులకు బ్రేకు పడితే..ఇటు మస్క్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవటానికి అనుమతిచ్చేలా దోస్తానా నడుస్తోందని తెలుస్తోంది. అందులోభాగంగా ప్రస్తుతం కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్ తన అధికారుల బృందంతో అమెరికాలో వారం పాటు పర్యటిస్తున్నారు. ఇప్పటికే ఆయన అమెరికా వాణిజ్య మంత్రి హువార్డ్ లుట్నిక్‌తో భేటీ అయ్యారు. ఒక్కటి రెండు రోజుల్లో వాణిజ్య ప్రతినిధి గ్రీర్‌తో సమావేశం కానున్నారు. అమెరికా- భారత్ మధ్య సుంకాలపైనే ప్రధాన సంప్రదింపులు జరుగుతున్నాయి. ప్రస్తుతం భారత్ కార్ల దిగుమతిపై 110శాతం సుంకాలు అమలు చేస్తోంది. వీటిని ఎత్తివేయాలని ఎలన్ మస్క్ భారత్‌పై అనేక సార్లు బహిరంగానే ఒత్తిడి చేశారు. ట్రంప్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగిన ఎలన్ మస్క్ ప్రస్తుతం అమెరికాలోని డోజ్ విభాగానికి సారథ్యం వహిస్తున్నారు. ట్రంప్ కూడా భారత్‌ను ఆటో టారిఫ్‌లపై తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇటీవల ఆ దేశ కాంగ్రెస్‌లో మాట్లాడుతూ ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఈనేపథ్యంలో ఆటో మొబైల్ రంగంపై జీరో టారిఫ్ అమలును ట్రంప్, ఎలన్ మస్క్ డిమాండ్ చేస్తున్నారు. కాగా.. ప్రస్తుత పీయూశ్ గోయల్ చేస్తోన్న సంప్రదింపుల్లో అమెరికా డిమాండ్‌లకు తలొగ్గితే భారత వాహన పరిశ్రమకు పెను ప్రమాదం ఎదురు కానుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముంబయిలో షోరూం కోసం ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న జరిగింది. టెస్లా కంపెనీ భారత్‌లో తన కార్యకలాపాలను ప్రారంభించడానికి వీలుగా 13 మంది ఉద్యోగుల భర్తీకి గాను ఇటీవలే ప్రకటన విడుదల చేసింది. టెస్లా కార్ల ధరల శ్రేణీ రూ.21 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. వీటిని బెర్లిన్ ప్లాంట్ నుంచి దిగుమతి చేయనుందని తెలుస్తోంది. కాగా.. టెస్లాకు భారత్‌లో అవకాశాలు కల్పిస్తే.. ఇక్కడి వాహన కంపెనీలు ఎంత వరకూ పోటీని ఎదుర్కొగలవో వేచి చూడాలి.

పాకిస్తాన్, ఆఫ్ఘన్‌పై అమెరికా ట్రావెల్ బ్యాన్..?

శ్వేతసౌధం: దేశీయంగా ఉద్యోగాల కోత, విదేశాలపై సుంకాల విధింపుతో దూకుడుగా వ్యవహరిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పలు దేశాల నుంచి వచ్చే వారిపైనా నిషేధం విధించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా పాకిస్తాన్ , అఫ్ఘానిస్థాన్‌లపై ట్రావెల్ బ్యాన్ విధించే అవకాశం ఉన్నట్టు సమాచారం. భద్రతా కారణాల దృష్ట్యా ట్రంప్ యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకోనుందని, వచ్చే వారమే ఇది అమల్లోకి రానున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడైన సమయంలోనూ కొన్ని ముస్లిం దేశాల పౌరులను అమెరికాలోకి అనుమతించడంపై నిషేధం విధించారు. అనేక పరిశీలన అనంతరం 2018లో అక్కడి సుప్రీం కోర్టు కూడా ఆ నిర్ణయాన్ని సమర్థించింది. అయితే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జో బైడెన్ సర్కార్.. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేసింది.

అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. అనేక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. ఇందులో అమెరికాలోకి ప్రవేశించే విదేశీయులను నుంచి జాతీయ భద్రతా ముప్పు పొంచి వుందా అన్న విషయాన్ని ముందే గుర్తించే కార్యనిర్వాహక ఆదేశంపైనా సంతకం చేశారు. దీని ప్రకారం, పాక్షికంగా లేదా పూర్తిగా ప్రయాణ నిషేధం విధించాల్సిన దేశాల జాబితాను రూపొందించి మార్చి 12లోగా సమర్పించాలని క్యాబినెట్ సభ్యులను ఆదేశించారు. ఇందులో భాగంగా పూర్తిగా నిషేధం కోసం సిఫారసు చేసిన జాబితాలో అఫ్ఘానిస్థాన్ ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ జాబితాలో పాకిస్థాన్‌ను కూడా చేర్చనున్నట్టు సమాచారం.

అఫ్ఘాన్‌లో దాదాపు రెండు దశాబ్దాల పాటు ఉన్న అమెరికా సేనల కోసం పని చేసిన స్థానికులపై తాలిబన్లు ప్రతీకారం తీర్చుకోనున్నారనే భయాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో వేలాది మంది అఫ్ఘన్ పౌరులు అమెరికాలో శరణార్థులు లేదా ప్రత్యేక వలసవాదుల కింద వీసా పొందారు.

లగచర్ల, హకీంపేట్ భూసేకరణపై హైకోర్టు స్టే

(మొదటిపేజీ తరువాయి)

విన్న తర్వాత ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం రాష్ట్ర సర్కార్ గత ఏడాది నవంబర్‌లో ఇచ్చిన నోటిఫికేషన్లను గోపాల్ నాయక్, శివకుమార్ ఇతర రైతులు సవాలు చేసిన పిటిషన్లను గురువారం జస్టిస్ శ్రీనివాస్ రావు విచారణ అనంతరం స్టే ఉత్తర్వులను వెలువరించారు.

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో 110 ఎకరాలు, హకీంపేటలో 351ఎకరాల చొప్పున భూమిని సేకరించే నోటిఫికేషన్లలో 'అత్యవసరం' అని ఉందనీ, ఆ అత్యవసరం ఏమిటో నోటిఫికేషన్‌లో వివరించక పోవడం చట్ట వ్యతిరేకమనీ, రైతులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించేలా ఉందని పిటిషనర్ల లాయర్లు వాదించారు. గతంలో ఫార్మా సిటీ ఏర్పాటు నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం రైతుల వ్యతిరేకతతో రద్దు చేసుకుందనీ, ఆ తర్వాత వారం రోజులలోపే ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో నోటిఫికేషన్లు ఇచ్చిందని అన్నారు. 1,177 ఎకరాల్లో 534 ఎకరాలు ప్రభుత్వానికి చెందినవి మినహా లగచర్లలో 110 ఎకరాలు, హకీంపేటలో 351 ఎకరాలు సేకరించడానికి నోటిఫికేషన్లు జారీ చేసిందన్నారు. ఆర్అర్ ప్యాకేజీ వంటివి కూడా ఏమిటో చెప్పలేదన్నారు. రైతులకు వివరాలు చెప్పకుండా ప్రభుత్వం గోప్యంగా ఉంచి అత్యవసరం పేరుతో భూమిని సేకరించడం రాజ్యాంగంలోని 14, 21 ఇతర అధికరణాలకు వ్యతిరేకమన్నారు. భూసేకరణ చట్టంలోని 10-ఎ ప్రకారం అత్యవసర భూసేకరణకు ఆస్కారం ఉన్నప్పటికీ ఆ అత్యవసరం ఏమిటో నోటిఫికేషన్‌లో లేకపోవడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు.

దీనిపై ప్రభుత్వ స్పెషల్ ప్లీడర్ స్పందిస్తూ, భూసేకరణ ప్రక్రియ చట్ట నిబంధనలకు అనుగుణంగా ఉందన్నారు. భూమిని తీసుకుంటే ఒక్కో ఎకరాకు రూ.20 లక్షలు చెల్లిస్తామనీ, ఆర్అర్ ప్యాకేజీ అమలు చేస్తామని, అర్హులకు ఉద్యోగ కల్పన చేస్తామనీ, ఇల్లు ఇస్తామనీ, ఇంటి స్థలం ఇస్తామని చెప్పారు. ఇందుకు పలువురు రైతులు సమ్మతిని చెప్పారన్నారు. స్టే అవసరం లేదన్నారు. వాదనల అనంతరం న్యాయమూర్తి, నోటిఫికేషన్‌లో పేర్కొన్న అత్యవసర భూమి సేకరణకు వివరణ ఇవ్వాలనీ, ఈ మేరకు కౌంటర్లు దాఖలు చేయాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, వికారాబాద్ జిల్లా కలెక్టర్, లగచర్ల ఆర్డీవో, దుద్యాల తహసీల్దార్, టీఎస్ఐఐసీలకు నోటీసులను జారీ చేశారు. తదుపరి విచారణను వచ్చే నెల 7కి వాయిదా వేశారు.

మధ్యప్రదేశ్‌లో ఖాకీ జులుం

భోపాల్ : బీజేపీ పాలనలోని మధ్యప్రదేశ్‌లో పోలీసులు రెచ్చిపోయారు. గోవధ కేసులో అరెస్టు చేసిన ఇద్దరు నిందితులపై ఖాకీలు జులుం ప్రదర్శించారు. పట్టపగలు బహిరంగంగా నడి రోడ్డుపై వారిని లాఠీలతో కొడుతూ సుమారు రెండు కిలోమీటర్లు నడిపించారు. దెబ్బలకు తాళలేక నిందితుల్లో ఒకరు కిందపడిపోయినా పోలీసులు వదల్లేదు. పైకి లేచిన తరువాత మళ్లీ కొట్టారు. పైగా నిందితుల చేత 'ఆవు మా తల్లి, పోలీసులు మా తండ్రి' అని బలవంతంగా నినాదాలు కూడా చేయించారు. ఈ నెల 3న ఉజ్జయినిలో జరిగిన ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని ఘటియా పోలీసు స్టేషన్ ప్రాంత పరిధిలో ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వీడియా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సంఘటన తరువాత ఘటియా పోలీసు స్టేషన్ సిబ్బందిని భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు సత్కరించడం విశేషం. దీనికి సంబంధించిన వీడియా కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమవుతుంది. దీంతో హిందుత్వ శక్తుల ప్రోత్సాహం, మెప్పు కోసమే పోలీసులు పని చేశారని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పోలీసులను సత్కరించడంపై స్థానిక విహెచ్‌పి నాయకుడు వినోద్ శర్మ మీడియాతో మాట్లాడుతూ 'సాధారణంగా మేం పోలీసుల్ని సత్కరించం. కానీ ప్రస్తుతం పోలీసులు ఈ ప్రాంతంలో గోవధ, గో అక్రమ రవాణాలో పాల్గొన్న వ్యక్తులను పట్టుకోవడంలో ప్రశంసనీయంగా పనిచేశారు. శిక్షించే విధానంలో మార్పు ఉండొచ్చుకానీ, మంచిపని చేసిన పోలీసులకు మనం కృతజ్ఞతలు తెలపాలి' అని అన్నారు. కాగా, ఎన్ని విమర్శలు వస్తున్నా.. పోలీసు అధికారుల మాత్రం ఈ ఘటనను తక్కువ చేసి చూపడానికి ప్రయత్నిస్తున్నారు. ఉజ్జయిని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ప్రదీప్ శర్మ మీడియాతో మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడాన్ని ధృవీకరించారు. అయితే నిందితుల్ని కొట్టడం, కవాతు చేయడంపై తనకు సమాచారం లేదని, విషయాన్ని తనిఖీ చేస్తానని చెప్పారు. అదనపు ఎస్‌పి గురుప్రసాద్ పరాసర్ మాట్లాడుతూ 'ఇది అంత తీవ్రమైన విషయం కాదు' అని అన్నారు. 'వీడియోలో చూపిస్తున్నట్లుగా వారిని కొట్టలేదు. ఒకటి, రెండు సార్లు కొట్టి ఉండవచ్చు' అని అన్నారు. 10 రోజుల క్రితమే గో వధ గురించి ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసామని చెప్పారు. నిందితులు గోవును కట్టేస్తున్నప్పుడే కొంత మంది వ్యక్తులు చూసి పట్టుకోవడానికి ప్రయత్నించారని, కానీ చీకటిని ఆసరా చేసుకుని పారిపోయారని తెలిపారు.

బందీలను విడుదల చేయకపోతే మీ అంతు చూస్తాం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గాజాపై బెదిరింపులకు దిగారు. మిగిలిన బందీలందరినీ తక్షణమే విడుదల చేయాలని, అలాగే ఇప్పటివరకు మీరు హతమార్చిన వారి మృతదేహాలను అప్పగించాలని లేనిపక్షంలో మీ అంతు చూస్తామని ట్రంప్ బుధవారం హమాస్ నేతలను బెదిరించారు. హమాస్ నేతలందరూ గాజా విడిచి పారిపోవాలని హుకుం జారీ చేశారు. గాజాపై విధ్వంసానికి దిగిన ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటిస్తూ, పని పూర్తి చేయడానికి ఇజ్రాయిల్‌కు అవసరమైన ఆయుధాలను పంపుతామని హామీ ఇచ్చారు.ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతా ట్రూత్‌లో పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన బందీలను కలిసిన తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. "ఇదే మీకు చివరి హెచ్చరిక. గాజాను వదిలి వెళ్లాల్సిన సమయం వచ్చింది" అని హమాస్ నేతలను బెదిరించారు. ' గాజా ప్రజల కోసం మంచి భవిష్యత్తు ఎదురు చూస్తోందని, కానీ మీరు బందీలను విడుదల చేయకుంటే గాజా అంతటా



పరిణామాలు తీవ్రంగా వుంటాయి.' అని అన్నారు.

మిగిలిన బందీలను హమాస్ అప్పగించకపోతే ఊహించలేని పరిణామాలు వుంటాయని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

కొట్టిపారేసిన హమాస్

ట్రంప్ తాజా బెదిరింపులను హమాస్ గురువారం కొట్టిపారేసింది. గాజాలో శాశ్వత శాంతి నెలకొంటేనే మిగిలిన బందీలను విడుదల చేస్తామని పునరుద్ఘాటించింది. జనవరిలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నుండి బయటకు వెళ్ళిపోవాలని ట్రంప్, నెతన్యాహులు ప్రయత్నిస్తున్నారని హమాస్ విమర్శించింది. మరింత మంది పాలస్తీనియన్ ఖైదీలను విడుదల చేసి, గాజాలో శాశ్వత కాల్పుల విరమణ, గాజా నుండి ఇజ్రాయిల్ బలగాల ఉపసంహరణ జరిగితే బందీలను విడుదల చేస్తామని, ఇందుకోసం రెండో దశ కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరగాలని ఆనాటి ఒప్పందం పిలుపిస్తోంది. రెండో దశపై చర్చలు జరపడమే మిగిలిన బందీల విడుదలకు ఉత్తమ మార్గమని హమాస్ ప్రతినిధి అబ్దుల్ లతీఫ్ అల్ కనువా తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలోనే ఈ చర్చలు జరగాల్సి వుందని, కానీ ఇప్పటివరకు కేవలం సన్నాహక చర్చలు మాత్రమే జరిగాయన్నారు. హమాస్ వద్ద ఇంకా 24మంది బందీలు సజీవంగా వున్నారని భావిస్తున్నారు. అలాగే హత్యచేసిన 34మంది బందీల మృతదేహాలు కూడా తన వద్దనే అట్టిపెట్టుకుంది.

ప్రాధాన్యతలు పట్టని భారతీయ మీడియా

(మొదటిపేజీ తరువాయి)

వంటపట్టించుకున్నట్లు కన్పిస్తున్నాయి. ఆయన ఏమన్నారంటే 'మానవులు వాస్తవాలను ఎక్కువగా భరించలేరు'. క్రికెటర్ రోహిత్ శర్మ గురించి కాంగ్రెస్ నాయకురాలు షామా మహమ్మద్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన వివాదాస్పద వ్యాఖ్య (ఆ తర్వాత దానిని తొలగించారు) మన మీడియా సంస్థలను అమితంగా ఆకర్షించింది. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక దీనిని ప్రముఖంగా ప్రచురించింది. అనేక టీవీ ఛానల్స్ చర్చా గోష్టులు నిర్వహించాయి. రోహిత్‌పై వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకురాలిపై యాంకర్లు విరుచుకుపడ్డారు. ఆమె వ్యాఖ్యలు అవమానకరంగా, అసహ్యంగా ఉన్నాయని రిపబ్లిక్ టీవీకి చెందిన అర్నబ్ గోస్వామి మండిపడ్డారు. ఆమెవి తప్పుడు దూషణలని సీఎన్ఎన్ న్యూస్ 18కి చెందిన రాహుల్ శివశంకర్ వ్యాఖ్యానించారు. మనలో చాలా మందికి క్రికెట్ అన్నా, భారత క్రికెట్ జట్టు అన్నా ఇష్టమే. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఓ క్రికెట్ అభిమాని వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని ఆ ఆటతో అనుబంధం, ఆ క్రీడాకారుల పట్ల ఆరాధనాభావం ఉన్న కారణంగా ఇంత పరుష పదజాలంతో ఖండించాల్సిన అవసరం ఉన్నదా? గోస్వామి మరో అడుగు ముందుకు వేసి 'ఇది అత్యంత తెలివితక్కువ వ్యాఖ్య. ఎన్నికల్లో పరాజయం పొందడం అనే ఒకే ఒక ఆట తెలిసిన రాజకీయ పార్టీ నుండి వచ్చిన నిరాశాజనకమైన అరుపు' అని అన్నారు. రోహిత్ శర్మను బాడీ షేమింగ్ చేసినందుకు టీవీ ఛానల్స్ అన్నీ షామా మహమ్మద్‌పై రోజంతా దాడి చేస్తూనే ఉన్నాయి. ఆమె ఆ పోస్టును తొలగించినప్పటికీ ఛానల్స్ రచ్చ రచ్చ చేశాయి. ఏం మాట్లాడుతున్నారో కూడా తెలియని విధంగా పరుష పదజాలంతో ఆమెను దూషించాయి. అసలు షామా వ్యాఖ్యలకు, కాంగ్రెస్‌కు సంబంధం ఏమిటి? ఆ పార్టీని లక్ష్యంగా చేసుకొని దాడి చేయాల్సిన అవసరమేమొచ్చింది? చివరికి సీను ఎలా మారిపోయిందంటే షామాను వదిలేసి కాంగ్రెస్ పైనే బురద చల్లడం మొదలెట్టారు. కెప్టెన్‌ను కాంగ్రెస్ ఎగతాళి చేసిందని సీఎన్ఎన్ న్యూస్ 18, ఇతర న్యూస్ ఛానల్స్ వ్యాఖ్యానించాయి. షామాను కాంగ్రెస్ పార్టీ క్షమాపణ కోరుతుందా అని ఎన్డీటీవీ ప్రశ్నించింది. అర్నబ్ గోస్వామి తన వ్యాఖ్యల ద్వారా పరోక్షంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై దాడి చేశారు.

వన్యప్రాణులకు భద్రత కరువు

(మొదటిపేజీ తరువాయి)

బ్రేకర్లు, సైన్ బోర్డులను నిర్మిస్తోందని మంత్రి చెప్పారు. అడవుల సమీపంలో ఓపెన్ బావుల కోసం గోడలు నిర్మిస్తోందన్నారు. గిర్ అభయారణ్యం సమీపంలో రైల్వే ట్రాక్‌ల వెంట కంచెలను, వాటి కదలికలను ట్రాక్ చేయడానికి రేడియో-కాలరింగ్ ఆసియాటిక్ సింహాలను ఏర్పాటు చేస్తోందని మంత్రి చెప్పారు. గాయపడిన సింహాలు, ఇతర అడవి జంతువులకు త్వరగా చికిత్స అందించడానికి అటవీ అధికారులకు పశువైద్య వైద్యులు, అంబులెన్స్ సేవలను ప్రవేశపెట్టారు. వన్యప్రాణుల సంరక్షణకు కావాల్సిన అన్ని చర్యలూ ప్రభుత్వం తీసుకోవాలని జంతుప్రేమికులు కోరుతున్నారు. లేకపోతే అడవుల్లో జంతు సమతుల్యత దెబ్బ తింటుందనీ, చివరకు అది పర్యావరణంపై ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ రైజింగ్ కాదు..ఫాలింగ్

(మొదటిపేజీ తరువాయి)

గుర్తుచేశారు. హైడ్రా, మూసీ వంటి తలా తోక లేని నిర్ణయాలు, అనాలోచిత చర్యల వల్ల 2024 ఆగస్టు తర్వాత రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా తగ్గిందని తెలిపారు. 2024 ఏప్రిల్-నవంబర్, 2023 ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో వాహన విక్రయాలు పోల్చితే -0.8 శాతం నమోదు అయినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ ఆదాయంలో తక్కువ వృద్ధి రేటు, రిజిస్ట్రేషన్ల, వెహికల్ ట్యాక్స్‌లో నెగెటివ్ వృద్ధి రేటు రేవంత్ రెడ్డి పాలన వైఫల్యాన్ని ఎండగడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణలు చెప్పి పాలన పై శ్రద్ధ వహించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

భాషా సమానత్వం కోరుకోవడం దురహంకారం కాదు

తమిళనాడు సీఎం స్టాలిన్



చెన్నై : భాషా సమానత్వాన్ని కోరుకోవడం దురహంకారం కాదని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. మాతృభాష అనే అంశం 'కందిరీగల తుట్టు' వంటిదని, దానిని తాకడం ప్రమాదకరమని గురువారం సోషల్ మీడియా పోస్టులో తెలిపారు. 'ప్రత్యేక హక్కులకు అలవాటు పడిన తర్వాత, సమానత్వం అణచివేతలా అనిపిస్తుంది' అని ఈ సందర్భంగా ఒక ప్రఖ్యాత కోట్‌ను గుర్తు చేశారు. తమిళనాడులో తమిళులకు సరైన స్థానం కోరడాన్ని నేరంగా పేర్కొంటూ కొంతమంది మతోన్మాదులు తమని దురహంకారులు, దేశవ్యతిరేకులుగా ముద్ర వేస్తుండటతో ఈ ప్రసిద్ధ కోట్ గుర్తుకు వచ్చిందని తెలిపారు. చైనా దురాక్రమణ, బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం, కార్గిల్ యుద్ధాల సమయంలో అత్యధిక మొత్తంలో నిధులు అందించిన డిఎంకె, ఆ ప్రభుత్వ దేశభక్తిని ప్రశ్నించే టెంపరితనాన్ని గాడ్సే భావజాలాన్ని కీర్తించే వ్యక్తులే ప్రదర్శిస్తున్నారని, 'బాపు గాంధీ'ని హత్య చేసిన వ్యక్తి వారి సైద్ధాంతిక పితామహుడని దుయ్యబట్టారు.

వాస్తవానికి, దురహంకారం ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే ఈ క్రింది ఉదాహరణలే నిదర్శనమని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల కోసం ఉద్దేశించిన మూడు క్రిమినల్ చట్టాలను తమిళులు ఉచ్చరించలేని, చదవలేని ఒక భాషలో రూపొందించడం దురహంకారమని అన్నారు. దేశానికి అత్యధికంగా దోహదపడే రాష్ట్రంలో పౌరులను రెండవతరగతివారిగా పరిగణించడ, ఎన్ఇపి అనే విషాన్ని మింగడానికి నిరాకరించినందుకు ఆ రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటాను నిరాకరించడం దురహంకారమని స్టాలిన్ తెలిపారు.

'దేనైనా బలవంతంగా రాష్ట్రాలపై రుద్దడంతో శతృత్వం పెరుగుతుంది. శతృత్వం ఐక్యతను దెబ్బతీస్తుంది. కావున తమకే హక్కుందనే భావించే హిందీ మతోన్మాదులే నిజమైన దురహంకారులు, దేశవ్యతిరేకులు. మన ప్రతిఘటనను దేశద్రోహమని ప్రచారం చేస్తారు' అని అన్నారు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 351ను ప్రస్తావిస్తూ మోడీ ప్రభుత్వం హిందీని ఇతర రాష్ట్రాలపై రుద్దేందుకు యత్నిస్తోందని, మరి నోట్లపై రాసిన అన్ని భాషలను భారతదేశ అధికారిక భాషగా చేయడానికి మోడీ ప్రభుత్వం ఎందుకు విముఖత చూపుతోందని స్టాలిన్ ప్రశ్నించారు.


త్రిభాష విధానం యావత్తు దేశానికి మంచిది : కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

నూతన విద్యా విధానం (ఎన్ఈపీ)లో త్రి భాష విధానం యావత్తు దేశానికి మంచిదని కేంద్ర మంత్రి రిజిజు తెలిపారు. దక్షిణ ప్రాంతంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కోసం ప్రధానమంత్రి జన్‌వికాస్ కార్యక్రమ్ (పీఎంజేవీకే) ప్రాంతీయ సమీక్ష, శిక్షణ వర్క్‌షాప్‌లో పాల్గొనడం కోసం తిరువనంతపురం వచ్చిన కేంద్ర మంత్రి ఇక్కడ విలేకరులతో మాట్లాడారు.

త్రిభాషా విధానంపై దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న వ్యతిరేకతపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ 'కొంతమంది తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని, రాజకీయాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని' చెప్పారు. ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్‌షా మాతృభాష గుజరాతీ, విద్యా మంత్రి ధరేంద్ర ప్రధాన్ మాతృభాష ఒడియా, తన మాతృభాష అరుణాచలి.. అయినా మేమంతా దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యతిస్తూ ఒక బృందంగా పనిచేస్తున్నామని రిజుజు చెప్పారు. మతం, భాష ఆధారంగా దేశాన్ని విభజించవద్దని ఆయన కోరారు.

బెయిల్ వంటి కేసుల్లో విచారణా తేదీలు పొడిగించొద్దు

సుప్రీం వ్యాఖ్యలు




న్యూఢిల్లీ : బెయిల్ ఇచ్చే కేసుల్లో సుదీర్ఘమైన విరామం వుండేలా విచారణా తేదీలు నిర్ణయించడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. వైద్య సంబంధమైన కారణాలపై తాత్కాలికంగా బెయిల్ మంజూరు చేయాలన్న పిటిషన్‌పై విచారణను పంజాబ్ హర్యానా హైకోర్టు రెండు నెలల తర్వాత నిర్ణయించిందని పిటిషన్‌దారు తెలియచేసిన నేపథ్యంలో సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తన క్లయింట్ రెండేండ్ల కుమార్తెకు అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి వున్నందున ఆమెకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్‌దారుడు హైకోర్టును ఆశ్రయించారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. హైకోర్టులో ఫిబ్రవరి 21న విచారణ జరిపి ఈ విషయాన్ని ఏప్రిల్ 22కు పోస్ట్ చేశారు. "స్వేచ్ఛను కల్పించడం వంటి అంశాల్లో కోర్టులు మరీ ఎక్కువ కాలం పాటు సాగదీయరాదని బెంచ్ వ్యాఖ్యానించింది. త్వరితగతిన విచారణ జరిపేందుకు పిటిషనర్ హైకోర్టుకు వెళ్ళేందుకు అనుమతించింది. కనీసం ఇలాంటి విషయాల్లోనైనా ముందుగా విచారించేలా చూడాలని బెంచ్ హైకోర్టును కోరింది. అయితే హైకోర్టులో తన క్లయింట్ రెగ్యులర్ బెయిల్ పెండింగ్‌లో వుందని, విచారణా తేదీని ముందుకు జరపాలన్న క్లయింట్ దరఖాస్తును తిరస్కరించారని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. తాజా వ్యాఖ్యల నేపథ్యంలో కూడా హైకోర్టు దీన్ని తిరస్కరిస్తుందని మీరు భావిస్తున్నారా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.

నేటి నుంచి ఐపీఎల్ టికెట్లు

ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టిన సన్‌రైజర్స్

హైదరాబాద్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సందడి హైదరాబాద్‌లో షురూ అయ్యింది. గత సీజన్ ఫైనలిస్ట్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇప్పటికే ఉప్పల్ స్టేడియంలో సాధన మొదలెట్టింది. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, అభినవ్ మనోహర్ వంటి దేశవాళీ స్టార్స్ ప్రాక్టీస్‌లో చెమటోడ్చుతున్నారు. మరోవైపు సొంతగడ్డపై జరుగనున్న తొలి రెండు మ్యాచుల టికెట్లను నేడు ఉదయం 11 నుంచి అందుబాటులో ఉంచుతున్నట్టు సన్‌రైజర్స్ యాజమాన్యం తెలిపింది. ఈ నెల 23న రాజస్థాన్ రాయల్స్, 27న లక్నో సూపర్‌జెయింట్స్‌తో సన్‌రైజర్స్ తలపడనుంది. ఈ రెండు మ్యాచుల టికెట్లను డిస్ట్రిక్ యాప్‌లో విక్రయానికి పెట్టనున్నారు. టికెట్ల ధరల వివరాలను మాత్రం సన్‌రైజర్స్ వెల్లడించలేదు.





సన్‌రైజర్స్ గూటికి వియాన్ మల్డర్

గాయంతో బ్రైడన్ కార్స్ అవుట్

హైదరాబాద్ : సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్ (ఇంగ్లాండ్) గాయంతో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్‌కు దూరమయ్యాడు. ఆటగాళ్ల వేలంలో రూ.1 కోటి కనీస ధరకు కార్స్‌ను సన్‌రైజర్స్ దక్కించుకుంది. ఇటీవల భారత పర్యటనలో ఎడమ కాలి బొటనవేలి గాయానికి గురైన బ్రైడన్.. చాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో ఇబ్బంది పడ్డాడు. గాయంతో కార్స్ చాంపియన్స్ ట్రోఫీకి సైతం దూరం కాగా... ఇప్పుడు ఐపీఎల్‌లో సైతం ఆడటం లేదు. అతడి స్థానంలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ మల్డర్‌ను సన్‌రైజర్స్ ఎంచుకుంది. మల్డర్ 128 టీ20ల్లో 2172 పరుగులు సహా 67 వికెట్లు పడగొట్టాడు. ఎస్ఏ20లో ఆడిన అనుభవం ఉన్నప్పటికీ ఐపీఎల్‌లో మల్డర్‌కు ఇదే తొలి సీజన్ కానుంది. ఐపీఎల్ 2025 మార్చి 22న ఆరంభం కానుండగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచ్ 23న ఆడనుంది. ఉప్పల్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది.



స్విట్జర్లాండ్‌తో భారత్ ఢీ

డెవిస్ కప్ వరల్డ్ గ్రూప్ 1 డ్రా

న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మక డెవిస్ కప్ గ్రూప్ 1 పోరులో స్విట్జర్లాండ్‌తో భారత్ తలపడనుంది. గత నెలలో జరిగిన వరల్డ్ గ్రూప్ 1 ప్లే ఆఫ్స్‌లో టోగోపై భారత్ 4-0తో గెలుపొందగా.. క్వాలిఫయర్స్‌లో స్పెయిన్ చేతిలో స్విట్జర్లాండ్ 1-3తో పరాజయం పాలైంది. గురువారం లండన్‌లోని ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ కార్యాలయంలో వరల్డ్ గ్రూప్ 1 డ్రా విడుదల చేశారు. డ్రా ప్రకారం వరల్డ్ గ్రూప్ 1 పోరులో భారత్.. స్విట్జర్లాండ్‌ను వాళ్ల సొంతగడ్డపైనే ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్ సెప్టెంబర్ 12-14న స్విట్జర్లాండ్‌లో జరుగనుంది. డెవిస్ కప్‌లో స్విట్జర్లాండ్స్‌తో ముఖాముఖిలో భారత్ 1-2తో ముందంజలో ఉంది. కానీ చివరగా ఈ రెండు జట్లు 1993లో తలపడ్డాయి. స్విస్ తరఫున స్టాన్ వావ్రింకా, అలెగ్జాండర్, జెరెమీ, జాకబ్ పాల్‌లు బరిలోకి దిగుతుండగా.. భారత్ తరఫున యూకీ బాంబ్రి, సుమిత్ నాగల్‌లు స్టార్ ప్లేయర్స్. టోగోపై నెగ్గిన జట్టులో శశికుమార్, రామ్‌కుమార్, కరణ్ సింగ్ సహా శ్రీరామ్ బాలాజీ, రుత్విక్ చౌదరిలు ఉన్నారు.

ఆ రూల్ మారిస్తేనే.. రివర్స్ స్వింగ్!

ఉమ్మి వాడకంపై మహ్మద్ షమి వ్యాఖ్యలు


నవతెలంగాణ-దుబాయ్



వైట్‌బాల్ క్రికెట్‌లో బ్యాటర్ల ఆధిపత్యం సుస్పష్టం. వన్డేల్లో వికెట్‌కు ఇరు వైపులా కొత్త బంతులతో బౌలర్లు దాడి చేస్తున్నా.. పరుగుల ప్రవాహానికి అడ్డుకట్ట వేయటం కష్టసాధ్యంగా మారుతోంది. డెత్ ఓవర్లలో బ్యాటర్ల దూకుడుకు ముకుతాడు వేసేందుకు పేసర్లు సంధించే ప్రధాన అస్త్రం 'రివర్స్ స్వింగ్'. బంతికి ఓ వైపు మెరుపు తొలగించేందుకు గతంలో ఉమ్మిని వాడేవారు. కరోనా మహమ్మారి సమయంలో ఆటగాళ్ల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 2020 మేలో ఉమ్మి వాడకంపై తాత్కాలిక నిషేధం విధించింది. 2022 సెప్టెంబర్‌లో ఉమ్మి వాడటాన్ని శాశ్వతంగా నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. ఐసీసీ నిర్ణయం రివర్స్ స్వింగ్‌ను కనుమరుగు చేసే దుస్థితికి తీసుకొచ్చింది. భారత స్టార్ పేసర్ మహ్మద్ షమి ఉమ్మి వాడకంపై నిషేధం ఎత్తివేయాలని ఐసీసీని కోరాడు. ఆస్ట్రేలియాపై సెమీఫైనల్లో 4 వికెట్ల తేడాతో గెలుపొందిన తర్వాత మహ్మద్ షమి మీడియాతో మాట్లాడాడు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భారత పేస్ దళానికి నాయకత్వం వహిస్తున్న షమి నాలుగు మ్యాచుల్లో 8 వికెట్లు పడగొట్టాడు. బంగ్లాదేశ్‌తో గ్రూప్-ఏ తొలి మ్యాచ్‌లో షమి ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం దుబాయ్‌లో జరిగే టైటిల్ పోరులో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది.

' రివర్స్ స్వింగ్ కోసం ప్రయత్నిస్తున్నాం. కానీ ఉమ్మిపై నిషేధంతో అది సాధ్యపడటం లేదు. ఉమ్మి వాడకంపై నిషేధం తొలగించాలని కోరుతూనే ఉన్నాం. రివర్స్ స్వింగ్‌తో మ్యాచ్‌లు సైతం ఆసక్తికరంగా మారుతాయి' అని మహ్మద్ షమి తెలిపాడు. మహ్మద్ షమి వ్యాఖ్యలకు ఇద్దరు స్టార్ పేసర్లు మద్దతుగా నిలిచారు. దక్షిణాఫ్రికా పేసర్ వెర్నన్ ఫిలాండర్, న్యూజిలాండ్ పేసర్ టిమ్ సౌథీలులు సైతం ఉమ్మి వాడకంపై నిషేధం తొలగిస్తేనే రివర్స్ స్వింగ్‌ను మళ్లీ చూడగలుగుతామని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉమ్మిపై నిషేధం కోవిడ్ సమయంలో తీసుకొచ్చిన నిబంధన. బౌలర్‌గా రివర్స్ స్వింగ్‌తో కాస్త అనుకూలత కోరుకోవటం సహజం. ఇటీవల వన్డేల్లో ఇరు జట్లు 360-350 పరుగులు సులువుగా చేస్తున్నాయి. బౌలర్లకు అనుకూలంగా ఏమైనా చేయాల్సిన అవసరం ఉంది. ఉమ్మిపై నిషేధం తొలగిస్తే రివర్స్ స్వింగ్‌తో పేసర్లు మళ్లీ రేసులోకి వస్తారని ఫిలాండర్ తెలిపాడు. ఆట ఆఖర్లో బంతి స్వరూపమే మారిపోతుంది. ఉమ్మి వాడకంపై నిషేధం తొలగిస్తే.. వైట్‌బాల్ కంటే రెడ్ బాల్‌లో పేసర్లకు అధిక ప్రయోజనం చేకూరుతుంది. వైట్‌బాల్‌లో కొంతవరకే బంతి స్వింగ్ అవుతుంది. కానీ రెడ్ బాల్‌తో రివర్స్ స్వింగ్ మ్యాజిక్ భిన్నం. చెమటతోనూ బంతిపై మెరుపు తొలగించవచ్చు కానీ.. చెమటను ఏ మేరకు వాడాలనే నియంత్రణ మన చేతుల్లో ఉండదు. మ్యాచ్ సాగుతున్న కొద్దీ చెమట మరింత అధికం అవుతుంది. చెమట ఎక్కువైతే.. బౌలర్లకు అదీ కష్టమేనని సౌథీ అన్నాడు.

3 తరాల నేపథ్యంలో..



శర్వానంద్

శర్వానంద్ హీరోగా నటిస్తున్న తన 36వ చిత్రంలో స్కిల్డ్ మోటార్ సైకిల్ రేసర్‌గా కనిపించబోతున్నారు. అభిలాష్ కంకర దర్శకత్వంలో యువి క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఫైనల్ స్టేజ్‌కి చేరుకుంది. త్వరలోనే టైటిల్‌ను లాంచ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

శర్వానంద్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, మేకర్స్ సినిమాలోని ఆయన లుక్‌ను రివీల్ చేస్తూ ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. టోర్న్ జీన్స్, స్టైలిష్ స్పోర్ట్స్ జాకెట్, షేడ్స్ ధరించి యమహా ఆర్ఎక్స్ -100 బైక్ పై కూర్చున్న శర్వా లుక్ అదిరిపోయింది. శర్వా కూల్ అండ్ ఎనర్జిటిక్ వైబ్‌తో కనిపించిన ఈ లుక్ ఛరిస్మాటిక్‌గా ఉంది. వైవిధ్యమైన పాత్రలతో ఆకట్టుకునే శర్వానంద్ ఈ చిత్రంలో మరో సవాలుతో కూడిన పాత్రను పోషిస్తున్నారు. ఈసారి గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆడ్రినలిన్ రష్‌ని ఇచ్చే స్టంట్స్‌తో అదరగొట్టబోతున్నారు. ఈ చిత్రంలో మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ హై-ఎనర్జీ చిత్రం మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్ డ్రాప్‌లో ఉండనుంది. మూడు తరాల నేపథ్యంలో ఒక కుటుంబం, ప్రేమ, కలలతో ముడిపడి తొంభైల ప్రారంభంలోని ఎగ్జైటింగ్ మోటోక్రాస్ బ్యాక్ డ్రాప్‌లో ఉన్న అద్భుతమైన కథ ఇది అని చిత్ర యూనిట్ తెలిపింది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అభిలాష్ కంకర, నిర్మాతలు: వంశీ-ప్రమోద్, సమర్పణ: విక్రమ్, సంగీతం: జిబ్రాన్, డీవోపీ: యువరాజ్, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్, ఎడిటర్: అనిల్ కుమార్ పి, ఆర్ట్ డైరెక్టర్: ఎ. పనీర్ సెల్వమ్.

'మూకుతి అమ్మన్ 2' షురూ..



నయనతార

నయనతార లీడ్ రోల్‌లో సుందర్.సి దర్శకత్వంలో వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి బిగ్గెస్ట్ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌లలో ఒకటైన 'మూకుతి అమ్మన్ 2'ను నిర్మిస్తోంది. అవ్ని సినిమాక్స్ (పి) లిమిటెడ్, రౌడీ పిక్చర్స్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నాయి.

గురువారం ఈ చిత్రం రూ.1 కోటి విలువైన అద్భుతమైన సెట్ వర్క్‌తో గ్రాండ్ పూజా వేడుకతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో చిత్ర నటీనటులు, సిబ్బందితో పాటు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు సునీల్ నారంగ్, జగదీష్, సి.కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'మూకుతి అమ్మన్ పార్ట్ 1' భారీ విజయాన్ని సాధించింది. తెలుగు డబ్బింగ్ వెర్షన్ 'అమ్మోరు తల్లి'కి కూడా బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్ లభించింది. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ డాక్టర్ ఇషారి కె గణేష్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విజువల్ వండర్‌గా నిర్మిస్తున్నారు. ఈ సినిమా అన్ లిమిటెడ్ నవ్వులతో కూడిన ఎగ్జైటింగ్ కథాంశంతో ఉంటుంది. సుందర్ సి, నయనతార తొలిసారి కలిసి నటిస్తున్న చిత్రం కావడంతో అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి అని చిత్ర బృందం తెలిపింది.



జాన్వీ కపూర్

అంచనాలు పెరుగుతున్నాయ్..

'ఆర్‌సి 16'(వర్కింగ్ టైటిల్) సినిమాలో రామ్‌చరణ్ సరసన బాలీవుడ్ అందాల తార జాన్వీకపూర్ నటిస్తున్న సంగతి తెలిసిందే. బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని భారీ ఎత్తున తెరకెక్కిస్తున్నారు. గురువారం జాన్వీ కపూర్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టీమ్ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. జాన్వీ కపూర్‌కు శుభాకాంక్షలను తెలియజేస్తూ, మేకర్స్ సెట్ నుండి ఆమె స్టిల్‌ను రిలీజ్ చేశారు. అయితే ఇది బిహైండ్ ది సీన్‌కు సంబంధించిన స్టిల్. ఇది అఫీషియల్ లుక్ కాదు అని కూడా టీమ్ క్లారిటీ ఇచ్చింది. మొదటి షెడ్యూల్ సమయంలో మైసూర్‌లో క్లిక్ చేసిన సాధారణ ఫోటో అని స్పష్టం చేశారు. జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్ వచ్చినప్పుడు అందరూ మెస్మరైజ్ అవుతారని టీం అంచనాలు పెంచేసింది.

గత ఏడాది నవంబర్‌లో మైసూర్‌లో జరిగిన మొదటి షెడ్యూల్‌లో జాన్వీ కపూర్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన కొత్త షెడ్యూల్‌లోనూ జాన్వీ కపూర్ పాల్గొన్నారు. ఈ షెడ్యూల్ 12 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, మీర్జాపూర్ ఫేమ్ దివ్యేందు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తుండగా, రత్నవేలు విజువల్స్ అందిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు %క్ష్మజ%16ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

అలరించే ప్రయోగాత్మక చిత్రం




బి.శివ ప్రసాద్

మొహాలు చూపించకుండా సినిమాను తీయడం అనేది ఇదివరకు వరల్డ్ వైడ్‌గా ఎవ్వరూ సాహసం చేయని ఓ జోనర్. ఇలా ఆర్టిస్టుల్ని చూపించకుండా, అసలు ఎవ్వరూ కనిపించకుండా సినిమాను చూపించడం కూడా మామూలు విషయం కాదు. కానీ అలాంటి ఓ విభిన్న ప్రయత్నం చేస్తూ తీసిన చిత్రమే 'రా రాజా'. పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్ మీద బి.శివప్రసాద్ తెరకెక్కించారు. బూర్లే హరి ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కిట్టు లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. ఈ చిత్రాన్ని నేడు (శుక్రవారం) భారీ ఎత్తున రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత బి.శివప్రసాద్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- 'మాత్ర' సినిమాతో నిర్మాతగా మారాను. అయితే ఆ సినిమా టైంలోనే నాకు ఈ 'రా రాజా' ఆలోచన వచ్చింది. అలా నేనే నిర్మాతగా, దర్శకుడిగా ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. ప్రస్తుతం ప్రేక్షకులెవ్వరూ కూడా హీరో, హీరోయిన్ల పేర్లు, మొహాలు చూసి సినిమాలకు రావడం లేదు. ట్రెండ్ మారింది. కథ నచ్చితే, కంటెంట్ బాగుంటేనే మూవీని చూస్తున్నారు. అలా ఓ కంటెంట్ బేస్డ్, కథా ప్రాధాన్యం ఉన్న చిత్రాన్ని తీయాలని అనుకున్నాను. అందుకే ఈ చిత్రాన్ని నిర్మించాను.
- సినిమాలో నటీనటులు ఎవ్వరూ కనిపించకపోయినా అన్ని రకాల ఎమోషన్స్ ఇందులో ఉంటాయి. అన్ని రకాల ఎమోషన్స్‌ను ఆడియెన్స్ ఫీల్ అవుతారు. లవ్, కామెడీ, హర్రర్.. ఇలా ప్రతీ ఒక్కటీ ఇందులో ఉంటుంది. ఆద్యంతం అలరించేలా, అందరినీ చివరి వరకు ఎంగేజ్ చేసేలా ఉంటుంది.
- కెమెరామెన్ రాహుల్ శ్రీ వాత్సవ్ వల్లే సినిమా ఇంత బాగా వచ్చింది. అలాగే శేఖర్ చంద్ర కూడా ఈ చిత్రానికి ప్రధాన బలం. ఆయన ఇచ్చిన బీజీఎం సినిమాకు ప్లస్ అవుతుంది. థియేటర్ నుంచి బయటకు వచ్చిన తరువాత అందరూ ఆయన గురించి కచ్చితంగా మాట్లాడుకుంటారు.
- ఈ చిత్రాన్ని థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్ కోసం తీశాం. ఏ ఒక్కరినీ నిరాశపరచదు. ఆర్టిస్టుల మొహాలు కనిపించడం లేదే? అనే భావన మాత్రం కలగదు. చివరి వరకు ఎంగేజ్ చేసేలా ఉంటుంది. మేం చేసిన ఈ ప్రయోగాన్ని అందరూ ఆదరించండి.

నవచిత్రం

పక్కా యాక్షన్ థ్రిల్లర్..



విక్రమ్

విక్రమ్ మోఎస్ట్ ఎవైటెడ్ యాక్షన్-ప్యాక్డ్ మూవీ 'వీర ధీర సూరన్ పార్ట్ 2'. ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజరాముడు, దుషార విజయన్ కీలక పాత్రలు పోషించారు.

హెచ్‌ఆర్ పిక్చర్స్ రియా శిబు నిర్మించిన ఈ చిత్రం ఒక యాక్షన్ థ్రిల్లర్. ఇది ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ఈనెల 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల అవుతుందని మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించారు. తెలుగులో ఎన్విఆర్ సినిమాస్ ద్వారా ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది.

జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రానికి తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జి.కె. ప్రసన్న ఎడిటింగ్ వర్క్ పర్యవేక్షిస్తున్నారు. సి.ఎస్. బాలచందర్ ఆర్ట్ డైరెక్టర్.

విభిన్న ప్రేమకథా చిత్రంగా 'మిస్టర్ రెడ్డి'



టీఎస్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద గోల్డ్ మ్యాన్ రాజా (టి. నరసింహా రావు-టీఎస్ఆర్) నటిస్తూ, నిర్మించిన చిత్రం 'మిస్టర్ రెడ్డి'. ఈ చిత్రానికి వెంకట్ వోలాద్రి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో టీఎస్ఆర్‌తో పాటు మహాదేవ్, అనుపమ ప్రకాష్, దీప్తి, భాస్కర్, మల్లికార్జున్, శంకర్ మహతి, రాధిక, ఏకే మణి, ఫణి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు.

టీజర్ లాంచ్ ఈవెంట్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్, పట్నం సునీతా రెడ్డి, నల్లగొండ గద్దర్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ టీజర్‌లోని డైలాగ్స్, యాక్షన్ సీక్వెన్స్, ఎమోషన్స్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌ను ఆకట్టుకునేలా ఉన్నాయి. చిన్నతనంలో విడిపోయిన ప్రేమ జంట.. పెద్దయ్యాక మళ్లీ ఎదురు పడితే.. మళ్లీ ఆ ప్రేమ కోసం ప్రయత్నిస్తే ఎలా ఉంటుంది? అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారని టీజర్ చూస్తే అర్థం అవుతోంది. 'మ్యారేజ్ అంటే ఒప్పందం, సెటిల్‌మెంట్ కాదు.. జీవితాన్ని చివరి వరకు కలిసి పంచుకోవడం' అంటూ చెప్పే డైలాగ్ ఈ మూవీ కాన్సెప్ట్ ఏంటో చెప్పేస్తుంది. ఈ సందర్భంగా హీరో గోల్డ్ మ్యాన్ రాజా మాట్లాడుతూ, 'మా టీజర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. కొత్త వాళ్లమంతా కలిసి చేసిన ఈ ప్రయత్నాన్ని అందరూ ప్రోత్సహించాలి. మా సినిమా త్వరలోనే రాబోతోంది. అందరూ చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు. 'కొత్త వాళ్లమంతా కలిసి ఈ చిన్న ప్రయత్నం చేశాం. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. ఈ సినిమాను మేం అంతా చాలా కష్టపడి చేశాం. మాలాంటి కొత్త వారు చేసిన ఈ ప్రయత్నాన్ని అందరూ ఎంకరేజ్ చేస్తారని ఆశిస్తున్నాను' అని దర్శకుడు వెంకట్ వోలాద్రి అన్నారు.

మహాదేవ్ మాట్లాడుతూ,'ఈ సినిమా షూటింగ్ టైంలో చాలా నేర్చుకున్నాను. ఇంత మంచి టీంతో పని చేయడం ఆనందంగా ఉంది. ఈ మూవీ పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.'ఇలాంటి మంచి చిత్రంలో నాకు మంచి పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. దర్శకుడు వెంకట్ మా సినిమాను అద్భుతంగా తీశారు. ఓ మంచి సినిమాతో మీముందుకు రాబోతున్నాం' అని అనుపమ ప్రకాష్ చెప్పారు. ఈ చిత్రానికి నిర్మాత : టీఎస్ఆర్, కెమెరామెన్:కె ఎస్ భూషణ్, సంగీతం: కేఎస్ఆర్ మ్యూజికల్, కొరియోగ్రాఫర్:గోవింద్, ఫైట్స్:యాక్షన్ గౌరీ.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు

అల్లి శ్రీనివాస్ రెడ్డి మృతి

రెండున్నర నెలలుగా బ్రెయిన్‌స్ట్రోక్‌కు చికిత్స

పార్టీ మహబూబాబాద్ నేతల సంతాపం



(ఫైల్)

నవతెలంగాణ-మహబూబాబాద్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మహబూబాబాద్ టూ టౌన్ కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు అల్లి శ్రీనివాస్‌రెడ్డి(59) గురువారం మధ్యాహ్నం 3 గంటలకు తుది శ్వాస విడిచారు. శ్రీనివాస్ రెడ్డి రెండున్నర నెలల కిందట బ్రెయిన్ స్ట్రోక్‌తో హైదరాబాద్ లోని యశోద ఆస్పత్రిలో చేరారు. అప్పటి నుంచి చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థి ఉద్యమాల నుంచి కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. మూడు దశాబ్దాలకుపైగా సీపీఐ(ఎం)లో వివిధ స్థాయిల్లో పనిచేశారు. భూ పోరాటాలు, పేదలకు గుడిసెలు వేయించడంలో కీలకపాత్ర పోషించారు. తనకు ఇచ్చిన బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. మహబూబాబాద్ మండలం జమాన్లపెల్లికి చెందిన అల్లి అనసూర్య- పాపిరెడ్డి దంపతుల కుమారుడైన శ్రీనివాస్ రెడ్డి మానుకోటలో స్థిరపడ్డారు. ఈయనకు భార్య పద్మ, కూతురు స్ఫూర్తి ఉన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మృతదేహాన్ని గురువారం రాత్రి మహబూబాబాద్‌లోని ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

సీపీఐ(ఎం) సంతాపం

అవిశ్రాంత ఉద్యమకారుడు అల్లి శ్రీనివాసరెడ్డి మృతి పట్ల సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ నేతలు సంతాపం తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాలుడి కిడ్నాప్ కలకలం

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

నల్లగొండ పట్టణంలో బాలుడు కిడ్నాప్ అయిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. షమీమ్, అహ్మద్ దంపతులు మూడేండ్లుగా రోజువారి కూలి పని చేసుకుంటూ ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని గదిలో నివాసముంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. నాలుగో తేదీ ఆస్పత్రి ఆవరణలో ఆడుకుంటున్న మూడేండ్ల బాబును గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేసినట్టు సీసీ కెమెరాలో రికార్డు అయింది. దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. బాబును ఎత్తుకెళ్లిన కిడ్నాపర్ 30 వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్టు వారు చెప్పారు. నల్లగొండ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

- పెండ్లికి కుటుంబ పెద్దల నిరాకరణే కారణం?

నవతెలంగాణ - కరీంనగర్



(ఫైల్)

ప్రేమించుకున్న ఆ జంట పెండ్లితో ఒక్కటవ్వాలని కలలు కన్నారు. కానీ కుటుంబ పెద్దల నిరాకరణతో ఇద్దరూ ప్రాణం తీసుకున్నారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. చొప్పదండి మండలం చిత్యాలపల్లి గ్రామానికి చెందిన కొండపర్తి అరుణ్ కుమార్(24), భూపాలపట్నం గ్రామానికి చెందిన నాంపల్లి అలేఖ్య(22) రెండేండ్లుగా ప్రేమలో ఉన్నారు. అలేఖ్య తల్లిదండ్రులు ఆమెకు మరో సంబంధం ఖరారు చేసి, పెండ్లి చేసుకోవాలని ఆమెపై ఒత్తిడి తీసుకువచ్చారు. అలేఖ్య తనకు దూరమవుతుందని ఆందోళనకు గురైన అరుణ్ గురువారం సాయంత్రం తన స్నేహితుడి ఇంటికి అలేఖ్యను తీసుకెళ్లాడు. అక్కడ వారిద్దరూ చివరిసారిగా మాట్లాడుకున్న అనంతరం గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న కరీంనగర్ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మీతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. "ప్రేమ వ్యవహారం కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానిస్తున్నాం. కేసు నమోదు చేసి, తల్లిదండ్రుల వాంగ్మూలం తీసుకుంటున్నాం" అని పోలీసులు తెలిపారు.

విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు ప్రాధాన్యత

- కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి



న్యూఢిల్లీ : శాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం నాడు ఆయన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. దాదాపు అరగంట సేపు జరిగిన ఈ భేటీలో విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులతోపాటు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాల గురించి ఇరువురు నేతలు చర్చించారు. సమావేశానంతరం ఎక్స్‌లో చేసిన పోస్టులో మెట్రో రైలు ప్రాజెక్టులపై ఫలవంతమైన చర్చలు జరిగినట్లు సిఎం తెలిపారు. రాష్ట్ర సామాజిక, ఆర్థిక, అభివృద్ధి ప్రాజెక్టుల గురించి చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశం రాష్ట్ర ఆర్థిక ప్రగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆ తరువాత ఒక టివి ఛానల్‌తో మాట్లాడుతూ ప్రధానిని ప్రశంసలతో ముంచెత్తారు. ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి లేదని, ఇప్పుడు ఆ నిబంధన తొలగించామని అన్నారు. భవిష్యత్తులో ఇద్దరు పిల్లల కంటే తక్కువ మంది ఉంటే ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలులేదన్న నిబంధనలు రావాల్సి ఉందన్నారు. 2004, 2019లో తనను ప్రతిపక్షం ఓడించలేదని, తాను అభివృద్ధిలో మునిగిపోవడం వల్లే ఓడిపోయానని అన్నారు. దేశంలోనే అమరావతి ఉత్తమమైన రాజధాని అని, అదొక ఏంజెల్ క్యాపిటల్ అని పేర్కొన్నారు. తాను అరెస్టయినప్పుడు ప్రజలు రోడ్లపైకి వచ్చారని, చాలా ఒత్తిడిలు ఉన్నప్పటికీ 53 రోజుల పాటు రోడ్లపైనే ఉన్నారని తెలిపారు. 60 దేశాల్లో ప్రజలు సంఘీభావంగా ఆందోళనలు చేశారని అన్నారు. ఎవరైనా చనిపోయినప్పుడు ఇలా సానుభూతి వస్తుందని, తాను బ్రతికుండగానే దాన్ని చూశానని అన్నారు. సంపద సృష్టించకుండా అప్పులు చేసి ప్రజలకు డబ్బులు పంచే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో తాము వాట్సప్ గవర్నెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టామని దానిపై ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కూడా ఆలోచిస్తోందని చెప్పారు. ప్రపంచంలో ఇండియా ఆర్థిక వ్యవస్థ పదో స్థానంలో ఉండేదని, ఇప్పుడు మోడీ నాయకత్వంలో ఐదో స్థానానికి వచ్చిందని తెలిపారు. 1991లో ఆర్థిక సంస్కరణలు, ఆ తరువాత సాంకేతిక విప్లవం వంటివి దేశానికి అనుకూలతను తెచ్చి పెట్టాయన్నారు. 1995లో ఐటి గురించి మాట్లాడానని, ఇప్పుడు ఎఐ గురించి మాట్లాడుతున్నానని తెలిపారు. కొంతమంది ఎఐ ఎకో సిస్టమ్‌ను ధ్వంసం చేస్తుందని అంటున్నారని, దేనికైనా కొన్ని ప్రతికూల అంశాలుంటాయని తెలిపారు. అందులోని అనుకూలతలనే మనం తీసుకుని ముందుకు పోవాలని పేర్కొన్నారు. ఐటి నుంచి ఎఐకి మారడం, గ్రీన్ ఎనర్జీ నుంచి గ్రీన్ నైట్రోజన్‌కు మారడం, స్కిలింగ్, కెపాసిటి బిల్డింగ్, మానవ వనరులతో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. భారత దేశం చాలా సంక్షోభాలను చూసిందన్నారు. ఇండియా విదేశాంగ విధానం చాలా ఉత్తమమైనదని, నరేంద్ర మోడీ వల్లనే ఇది సాధ్యమైందని అన్నారు.

యూఎస్ పౌరులే టార్గెట్

కాల్ సెంటర్ ముసుగులో సైబర్ మోసాలు

- ఛేదించిన టీజీసీఎస్‌బీ అధికారులు
- 63 మంది నిందితుల అరెస్ట్



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ప్రవాస భారతీయులు, అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ కాల్ సెంటర్ ముసుగులో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు రట్టు చేశారు. ఈ మేరకు 63 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ఐసీసీసీలో మీడియా సమావేశంలో టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ వెల్లడించారు.

గుజరాత్‌కు చెందిన క్రైవాన్ పటేల రూపేశ్ కుమార్ అలియాస్ జాదూ భాయ్, దుబాయ్‌లో నివాసముంటున్న ఆయన సోదరులు విక్కీ, ఆజాద్ సహాయంతో హైదరాబాద్ హైటెక్ సిటీలో పత్రికా నగర్ ఎగ్జిట్ సొల్యూషన్స్ పేరుతో నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ కాల్ సెంటర్‌కు హైదరాబాద్‌కు చెందిన చందా మాన్సవానీని నియమించారు. టీమ్ లీడర్లుగా సంజు, జేమ్స్, ప్రవీణ్ ఉన్నారు. జాదూ భాయ్ తన సోదరులు అమెరికాలోని పేపాల్ నుంచి కస్టమర్ల డేటాను దొంగిలించారు. దీని సహాయంతో కస్టమర్లకు ఫోన్ చేసి సైబర్ నేరాలకు పాల్పడ్డారు.

ఐబీమ్, ఎక్స్-లైట్ వంటి అధునాతన సాఫ్ట్‌వేర్లను ఉపయోగించిన నిందితులు.. ఫిషింగ్ ఈ-మెయిల్స్‌ను పంపి పేపాల్ వినియోగ దారులను లక్ష్యంగా చేసుకున్నారు. బాధితుడి ఖాతాలో అనధికారిక లావాదేవీలు జరిగాయని తప్పుగా పేర్కొని దోచుకున్నారు. అమెరికాలోని బాధితుల నుంచి దోచుకున్న డబ్బును మ్యూల్ బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేశారు. అక్కడి నుంచి ఈ నిధులను క్రిప్టోకరెన్సీగా మార్చి.. బ్యాంకులో నిధులు లేకుండా చేశారు.

ఈ కాల్ సెంటర్ ఉద్యోగాల కోసం సాఫ్ట్‌వేర్ పరిజ్ఞానం ఉన్న యువకులను నెలకు రూ.30 వేల జీతం చొప్పున నియమించుకున్నారు. ఆ తర్వాత వారికి సైబర్ నేరాలకు ఎలా పాల్పడాలి, బాధితులకు ఫోన్ చేసి ఎలా మోసగించాలనే అంశాలపై శిక్షణ కూడా ఇచ్చారు. ఈ కాల్‌సెంటర్ ఉద్యోగాలకు ఈశాన్య రాష్ట్రాలకు చెందినవారిని చాలా మందిని నియమించుకున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు.. టీజీసీఎస్‌బీ అధికారులు గురువారం ఈ కాల్‌సెంటర్‌పై ఆకస్మిక దాడి చేసి 63 మంది నిందితులను అరెస్ట్ చేశారు. దీంతో పాటు వారు ఉపయోగించే 52 మొబైల్ ఫోన్లు, 63 ల్యాప్‌టాప్‌లు, 27 ఎగ్జిట్ సొల్యూషన్స్ ఐడీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో టీజీసీఎస్‌బీ అధికారులు ఎస్.దేవేందర్, మద్దిపాటి శ్రీనివాస్, డి.ఎస్ ప్రసాద్, హరికృష్ణలు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు రాక విదేశీ విద్యార్థుల ఇబ్బందులు

కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేకపోవడం దుర్మార్గం : మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విదేశీ విద్యాపథకం కింద ఎంపికై విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్ డబ్బులు రాక ఆవేదన చెందుతున్నారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి హరీశ్‌రావు అన్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేకపోవడం దుర్మార్గ మని విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తుండడం పేద, మధ్య తరగతి విద్యార్థులకు శాపంగా మారుతు న్నదని పేర్కొన్నారు. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి రాలేదనీ, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలకు మార్చి వరకు సమయం ఉందంటూ మంత్రి సీతక్క సమాధానమిచ్చారని గుర్తు చేశారు. ఈ మాట చెప్పి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు మూడు రూపాయల బకాయిలు కూడా చెల్లించలేదని విమర్శించారు.

రేవంత్ ప్రభుత్వానికి బడా కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేయడంపై ఉన్న శ్రద్ధ పేద విద్యార్థుల చదువులపై లేదని పేర్కొన్నారు. విదేశీ విద్యా పథకాన్ని నీరు గారుస్తున్నా రన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి తక్షణమే స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్యా పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి పేదలకు విదేశాల్లో చదివే అవకాశం కల్పించాలని కోరారు.

బెదిరింపులకు భయపడేది లేదు !

తేల్చి చెప్పిన చైనా




బీజింగ్ : బెదిరింపులకు భయపడబోమని, అయినా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన అధిక టారిఫ్‌లు, ఇతర సవాళ్లను ఎదుర్కొనగలిగే సామర్థ్యం తమ ఆర్థిక వ్యవస్థకు వుందని చైనా వాణిజ్య శాఖ మంత్రి వాంగ్ వెంటావో స్పష్టం చేశారు. వాణిజ్య యుద్ధంలో విజేతలు అంటూ ఎవరూ వుండరని వ్యాఖ్యానించారు. చైనా నేషనల్ కాంగ్రెస్ వార్షిక సమావేశం సందర్భంగా వాంగ్ మాట్లాడుతూ గురువారం ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చలు జరిపేందుకు చైనా సిద్ధంగా వుందని పునరుద్ఘాటించారు. బెదిరింపులు, బలవంతపు చర్యలు అంతిమంగా విఫలమవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. చైనాపై ఇలాంటివి పనిచేయవని అన్నారు. తమను భయపెట్టలేరన్నారు. దేశ ప్రయోజనాలు కాపాడుకోవాలన్న చైనా కృతనిశ్చయం తిరుగులేనిదన్నారు. 140 దేశాలకు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా చైనా వుందంటే తమకు అనేక అవకాశాలు వున్నాయని అర్థమని అన్నారు. తమ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక మార్కెట్ల నిర్మాణానికి, బలోపేతానికి అనుసరించే వ్యూహాల గురించి ఆయన వివరించారు. జనవరి నుండి రెండుసార్లు చైనాపై ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌లు పెంచింది. చైనా కూడా ప్రతిగా అమెరికా ఉత్పత్తులపై, కంపెనీలపై ఇలాంటి ఆంక్షలు విధించింది. ఇతర దేశాలతో వ్యవహారాల్లో పరస్పర గౌరవం వుండాలని చైనా ఆకాంక్షిస్తుందన్నారు., అమెరికా ఈ తప్పుడు దారిలోనే ముందుకు సాగితే తాము కూడా అదే రీతిన ప్రతిస్పందిస్తామని, చివరికంటా పోరాడతామని చెప్పారు. వాణిజ్యంపై విభేదాలుంటే పరిష్కరించుకోవడానికి చైనా సిద్ధంగా వుందన్నారు. సాధ్యమైనంత త్వరలో సముచితమైన సమయంలో ఉభయ పక్షాలు సమావేశమై సమాచార మార్పిడి చేసుకోవాలన్నారు.

ఉక్రెయిన్ రక్షణ, యూరప్ భద్రత లక్ష్యంగా బ్రస్సెల్స్‌లో ఈయూ నేతల చర్చలు

బ్రస్సెల్స్ : ఉక్రెయిన్‌కు అవసరమైన రక్షణ కల్పిస్తూ మరోవైపు తమ భద్రతను పెంపొందించుకునే లక్ష్యంతో గురువారం బ్రస్సెల్స్‌లో యురోపియన్ యూనియన్ (ఈయూ) నేతలు అత్యవసర చర్చలు ప్రారంభించారు. స్వల్ప కాల వ్యవధిలో యూరప్ రక్షణలను మరింత బలోపేతం చేసేందుకు గల మార్గాలను బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఇయు సదస్సు చైర్మన్ ఆంటానియో కోస్టా, జర్మనీ కొత్త చాన్సలర్‌గా నియమితులవనున్న ఫ్రెడరిక్ మెర్జ్ చర్చించారు. అధికంగా రక్షణ వ్యయాన్ని అనుమతించాలంటే అందుకోసం పెద్ద మొత్తంలో రుణాలు చేయల్సి వుంది, అందుకోసం దేశ నిబంధనలను సరళతరం చేసేందుకు కొన్ని ప్రణాళికలను మెర్జ్ ప్రతిపాదించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన ఈ రెండు నెలల కాలంలో ప్రధానమైన మార్పు ఒకటి గోచరిస్తోంది. అమెరికా, యూరప్‌ల మధ్య సహకారాన్ని ఆయన ప్రశ్నిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం నాటి నుండి పశ్చిమ దేశాల భద్రతకు యూరప్ కీలకంగా నిలిచింది. తాజాగా అమెరికా విధానంలో వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకుని, అలాగే మరోవైపు మరో యుద్ధం పొంచి వుందనే అనుమానాల నేపథ్యంలో ప్రస్తుత రక్షణ చర్యలను యూరప్ నిర్వహించాల్సి వుందని యురోపియన్ పాలసీ సెంటర్ మేథోవర్గం వ్యాఖ్యానించింది. నిర్ణయాత్మకమైన చర్యలతో యూరప్ ముందడుగు వేస్తుందని బుధవారం ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ మీడియాతో వ్యాఖ్యానించారు. సభ్య దేశాలన్నీ తమ మిలటరీ వ్యయాన్ని పెంచుతాయన్నారు. సంయుక్త నిధినొకదాన్ని ఏర్పాటు చేసి అత్యంత వినూత్నమైన ఆయుధాలు, ట్యాంకులు, పరికరాలను కొనుగోలు చేయడం, మరికొన్ని తయారుచేయడం జరుగుతుందని చెప్పారు. యూరప్ భవితవ్యాన్ని అమెరికానో లేదా రష్యానో నిర్ణయించబోదని జెలెన్స్కీ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. యురోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయన్ ఒక ప్రతిపాదన చేశారు. ఏ దేశానికి ఆ దేశం తమ రక్షణ వ్యయాన్ని పెంచేలా బడ్జెట్ నిబంధనలను సరళతరం చేయడానికి ఒక ప్రణాళికను ప్రతిపాదించారు. ఇప్పటికే అనేక దేశాలు అధిక రుణ భారంతో బాధపడుతున్న సమయంలో పెరిగిన రక్షణ వ్యయం వారి జాతీయ బడ్జెట్‌ల నుండే రానున్నాయి. ఉక్రెయిన్‌కు అన్ని రకాల మిలటరీ సాయాన్ని అమెరికా నిలిపివేసిన నేపథ్యంలో అత్యవసరంగా ఈ సదస్సు జరుగుతోంది. అయితే ఉక్రెయిన్ అవసరాలన్నింటినీ ఈ సమావేశం పరిష్కరించే అవకాశాలు కనిపించడం లేదు. అమెరికా చర్యల వల్ల తలెత్తిన శూన్యాన్ని భర్తీ చేసేలా పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి ఉక్రెయిన్‌కు అందుతుందని కూడా భావించడం లేదు.

ప్రశ్నించే గొంతులపై 'స్టీల్' యాజమాన్యం దాడి

- అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు



విశాఖపట్నం : ఉక్కు కార్మికుల సమస్యలపై పోరాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్‌కు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గత ఏడాది అక్టోబర్ ఆరు, ఈ ఏడాది జనవరి 21, 22న స్టీల్‌ప్లాంట్ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ సోషల్ మీడియాకు, పత్రికలకు ప్రకటనలు ఇచ్చారని, కంపెనీకి వ్యతిరేకంగా ప్రకటన ఇచ్చినందుకుగాను మీపై క్రమశిక్షణ చర్యలను ఎందుకు తీసుకోకూడదో వివరించాలంటూ షోకాజ్ నోటీసులో పేర్కొంది. కంపెనీ సర్టిఫైడ్ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం ప్రతి ఉద్యోగి కంపెనీ ప్రతిష్టను పెంచే విధంగా ఉండాలి గానీ ప్రతికూల విమర్శలు లేదా పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయకూడదని తెలిపింది. ముందస్తు అనుమతి లేకుండా ప్రెస్‌ను ఆశ్రయించడం కంపెనీకి అపకీర్తి తెచ్చినట్లుగా ఆ నోటీల్లో పేర్కొంది. నోటీసులు అందించిన రోజు నుంచి ఏడు రోజులలోపు సంతకం చేసి యాజమాన్యానికి సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో తదనంతర చర్యలకు పూనుకుంటామని పేర్కొంది. ఈ నోటీస్ డిసిప్లినరీ అథారిటీ ఎంఎంఎస్ డిపార్టుమెంట్ నుంచి జనరల్ మేనేజర్ ఉమాకాంత్ గుప్తా జారీ చేశారు.

పోరాడితే నోటీసులా : అయోధ్యరామ్

సంస్థ అభ్యున్నతి కోసం ప్రతి కార్మికుడూ శక్తివంచన లేకుండా కష్టపడి పని చేస్తారని, కార్మికునికి కష్టం వస్తే ప్రశ్నించే గొంతుకనవుతానని అయోధ్యరామ్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జారీ చేసిన షోకాజ్ నోటీసులు కార్మికుల సమస్యలపై పోరాడటాన్ని నిలుపుదల చేయలేవన్నారు. సిఐటియుగా కార్మికుల సమస్యలపై స్టాండ్ తీసుకున్నామని, కార్మికులకు అన్యాయం చేస్తే భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున పోరాడుతామని అన్నారు. విఆర్‌ఎస్‌పైనా, కాంట్రాక్ట్ కార్మికుల జీతభత్యాల సమస్యపైనా పోరాడుతున్నామని తెలిపారు. ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా అర్ధరూపాయి యూనిట్ కరెంటు ఛార్జీని ఎనిమిది రూపాయలకు పెంచడం సరికాదని, హెచ్‌ఆర్‌ఎను తొలగించడం అన్యాయమని తాను మాట్లాడినందుకు షోకాజ్ నోటీసులు అందించారని తెలిపారు.

పోలీసులు తీసుకువెళ్లిన దళిత బాలుడి మృతి

- తల్లిదండ్రుల అనుమానాలు



(ఫైల్)

ఏలూరు : ద్విచక్రవాహనాల చోరీ కేసులో పోలీసులు తీసుకువెళ్లిన దళిత బాలుడు మృతి చెందిన సంఘటన ఏలూరులో కలకలం రేపింది. పోలీసులే తమ కుమారుడిని చంపారంటూ తల్లిదండ్రులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు. మృతుని తల్లిదండ్రులు, బంధువుల కథనం మేరకు... ఏలూరు చేపలతూము సెంటర్‌కు చెందిన దళిత బాలుడు బంగారు యశ్వంత్ (17) స్థానికంగా పదవ తరగతి చదువుతున్నారు.నాలుగు రోజుల క్రితం రాత్రిపూట పోలీసులు ఇంటికి వచ్చి తమ మనవడు యశ్వంత్‌ను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ద్విచక్రవాహనాల చోరీ కేసులో తీసుకెళ్తున్నట్లు పోలీసులు తెలిపారని ఆమె నాయనమ్మ చెప్పారు. తమ మనవడు ఆసుపత్రిలో చనిపోయి ఉన్నట్లు కొందరు గుర్తించి తమకు సమాచారం ఇచ్చారన్నారు. సిసిఎస్ పోలీసులే తమ కుమారుడిని చంపేశారంటూ యశ్వంత్ తండ్రి శివ ఆరోపిస్తున్నారు. పోలీసులు చంపారు అనడానికి తమ కుమారుడు ఒంటిపై ఉన్న దెబ్బలే నిదర్శనమన్నారు. బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించడానికి సర్వజన ఆసుపత్రికి వచ్చిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని యువకుడి తల్లిదండ్రులు, బంధువులు కలిశారు. ఘటనపై విచారించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని ఆమె తెలిపారు.

యశ్వంత్ మృతికి సంబంధించి పెదవేగి పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఎఫ్‌ఐఆర్ నమోదైంది. పోలవరం కాలువ గట్టు వద్దకు బహిర్భూమికి వెళ్లి స్పృహతప్పి పడిపోయినట్లుగా చూసిన వారు కుటుంబసభ్యులకు సమాచారం అందించారని, గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించినట్లు, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు బాలుడి అన్న బంగారు కృష్ణవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం సాయంత్రం పెదవేగి పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.

న్యాయ విచారణ జరిపించాలి : సిపిఎం

దళిత బాలుడి మృతిపై జిల్లా కలెక్టర్ న్యాయ విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి, పట్టణ నాయకులు డిఎన్‌వి ప్రసాద్ డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని కోరారు.

బిజినెస్

జియోస్టార్‌లో 1100 మంది ఉద్యోగులకు ఎసరు



న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు చెందిన వయాకామ్ 18, వాల్ట్ డిస్నీ ఇండియా యూనిట్ల మధ్య కొత్తగా ఏర్పడిన సంయుక్త భాగస్వామ్య సంస్థ జియోస్టార్‌లో 1100 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారని తెలుస్తోంది. నెల రోజుల కిందటే తొలగింపుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ఉద్వాసనలు ఇప్పట్లో ముగియవని.. జూన్ వరకు కొనసాగుతాయని సంబంధిత అధికారి ఒక్కరు పేర్కొన్నట్టు జాతీయ మీడియాల్లో రిపోర్టులు వస్తోన్నాయి. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్, ఫైనాన్స్, కమర్షియల్, లీగల్ విభాగాల్లో తొలగింపులు ఉంటున్నాయి. వేటు పడిన వారిలో ఎంట్రీ లెవల్ ఉద్యోగులు, సీనియర్ మేనేజర్లు, సీనియర్ డైరెక్టర్లు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ స్థాయి ఉద్యోగులు కూడా ఉన్నారు. వయాకామ్ 18, డిస్నీ స్టార్ ఇండియా విలీనాన్ని దేశంలోనే అతిపెద్ద మీడియా సంస్థ సృష్టిగా ఆ పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. రెండు పెద్ద కంపెనీలు ఏకమైనప్పుడు సిబ్బందిపై వేటు ఉంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

కాగా.. ఛాంపియన్స్ ట్రోఫీ, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వంటి వాటిల్లో పని చేస్తోన్న ఉద్యోగులపై ప్రభావం ఉండదని సమాచారం. 2025లో భారీ లాభాలను ఆర్జించాలని జియోస్టార్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే సిబ్బందికి ఎసరు పెడుతోంది. ఉద్యోగం కోల్పోయిన వారికి వారి పదవీకాలాన్ని బట్టి 6 నుంచి 12 నెలల జీతంతో సహా ఇతర ప్యాకేజీలను అందించనున్నట్లు తెలుస్తోంది. బాధిత ఉద్యోగులకు ఒకటి నుంచి మూడు నెలల వరకు నోటీస్ పీరియడ్‌తో పాటు కంపెనీలో పూర్తయిన ప్రతి ఏడాదికి ఒక నెల పూర్తి వేతనం లభిస్తుంది. 2024 నవంబర్‌లో రిలయన్స్‌కు చెందిన వయాకామ్18, స్టార్ ఇండియా మధ్య జాయింట్ వెంచర్‌గా జియో స్టార్ ఏర్పడింది. ఐపిఎల్ 2025 కోసం జియోస్టార్ రికార్డు స్థాయిలో రూ.5,000 కోట్ల ప్రకటనల రెవెన్యూ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

జెంటియం క్యాపిటల్ భారీ పెట్టుబడుల ప్రణాళికలు

Gentium Capital

Right finding and right sizing business solutions

హైదరాబాద్ : గ్లోబల్ ప్రయివేట్ ఈక్విటీ సంస్థ జెంటియం క్యాపిటల్ భారత్‌లో ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదన ఇంధనం, రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో భారీ పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించింది. వచ్చే ఐదేళ్లలో 5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.43,550 కోట్లు) వ్యయాలను చేయనున్నట్లు వెల్లడించింది. పూణేలో తన మొదటి కార్యాలయాన్ని ప్రారంభించినట్లు జెంటియం క్యాపిటల్‌లో మేనేజింగ్ పార్టనర్ అభిషేక్ బాల్ తెలిపారు. దేశంలో మధ్యతరగతి విస్తరిస్తోన్న నేపథ్యంలో ఇక్కడ విశేష అవకాశాలున్నాయన్నారు. తమ పోర్ట్‌ఫోలియోలో 50 శాతం నిధులు ఆరోగ్య సంరక్షణకు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

బ్రిటానియా సీఈఓ రజనీత్ రాజీనామా



న్యూఢిల్లీ : ప్రముఖ బేకరీ ఆహారోత్పత్తుల సంస్థ బ్రిటానియా ఇండస్ట్రీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) రజనీత్ సింగ్ కోహ్లీ అనుహ్యంగా తన పదవికి రాజీనామా చేశారు. మార్చి 14 తర్వాత ఆయన కంపెనీని వీడనున్నారని బ్రిటానియా సంస్థ గురువారం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. కంపెనీకి వెలుపల ఇతరత్రా అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కోహ్లీ రాజీనామా చేశారని తెలిపింది. 2022 సెప్టెంబర్‌లో నుంచి సంస్థ సీఈఓగా కోహ్లీ బాధ్యతలు నిర్వహించారు.

నాయిస్ నుంచి టీడబ్ల్యూఎస్ మాస్టర్ బడ్స్

హైదరాబాద్ : ప్రముఖ లైఫ్‌స్టైల్ టెక్ బ్రాండ్ నాయిస్ కొత్తగా బోస్ శబ్దంతో తమ తదుపరి తరం టీడబ్ల్యూఎస్ మాస్టర్ బడ్స్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఒనిక్స్, టైటానియం, సిల్వర్ రంగుల్లో లభించే వీటి ధరను రూ.7,999గా నిర్ణయించింది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో అభ్యమవుతాయని పేర్కొంది. అధునాతన్ 49డిబి ఎఎన్‌సిని కలిగి ఉన్న నాయిస్ మాస్టర్ బడ్స్ ఆకర్షణీయమైన ఎంపిక కానుందని నాయిస్ కో-ఫౌండర్ అమిత్ ఖత్రి తెలిపారు.

అమెజాన్ బిజినెస్ బి2బి డిస్కౌంట్ సేల్

బెంగళూరు : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనున్న నేపథ్యంలో బి2బి కస్టమర్ల కోసం డిస్కౌంట్ సేల్‌ను అందిస్తున్నట్లు అమెజాన్ బిజినెస్ తెలిపింది. ఇందులో జీఎస్టీ ఇన్ వాయిస్‌తో 28 శాతం వరకు ఆదా చేసుకోవచ్చని పేర్కొంది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుపై అదనంగా 10 శాతం తగ్గింపు పొందవచ్చని ఆ సంస్థ పేర్కొంది. డెల్, హెచ్‌పి, బోట్, జెబిఎల్, పిజియన్ తదితర ప్రముఖ బ్రాండ్స్ ఉత్పత్తులపై 80 శాతం వరకు ధరల తగ్గింపు ఉంటుందని వెల్లడించింది.

బంధన్ ఎంఎఫ్ నుంచి కొత్త డెట్ ఇండెక్స్ ఫండ్

ముంబయి : బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా బంధన్ క్రిసిల్-ఐబిఎక్స్ ఫైనాన్సియల్ సర్వీసెస్ 3-6 మంత్స్ డెట్ ఇండెక్స్ ఫండ్‌ను విడుదల చేసినట్లు తెలి పింది. స్వల్పకాల పెట్టుబడులు, ఆదాయాలకు ఇది మద్దతునిస్తుందని పేర్కొంది. ఈ కొత్త ఫండ్ మార్చి 6 నుంచి 11 వరకు తెరిచి ఉంటుందని వెల్లడించింది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు ఇది బాగా సరిపోతుందని బంధన్ ఎఎంసి సీఈఓ విశాల్ కపూర్ పేర్కొన్నారు.

మీషో ఫుట్‌వేర్ కేటగిరి విస్తరణ

హైదరాబాద్ : పారగాన్, రిలాక్సో, లిబర్టీ లాంటి ప్రముఖ బ్రాండ్‌లను తాజాగా తమ పోర్టల్‌లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తమ ఫుట్‌వేర్ కేటగిరిని విస్తరించినట్లయ్యిందని ఈ-కామర్స్ సంస్థ మీషో తెలిపింది. దీంతో బ్రాండెడ్, అధిక నాణ్యత పాదరక్షలను మరింత అందుబాటులోకి తీసుకు రావడంతో ఇది తమ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొంది. ఈ బ్రాండ్‌లు 2025లో తమ సంస్థ గణనీయ వృద్ధికి దోహదం చేయనున్నాయని ఆ సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.